

పాఠశాలలకు పండుగ

- ఎట్టకేలకు గ్రాంట్లు విడుదల
- 2,168 స్కూళ్లకు నిర్వహణ నిధులు
- రూ.3.32 కోట్లు ఇస్తూ ఉత్తర్వులు



ఒంగోలు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వరంగ పాఠశాలలకు పండుగ వచ్చింది. ఎట్టకేలకు నిధులు విడుదలయ్యాయి. ఏడాదిన్నర నుంచి ఒక్క రూపాయి గ్రాంటు కూడా రాలేదు. దీంతో పాఠశాలల నిర్వహణ కష్టంగా మారింది. ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు వెచ్చించి నెట్టుకొచ్చారు. వారి ఇబ్బందులను గమనించిన కూటమి ప్రభుత్వం పాఠశాలలకు గ్రాంటు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం పాఠశాల గ్రాంటులో 50 శాతం, మండల విద్యావనరుల కేంద్రాలకు 38 శాతం మొత్తం రూ.3.32 కోట్లు విడుదల చేసింది. జిల్లాలోని 3,105 పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, పీఎంశ్రీ స్కూళ్లు, కేజీబీవీలు, సొసైటీ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో పీఎంశ్రీ పాఠశాలలు, కేజీబీవీలు, జూనియర్ కళాశాలలకు గ్రాంటు విడుదల చేశారు. 2022-23 యూడైస్ వివరాల ప్రకారం విద్యార్థుల సంఖ్య ప్రామాణికంగా కేటాయించారు. 2024-25 విద్యా సంవత్సరానికి కేంద్ర ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు జిల్లాకు రూ.5.66 కోట్లను మొదటి విడతగా విడుదల చేస్తూ సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీచేశారు. సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్టు చైర్మన్ అయిన కలెక్టర్‌కు ఫైల్‌పెట్టి పాఠశాలలకు నిధులు విడుదల చేయనున్నారు.

ఎమ్మార్సీలకు రూ.49.40 లక్షలు

జిల్లాలోని 38 ఎమ్మార్సీలకు రూ.49.40 లక్షలు విడుదల చేశారు. ఒక్కో ఎమ్మార్సీకి రూ.1.30 లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. ఈ మొత్తంలో ఎమ్మార్సీ నిల్వ ఖాతాకు రూ.30వేలు, కంటింజెన్సీ కింద రూ.40వేలు, టీఎల్ఎం గ్రాంటుకు రూ.30వేలు, మీటింగ్ టీఏకు రూ.30వేలు కేటాయించారు. ఈ నిధులను కరెంటు బిల్లుల చెల్లింపు, టాయిలెట్లు, ఎమ్మార్సీల నిర్వహణకు, మరమ్మతులకు వినియోగించాల్సి ఉంటుంది. టీఎల్ఎం గ్రాంటును పుస్తకాల కొనుగోలుకు, టీఎల్ఎం కొనుగోలుకు, మండల స్థాయి ప్రదర్శనలు, క్విజ్ పోటీల నిర్వహణకు ఉపయోగించాలి. కంటింజెన్సీ గ్రాంటును ఇంటర్నెట్ చార్జీల చెల్లింపునకు, అవసరమైన సామగ్రి కొనుగోలు, మైనర్ రిపేర్లకు వినియోగించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

- తప్పులతడకగా భూముల వివరాలు
- సరిచేయకుండానే పాస్‌పుస్తకాలు
- ప్రస్తుతం ఆగిపోయిన సైట్
- పొలాలకు రాని 1-బీ, ఇతర ధ్రువీకరణ పత్రాలు
- రుణాలు పొందలేక రైతుల ఇక్కట్లు
- ఆగిన పొలాల రిజిస్ట్రేషన్లు
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకంతో అల్లాడుతున్న రైతులు

రీసర్వే కష్టాలు



రీసర్వే తప్పులతడకగా మారింది. కొందరికి భూమి విస్తీర్ణం ఎక్కువ, మరికొందరికి తక్కువగా నమోదైంది. వాటిని సరిచేయకుండా అలాగే పాసు పుస్తకాలు ఇచ్చారు. దీంతో అనేక కొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పెరిదేపి, ముప్పవరం గ్రామాల్లో ఒక సర్వే నంబర్‌లో పది ఎకరాల పొలాన్ని ముగ్గురు ఒక్కొక్కరు 3.33 ఎకరాల చొప్పున పంచుకున్నారు. రీసర్వే అనంతరం పది ఎకరాల మొత్తం విస్తీర్ణం ముగ్గురికీ ఒక్కొక్కరికి పది ఎకరాల చొప్పున 30 ఎకరాలు ఉన్నట్లు చూపారు. ఆవిధంగానే పాసుపుస్తకాలు కూడా ఇచ్చారు. దీంతో సర్వే నంబర్‌లో ఉన్న విస్తీర్ణం కంటే 20 ఎకరాలు ఎక్కువగా నమోదైంది. ఇలాంటి చిత్రవిచిత్రాలు అనేకం చోటుచేసుకున్నాయి.

పక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నెప్పల నారాయణ. కొండపి మండలంలోని గుర్రప్పడియ గ్రామానికి చెందిన ఆయన హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో ఆయన తండ్రి బ్రహ్మయ్య మరణించారు. బ్రహ్మయ్య పేరుతో ఐదెకరాల పొలం ఉంది. కానీ దాన్ని తన తల్లి పేరుకు మార్చాలని నారాయణ రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అయితే ఆ గ్రామంలో రీసర్వే జరిగి ఉండటం, రీసర్వే చేసిన ఊళ్లకు సంబంధించిన వెబ్‌సైట్ ఆగిపోయినందున మార్చేందుకు కుదరదని రెవెన్యూ అధికారులు చెప్తున్నారు. ఈ కారణంతో బ్యాంకు అధికారులు రుణం కూడా ఇవ్వడం లేదు. దీంతో ఆయన దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇది మచ్చుకు ఉదాహరణ మాత్రమే. కొండపి నియోజకవర్గంలో రీసర్వే జరిగిన 40 గ్రామాల్లో ఇలాంటి ఏదో ఒక సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



తండ్రి పేరుతో ఉన్న కాగితాన్ని చూపిస్తున్న నారాయణ



రుణం తీసుకోలేకపోతున్నా..



నాకు నాలుగు ఎకరాల పొలం ఉంది. ప్రస్తుతం 1-బీ, టెన్ వన్ అడంగల్ ఆన్‌లైన్‌లో రావడం లేదు. దీంతో బ్యాంకులో రుణం తీసుకోలేకపోతున్నా. ఒకటి, రెండు సర్వే నంబర్‌లలో విస్తీర్ణం తప్పుగా నమోదైంది. వాటిని అధికారులు సరిదిద్దాలన్నా ఆసర్వే నంబర్‌లలో సమస్యలేని రైతులు ముందుకు రావడం లేదు. వారి పొలం వారికి ఉంది. ఇప్పుడు వారు సర్వేకు ఎంత వరకు సహకరిస్తారో తెలియడం లేదు.

- బొడ్డపాటి సుధాకర్‌రావు, రైతు, ముప్పవరం

కొడుకు చదువుకు అప్పు పొందలేకపోతున్నా



నాకు పది ఎకరాల పొలం ఉంది. 1-బీ ఆన్‌లైన్‌లో వస్తోంది. బ్యాంకుకి తనఖా పెట్టి నా కొడుకును ఉన్నత చదువుల కోసం ఫారిన్ పంపాల్సి ఉంది. రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళితే సైట్ ఓపెన్ కావడం లేదని చెబుతున్నారు. పొలాన్ని అమ్ముకోవాలన్నా వీలు కావడంలేదు. బ్యాంకులో రుణం తీసుకోలేకపోతున్నా. చాలా ఇబ్బందిగా ఉంది.

- కె. శ్రీనివాసరెడ్డి, రైతు, గుర్రప్పడియ



కొండపి, అక్టోబరు 23 : రైతులకు వరం రీసర్వే అని గత వైసీపీ ప్రభుత్వ ఊదరగొట్టింది. రూ.లక్షలు వెచ్చించి రెండు విడతలుగా కార్యక్రమం చేపట్టింది. అధికారులను ఉరుకులుపరుగులు పెట్టించడంతో వారు ఆగమేఘాలపై రీసర్వే చేశారు. అయితే సర్వే తప్పుల తడకగా ఉండటం, వాటిని సరిచేయకుండా పాసుపుస్తకాలు ఇవ్వడంతో హక్కుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రీసర్వేలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. అధికారులు రైతుల పొలాల గట్లు మధ్య ఉన్న దానినే కొలిచి హద్దులు నిర్ణయించి అనుభవంలో ఉన్న భూ యజమానులకు పాసు పుస్తకాలు ఇచ్చారు. అయితే ఉమ్మడిగా రైతులు ఒకే పెద్ద సర్వే నంబర్‌లో ఉంటే అందరికీ కలిపి భాగపంపిణీ చేసుకున్న విస్తీర్ణం కాకుండా సర్వే నంబర్‌లో ఎంత విస్తీర్ణం ఉంటే అంత అందరికీ వేయడం సరికొత్త సమస్యలు సృష్టించింది.

పరిష్కారం కాని వివాదాలు

సరిహద్దు వివాదాలు ఉన్న పొలాలను కొలవడం కానీ, సమస్యను పర్కిరించడం కానీ అధికారులు చేయలేదు. విస్తీర్ణం

మిగతా 6వ పేజీలో

గత వైసీపీ ప్రభుత్వం భూముల సమస్య పరిష్కారం పేరుతో చేపట్టిన రీసర్వే గ్రామాల్లో సరికొత్త వివాదాలను సృష్టించింది. రెండు విడతలుగా చేపట్టిన ఈ కార్యక్రమం తప్పులతడకగా ఉండటంతో రైతులకు అనేక తలనొప్పులు వస్తున్నాయి. కొందరికి ఇప్పటి వరకూ అనుభవంలో ఉన్న విస్తీర్ణం తగ్గగా, మరికొందరికి ఎక్కువ నమోదు చేశారు. కొన్ని సర్వే నంబర్‌లలో ఉన్న విస్తీర్ణం కంటే రెండు, మూడు రెట్లు అధికంగా చూపి పాసుపుస్తకాలు ఇచ్చారు. దీంతో సరికొత్త సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటిని సరిచేయాలని రెవెన్యూ అధికారుల చుట్టూ భూ యజమానులు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం లేకుండా పోయింది. మరోవైపు భూముల రీసర్వే చేసిన గ్రామాలకు సంబంధించిన వెబ్‌సైట్ నిలిచిపోయింది. 1బీ అడంగల్, ఇతర ధ్రువీకరణపత్రాలు రైతులు తీసుకునే వీలులేకుండా పోయింది. దీంతో బ్యాంకుల నుంచి పంట రుణాలు పొందలేకపోతున్నారు. మరోవైపు భూముల క్రయవిక్రయాలు కూడా నిలిచిపోయాయి. ఫలితంగా అవసరాలు, పిల్లల చదువులు, వివాహాలకు చేతిలో చిల్లిగవ్వ లేక రైతులు చింతిస్తున్నారు.



సర్వే చేసే పరికరం

పెరుగుతున్న నష్టాలు



మార్కాపురం మండలం చింతకుంటలో దెబ్బతిన్న పత్తిని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

- 9,253.25 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- 205 గ్రామాల్లో నష్టపోయిన 8,429 మంది రైతులు
- ఉద్యాన శాఖ పరిధిలో 1,198.62 హెక్టార్లలో నష్టం
- వ్యవసాయశాఖ అంచనా

ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వర్షం తగ్గి ఎండలు వస్తుండగా వివిధ రకాల పంటలకు జరిగిన నష్టాలు వెలుగుచూస్తున్నాయి. పలు పంటలు ఉరకెత్తిపోతుండగా మరికొన్ని కోత దశలో ఉండి దెబ్బతింటున్నాయి. తాజా అంచనా ప్రకారం వ్యవసాయశాఖ పరిధిలో 9,253.25 హెక్టార్లలో వివిధ రకాల పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన శాఖ పరిధిలో 1,198.62 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అంచనా. జిల్లాలో ఈనెల 11 నుంచి ప్రారంభమైన వర్షాలు 21 వరకు పది రోజులకుపైగా కొనసాగాయి. ఇంచుమించు అన్ని ప్రాంతాల్లోనూ భారీవర్షాలు కురవడమేకాక రోజుల తరబడి ముసురుపట్టింది. దీంతో పంట దశలో ఉన్న

మిగతా 6వ పేజీలో



వెలుగులోకి అక్రమాలు

- కలెక్టర్ ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా బదిలీ ఉత్తర్వులు
- 45 మంది సచివాలయ ఉద్యోగులకు రెండు ఆర్డర్లు
- 53 మందిని నిబంధనలకు విరుద్ధంగా గ్రేడ్-4కు బదిలీ
- ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు బుట్టదాఖలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరించిన పూర్వ డీపీవో ఉషారాణి
- పవన్ కల్యాణ్ అపాయింట్‌మెంట్ తీసుకున్నానంటూ కమిటీని భయపెట్టే ప్రయత్నం
- కలెక్టర్‌కు చేరిన నివేదిక

ఒంగోలు (కలెక్టరేట్), అక్టోబరు 23 : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలోని గ్రేడ్-5,6 (సచివాలయ కార్యదర్శులు) ఉద్యోగుల బదిలీల్లో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు, కలెక్టర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా జిల్లా పంచాయతీ పూర్వ అధికారి ఉషారాణి ఇష్టారీతిన బదిలీలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందులో పంచాయతీ కార్యాలయ ఉద్యోగులను బలిచేసే యత్నం చేశారు. ఉద్యోగుల బదిలీల్లో భారీ అవినీతి, అక్రమాలు జరగడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమగ్ర విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. పారెన్సు

మిగతా 6వ పేజీలో



ఉపాధిలో ఉత్తరం

వృత్తి పనుల్లో నార్త్ ఇండియన్స్

- ఊరు వదిలి తెలుగు రాష్ట్రాలకు
- వారి పనిని మెచ్చుతున్న స్థానికులు
- టీ కొట్టు నుంచి స్టీల్ వ్యాపారం వరకు వారే
- జిల్లాలో స్థిరపడ్డవారు 50 వేల మందికిపైనే

7

వై.పాలెం టు కోలార్

- పేదల బియ్యం యథేచ్ఛగా పక్కదారి
- మామూళ్ల మత్తులో కన్నెత్తిచూడని అధికారులు

ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఎర్రగొండపాలెం కేంద్రంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. పేదలకు అందాల్సిన బియ్యం అధికారుల సహకారంతో యథేచ్ఛగా పక్కదారి పడుతున్నాయి. ఎర్రగొండపాలెం గోడౌన్ నుంచి కర్నాటక రాష్ట్రంలోని కోలార్‌కు రాత్రికిరాత్రే తరలిపోతున్నాయి. అడ్డుకోవాల్సిన యంత్రాంగం మాత్రం తమకేమీ తెలియదన్నట్లు సహకారం అందిస్తూ లక్షల రూపాయలను జేబుల్లో వేసుకుంటోంది. మంగళవారం రాత్రి కంభంలో మర్కాపురం సబ్ కలెక్టర్ పట్టుకున్న బియ్యం ఎర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు నుంచి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో 132 రేషన్ షాపులు ఉన్నాయి. వీటికి 900 టన్నుల రేషన్ బియ్యాన్ని ప్రతి నెలా 25 నుంచి 1వ తేదీ లోపు సరాఫరా చేస్తారు. అయితే లారీ ట్రాన్స్‌పోర్టును అడ్డం పెట్టుకొని బియ్యం వ్యాపారులు డీలర్లకు అరకొరగా సరాఫరా చేసి మిగిలినదాన్ని రాత్రికి రాత్రి ప్రత్యేక గౌడౌన్‌లకు తరలించి అక్కడ గోనె సంచులకు మార్చి అక్రమంగా రవాణా చేస్తున్నారు. డీలర్లకు కిలోకు రూ.15 చెల్లించి ఆ బియ్యాన్ని కర్నాటక జిల్లా కోలార్‌కు తరలించి అక్కడ రూ.30కి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన పౌరసరఫరాల సంస్థ, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారులు ఆవైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. ఇప్పటికైనా అధికారులు రేషన్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



పట్టుబడిన రేషన్ బియ్యం లారీ సబ్ కలెక్టర్ వెంకట్రత్రివినాగ్, రెవెన్యూ సిబ్బంది

600 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

వెంబడించి లారీని పట్టుకున్న మార్కాపురం సబ్‌కలెక్టర్

కంభం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం మండలం అమానిగుడిపాడు నుంచి కర్నాటకలోని బంగారుపేటకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీని మార్కాపురం సబ్‌కలెక్టర్ వెంకట నాగత్రివినాగ్ వెంబడించి పట్టుకున్నారు. 600 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు.. రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్లు సబ్‌కలెక్టర్‌కు బుధవారం తెల్లవారుజామున ఫోన్‌లో అజ్ఞాత వ్యక్తి తెలిపారు. దీంతో ఆయన కంభం, బేస్తవారపేట రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులను తీసుకొని ఆయన స్వయంగా లారీని వెంబడించారు. కంభంలోని కందులాపురం సెంటర్‌లో పట్టుకున్నారు. ఈదాడుల్లో బేస్తవారపేట తహసీల్దార్ జితేంద్ర, కంభం, కందులాపురం వీఆర్వోలు బాషా, వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



కుక్కలు, గాడిదలనూ లెక్కిస్తారు..!

- రేపటి నుంచి పశుగణన ప్రారంభం
- నాలుగు నెలలు సాగనున్న కార్యక్రమం
- ఈసారి వివరంగా డిజిటల్ రూపంలో నమోదు
- 400 మందికి పైగా ఉద్యోగుల నియామకం
- శిక్షణ కూడా పూర్తి

6

మునిసిపల్ టీచర్లకు త్వరలో ఉద్యోగోన్నతులు

- పాఠశాల విద్య కమిషనర్ అంగీకారం
- ధర్నాను వాయిదా వేస్తున్నట్లు యూటీఎఫ్ ప్రకటన

7

కుక్కలు, గాడిదలనూ లెక్కిస్తారు

● రేపటి నుంచి పశుగణన ప్రారంభం
● నాలుగు నెలలు సాగనున్న కార్యక్రమం
● ఈసారి వివరంగా డిజిటల్ రూపంలో నమోదు



ఒంగోలు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా 21వ పశుగణన కార్యక్రమం ఈనెల 25 నుంచి ప్రారంభం కానుంది. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేళ్లకు ఒకసారి జిల్లా యూనిట్‌గా పశుగణనను కేంద్రప్రభుత్వం చేపడుతుంది. ఆ గణాంకాల ఆధారంగా పశు అభివృద్ధి పథకాలకు రూపకల్పన చేస్తారు. అయితే పశువులు అంటే సాధారణంగా అందరూ అనుకునే గేదెలు, ఆవులే కాకుండా ఈసారి వీధికుక్కలు, గాడిదలు వంటి వాటిని కూడా లెక్కించనున్నారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే పశుగణన దేశంలో ఇప్పటికి దాకా 20 సార్లు జరిగింది. (20వ గణన) 2019లో జరగ్గా 21వ పశుగణన ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సాగనుంది. పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశుసంపద లెక్కిస్తారు. మొత్తం 16 కేటగిరీల వివరాలను సేకరిస్తారు. కేంద్ర పశుగణాభివృద్ధిశాఖ మంత్రి రాజీవ్ రతన్‌సింగ్ ఢిల్లీలో ఈ ప్రక్రియను ఈనెల 25న ప్రారంభించనుండగా అదేరోజున దేశవ్యాప్తంగా చేపడతారు. తదనుగుణంగా జిల్లాలోనూ పశుసంవర్ధకశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గణనలో 400మంది

పశుగణను తొలుత సెప్టెంబరు 1 నుంచి చేపట్టాలని భావించినప్పటికీ పలు కారణాలతో వాయిదా పడింది. ప్రస్తుతం దాన్ని చేపడుతున్నారు. జిల్లాలో పశుగణన కోసం దాదాపు 400మందికిపైగా ఉద్యోగులు పనిచేయనున్నారు. పశుసంవర్ధశాఖ కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రమోహన్ జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. మొత్తం 71మంది పశువైద్యులు, ఇతర అధికారులు సూపర్‌వైజర్లుగా ఉంటారు. వారి పర్యవేక్షణలో మొత్తం 348 మంది గ్రామ స్థాయి వెటర్నరీ అసిస్టెంట్లు, వెటర్నరీ ఆసుపత్రుల్లోని పారా సిబ్బంది క్షేత్రస్థాయిలో గణన చేయనున్నారు. పట్టణం, పల్లె తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశుసంపద వివరాలను సేకరిస్తారు. గేదెలు, ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్లతోపాటు ఉంటే గుర్రాలు, గాడిదలు వంటి మొత్తం 16 రకాల కేటగిరీలకు చెందిన వాటి వివరాలను సేకరిస్తారు. అన్ని ఇళ్లకు వెళ్లి అక్కడ ఉన్న పశువుల వివరాలు సేకరించే సిబ్బంది ఎలాంటి పశు సంపద లేకపోతే ఆ విషయాన్ని కూడా నమోదు చేస్తారు. అలా ప్రతి ఇంటికి వెళ్లి సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

వీధి కుక్కలు కూడా..

ఈసారి వీధి కుక్కల వివరాలను సైతం సేకరించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో వాటిని కూడా నమోదు చేయాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు. అంతేకాక గతంలో రిజిస్టర్లలో ఈ వివరాలను నమోదు చేస్తుండగా ఈసారి పశుగణన ప్రక్రియ మొత్తం డిజిటల్ చేస్తున్నారు. ఒకేసారి యాప్‌లో వివరాలను నమోదు చేసేందుకు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలో పశుగణనపై అవగాహనకు సంబంధించిన పోస్టర్లను మంగళవారం రాత్రి కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. వాటిని ఆయా ప్రాంతాల్లోని పశుసంవర్ధకశాఖ కార్యాలయాలు, ఆస్పత్రులకు కూడా పంపిణీ చేశారు. కాగా జిల్లాలో పశుగణకు సంబంధించి అన్నిఏర్పాట్లు పూర్తిచేసినట్లు నోడల్ అధికారి డాక్టర్ చంద్రమోహన్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో గణన ప్రారంభించేలా సిబ్బందికి సూచించామన్నారు. పశుగణన అంశాలు ప్రభుత్వాలు సంబంధిత పథకాల రూపకల్పనలో ప్రధానం కానున్నాయని చెప్పారు. ఇళ్లకు వచ్చి ఇందుకు సంబంధించిన వివరాలు కోరిన సిబ్బందికి పూర్తి వివరాలు తెలియజేసి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

చేయాలనుకున్నారు.. కానీ..

● నగరంలో నిరుపయోగంగా బస్టాప్‌లు
● ఏడాదిన్నర క్రితం ఆర్టీసీ బస్సుల నిలుపుదలపై హడావుడి
● నిధుల సమస్యతో ఆయా శాఖలు వెనకడుగు
● మరమ్మతులు, నిర్వహణపై ముందుకు రాని వైనం
● నేటికీ పట్టించుకోని వైనం



రిమ్స్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌లో హోటల్ నిర్వహణ

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో బస్టాప్‌లు నిరుపయోగంగా మారాయి. అధికారయంత్రాంగం వాటి నిర్వహణను గాలికొదిలేయడంతో వాటి బాగోగులు పట్టించుకున్న నాధుడే కరువయ్యారు. వాటిని వినియోగంలోకి తీసుకువస్తే ప్రజలకు కొంతమేర ఆర్టీసీ బస్సులు సైతం నగరంలోని నుంచి వెళ్ళే పరిస్థితి ఉంది. ఈక్రమంలో నిధులు, నిర్వహణ, మరమ్మతులు తదితర అంశాలపై ఆర్టీసీ, ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు వెనకడుగు వేశాయి. దీంతో బస్టాప్‌లు నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఏడాదిన్నర క్రితం హడావుడి

గత ఏడాది ఫిబ్రవరి 23న నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు చర్యలు చేపట్టారు. అందులో ఆర్టీసీ బస్సులు కూడా భాగం అవుతున్న నేపథ్యంలో నిర్దిష్టమైన బస్టాప్‌లను గుర్తించారు. అప్పటి కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు రోడ్డు రవాణా శాఖ, ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసులు రెండు, మూడు రోజులపాటు నగరంలో పర్యటించి 24 ప్రదేశాలను గుర్తించారు. ఆ తర్వాత ఆర్టీసీ బస్సులు నగరంలో ఎక్కడపడితే అక్కడ ఆగకుండా ఆయా బస్టాప్‌ల వద్ద మాత్రమే ఆపాలని నిర్ణయించారు. అక్కడ మాత్రమే ఇక నుంచి బస్సులు నిలపాలని, ఆ విషయాన్ని ప్రయాణికులకు అవగాహన కల్పించాలని, దీంతో నగరంలో ట్రాఫిక్ సమస్య కొంత తీరుతుందని భావించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, కానీ వాటి నిర్వహణ ఎవరు చేయాలనే దానిపై ఆయాశాఖల మధ్య సమన్వయం లోపించింది.

మరమ్మతులకు రూ.30లక్షలు పైనే..

నగరంలోని బస్టాప్‌లు గత కొన్నేళ్ళుగా నిరుపయోగంగా ఉన్నాయి. కుర్చీలు విరిగిపోయి, షెడ్లు తుప్పు పట్టి, ఫ్లోరింగ్ పగిలిపోయి, కొన్ని చోట్ల కనీసం కూర్చునేందుకు కూడా వీలు లేకుండా ఉన్నాయి. మరోవైపు విద్యుత్ సౌకర్యం లేకపోగా, ప్రస్తుతం అవి యాచకులకు, నిరాశ్రయులకు కేంద్రంగా మారాయి. మరికొన్ని చోట్ల పేరుకు బస్టాప్‌గా ఉన్నా, అక్కడ నిలువ నీడ కూడా లేని పరిస్థితి. అయితే వాటన్నిటినీ బాగు చేయించి, రంగులు వేసి, విద్యుత్ సౌకర్యం, కుర్చీలు ఏర్పాటు, పూర్తిస్థాయిలో ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలటే ఒక్కో బస్టాప్‌కు కనీసం రూ.1.5లక్షలు ఖర్చు చేసినా, సుమారుగా రూ.30లక్షలు పైనే అవసరం. అంతేగాకుండా రోజు తాగునీరు సౌకర్యం, బస్టాప్‌ల నిర్వహణకు నెలవారీ ఖర్చు అదనం. దీంతో ఆయా శాఖల అధికారుల మధ్య అయోమయం నెలకొంది.

> **24 ప్రాంతాల్లో బస్సులు నిలిపేలా నిర్ణయం**
>
> నగరంలో 24ప్రాంతాల్లో బస్సులను ఆపేందుకు అధికారులు నిర్ణయించారు. అందులో భాగంగానే సంఘమిత్ర సమీపంలోని బైపాస్ జంక్షన్, రిమ్స్ ఆసుపత్రి ముందు, నెల్లూరు బస్టాండ్‌లో రెండు, ప్రకాశం భవనం ముందు, బీఎస్ఎన్ ఆఫీసు వద్ద, కొత్తపట్నం బస్టాండ్ సెంటర్, పాత కూరగాయల మార్కెట్, అద్దంకి బస్టాండ్, కర్నూలురోడ్ బైపాస్, మంగమూరు రోడ్ జంక్షన్, జిల్లా గ్రంథాలయం వద్ద ఒకటి బస్టాప్‌లు గతంలోనే ఉండగా, అటు నెల్లూరు వైపు నుంచి ఇటు కర్నూలు వైపు, ఇటు విజయవాడ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఇక్కడ ఆపాలని నిర్ణయించారు. కానీ ప్రాంతాలను గుర్తించిన తర్వాత ఎప్పటి నుంచి వినియోగంలోకి తీసుకురావాలి, ఎవరి నిర్వహించాలి, బస్టాప్‌లు బాగు చేయించడం, అక్కడ తాగునీటి సౌకర్యం, అలాగే ప్రయాణికులకు కుర్చీల ఏర్పాటుపై ఆ మూడు శాఖల మధ్య సమన్వయం లోపించింది. అందిన సమాచారం మేరకు ఆ బాధ్యత తమదికాదంటే కాదు అనే ధోరణిలో ఆయా శాఖలు ఉండటంపై నగరంలో బస్సులు ఆగే విషయంలో సందిగ్ధం నెలకొంది.



కొత్తపట్నం బస్టాండ్ వద్ద..

నిధులు...నిర్వహణలో తలో మాట

ఆయా బస్టాప్‌లను విజయవాడకు చెందిన రెండు తెలుగు రాష్ట్రాల్లో పేరు గడించిన రెండు యాడ్ ఏజెన్సీ సంస్థల ఆధ్వర్యంలో నిర్మించడంతోపాటు, నిర్వహణ బాధ్యతలు గతంలో వారికి అప్పగించారు. వారి ఏజెన్సీ ద్వారా ప్రచురితమయ్యే వివిధ ప్రకటనలను వారే ఏర్పాటు చేసుకోవాలి. అనుమతులు పొందినందుకు ప్రతి ఏటా కార్పొరేషన్‌కు పన్నులు చెల్లిస్తుంటారు. అయితే సందరు ఏజెన్సీలు బస్టాప్‌ల నిర్వహణ కష్టతరం కావడతో ఒంగోలులోని ఓ కాలేజీకి సబ్ లీజుకు ఇచ్చారు. దీంతో బస్టాప్‌ల నిర్వహణతోపాటు ఏటా వారి విద్యాసంస్థలకు చెందిన ప్రకటనలు అన్ని బస్టాప్‌లలో వేసుకుని ప్రచారం చేసుకునేలా ఒప్పందం కుదిరింది. అయితే ప్రతి ఏటా ఎడ్యుకేషన్ సీజన్‌లో మాత్రమే ఆ విద్యాసంస్థకు కాస్తంత ఉపయోగం కనిపిస్తుండగా, మిగిలిన రోజుల్లో పెద్దగా ప్రయోజనం లేకపోయినప్పటికీ వారి పరిధిలోనే బస్టాప్‌ల ప్రకటనల బాధ్యతలు ఉన్నాయి. అయితే ఈ ప్రాంతాల్లో బస్సులు ఆపాలని ఆర్టీఏ, ట్రాఫిక్, ఆర్టీసీ నిర్ణయించగా నిర్వహణకు నిధులు ఎలా అనే సమస్య ఎదురైంది. పన్నులు వసూలు చేసే కార్పొరేషన్ విషయానికొస్తే తమకేమి సంబంధం లేదని వెల్లడిస్తుండగా, యాడ్ ఏజెన్సీ వారు పన్నులు చెల్లిస్తున్నాము..నిర్వహణ సబ్ లీజ్‌కు ఇచ్చామంటున్నారు. ఇప్పటికే లీజుకు నగదు చెల్లిస్తున్నందున నిర్వహణ తమ బాధ్యత కాదంటున్నారు. మరోవైపు ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు ట్రాఫిక్ నియంత్రణ వరకు చూడగలము కానీ అక్కడ వసతులు, వాటి బాగోగులు తమవల్ల కాదనడంతో ఇక ఆర్టీసీ కూడా చేతులెత్తేసింది. ఇందుకోసం ప్రత్యేక నిధులు లేవని చెబుతున్నారు. దీంతో నగరంలో బస్టాప్‌ల వ్యవహారం మూలనపడింది. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి బస్టాప్‌లను వినియోగంలోకి తీసుకు వస్తే సౌకర్యంగా ఉంటుందని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు.



రైల్వేస్టేషన్ వద్ద ఇలా..



అర్జీదారుల నుంచి పాస్‌పుస్తకం తీసుకుంటున్న పొన్నలూరు తహసీల్దార్ పుల్లారావు

రీసర్వే కష్టాలు

(5వ పేజీ తరువాయి)

తగ్గిన రైతు ఆ విషయాన్ని తెలియజేస్తూ ఎక్కడ ఉందో తేల్చమని అధికారులకు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. యథాప్రకారం పాత విస్తీర్ణమే వేసి పుస్తకాలు ఇచ్చారు. కొందరికి సాగులో ఉన్న విస్తీర్ణం కన్నా ఎక్కువ చూపారు. దీంతో సర్వే చేసిన అన్ని గ్రామాల్లో రైతుల మధ్య వివాదాలు పెరిగాయి.

ఆన్‌లైన్‌లో కనిపించని రీసర్వే చేసిన గ్రామాల వివరాలు

రీసర్వే చేసిన గ్రామాల సైట్‌లు ప్రస్తుతం పూర్తిగా ఆగిపోయాయి. ఆయా గ్రామాల రైతులు ఆన్‌లైన్‌లోకి వెళితే భూమి వివరాలు కనిపించడం లేదు. 1-బీ, టెన్‌వన్ అడంగల్, ఇతర ఖాతాల వివరాలు ఏమీ కనిపించడం లేదని పలు గ్రామాల రైతులు వాపోతున్నారు. దీంతో పాసు పుస్తకాలు, పొలాలు ఉన్నా ప్రస్తుతం అవసరాలకు అమ్ముకోలేని దుస్థితి నెలకొంది. రిజిస్ట్రేషన్‌లు కూడా నిలిచిపోతున్నాయి. అవసరమైన పత్రాలు లేకపోవడంతో బ్యాంకులు రుణాలు కూడా ఇవ్వడం లేదు. ప్రారంభంలో బ్యాంకులు రైతులందరినీ కొత్త 1-బీ ఫారం, టెన్‌వన్ అడంగల్‌లు కోరాయి. అయితే అందుబాటులో లేకపోవడంతో మాన్యువల్‌గా తీసుకురమ్మని బ్యాంకు అధికారులు రైతులకు చెప్తున్నారు. అయితే మాన్యువల్‌గా ఇవ్వడం కుదరదని రెవెన్యూ సిబ్బంది అంటుండటంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. కొన్ని బ్యాంకులు ఉన్న కాగితాలతోనే రైతులకు తిరిగి పంట రుణాలు ఇస్తున్నాయి. గతంలో రుణం తీసుకున్న వ్యక్తి మరణించినా, కొత్తగా రైతులు రుణాలు తీసుకోవాలన్నా, తమకు ఇష్టమైన బ్యాంకులోకి ఖాతాలు మార్చుకుందామన్నా వీలుకాని పరిస్థితి ఏర్పడింది. మార్ట్‌గేజ్, చదువుల కోసం రుణాలు ఈ గ్రామాల రైతులకు బ్యాంకులు, సంస్థలు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది.

ప్రతి మండలంలో సగటున ఐదారు గ్రామాల్లో రీసర్వే

ప్రతి మండలంలో దాదాపు ఐదు నుంచి పది గ్రామాల్లో రెండు దశల్లో రీసర్వే కార్యక్రమాన్ని అధికారులు చేశారు. తొలివిడత వివాదాలు లేని, కండ్రిగలను అధికారులు ఎంచుకుని రీసర్వే చేశారు. వీటిలో పెద్దగా పేచీలు రాలేదు. రెండో విడత రీసర్వే చేసిన అన్ని గ్రామాల్లో ఏదోరకమైన సమస్యతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కొండపి నియోజకవర్గంలో దాదాపు 40కిపైగా గ్రామాల్లో రీసర్వే చేశారు. రీసర్వే చేసిన గ్రామాల్లో సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ అధికారులు గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈనెల 22 నుంచి ఇవి మొదలయ్యాయి. వచ్చేనెల 6వతేదీ వరకూ కొనసాగుతాయి.

వెలుగులోకి అనేక అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు చైర్మన్‌గా, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డిలను సభ్యులుగా నియమించారు. వారు రెండురోజుల పాటు నిర్వహించిన విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులను కూడా బుట్టదాఖలు చేసినట్లు గుర్తించిందని సమాచారం.

ఒకరికి రెండు చోట్ల ఆర్డర్లు

ఒక ఉద్యోగికి ఒకచోట మాత్రమే బదిలీ పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా రెండు ఆర్డర్లు ఇచ్చారంటే అవినీతి ఏస్థాయిలో చోటుచేసుకుందో అర్థమవుతుంది. గ్రేడ్-5లో ఆరుగురికి, గ్రేడ్-6లో 39 మంది ఉద్యోగులకు రెండు బదిలీల ఆర్డర్లు ఇవ్వగా ఒక ఉద్యోగికి ఏకంగా మూడు చోట్లకు ఇచ్చిన విషయం త్రిసభ్య కమిటీ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇవ్వడమే కాకుండా, 53 మంది గ్రేడ్-5 ఉద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా గ్రేడ్-4లో నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. కాగా బదిలీల్లో జరిగిన అక్రమాల నేపథ్యంలో ఈనెల 8న సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన తర్వాత ఉషారాణి బదిలీల ఉత్తర్వులపై సంతకాలు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పావుగా వాడుకున్నట్లు సమాచారం. ఆ ఉద్యోగిని పురమాయించి 'నీకు నేను ఉన్నాను. ఎటువంటి భయం లేదని' చెప్పి అతని ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు బయటపడింది.

సీసీ ఫుటేజీ స్వాధీనం..

కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం నుంచి జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న సీసీఫుటేజీ ద్వారా ఉషారాణి ఉంటున్న కార్యాలయంలోకి ఏఉద్యోగి వెళ్లి వస్తుంది కూడా గుర్తించారు. ఆ ఫుటేజీను కూడా సీజ్ చేసి విచారణ నివేదికలో పొందుపర్చడమే కాకుండా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులనే కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారిని కూడా ఇందులో ఇరికించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. రెండు రోజులపాటు జరిగిన విచారణలో ఉషారాణి విచారణాధికారులు అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పకుండా తనకు వారు తెలుసు, వీరు తెలుసంటూ దాటవేసినట్లు సమాచారం. అలా చెప్పడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు తనకు అపాయింట్‌మెంట్ ఉందని, అక్కడ అంతా చెప్తానంటూ విచారణాధికారులను భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

అంతా ఆమె ఇష్టారాజ్యం

త్రిసభ్య కమిటీ చేసిన రెండు రోజుల విచారణలో తాను ఎలాంటి తప్పులూ చేయలేదని, బయట జరిగే పరిణామాలతో తనకేమీ సంబంధం అని పూర్వపు డీపీవో ప్రశ్నించడమే కాకుండా ఇష్టారీతిన మాట్లాడినట్లు తెలిసింది. మరోవైపు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా నగదు లావాదేవీలు తీసుకున్న ఉద్యోగులు పూర్వ డీపీవో ఉషారాణి ఎదుట తాము తాము ఎంత ఇచ్చామో విచారణాధికారులకు చెప్తుంటే ఆమె వారిని కూడా భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం. మరోవైపు గ్రేడ్-5,6 ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన ప్రొసీడింగ్స్, అందుకు సంబంధించిన రికార్డులను కూడా ఇంతవరకూ తమకు అప్పగించలేదని ప్రస్తుత డీపీవో వెంకటనాయుడు త్రిసభ్య కమిటీకి లిఖితపూర్వకంగా ఇచ్చినట్లు తెలిసింది.

రెండు రోజులపాటు జరిగిన విచారణ నివేదికను కమిటీ చైర్మన్ లోకేశ్వరరావు బుధవారం కలెక్టర్ తమీమ్‌అన్సారియాకు పంపినట్లు సమాచారం. సచివాలయాల తనిఖీకి వెళ్లే సమయంలో పూర్వపు డీపీవో ఒక ఉద్యోగి ద్వారా ఫోన్ మేసేజ్ పంపడం, అందులో ఎంత ఇవ్వాలని స్పష్టంగా పెట్టడం వంటి అంశాలను పొందుపర్చినట్లు సమాచారం. ఉద్యోగుల బదిలీల్లో అవకతవకలే కాకుండా ఈ విచారణలో పలు అక్రమాలు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. తన కింద పనిచేసే ఉద్యోగులను పూర్వపు డీపీవో పావుగా వాడుకొని వారితో అడ్డగోలు పనులు చేయించారని గుర్తించినట్లు తెలిసింది.

ఉద్యోగుల్లో అలజడి

జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. తాము ఎలాంటి తప్పులు చేయకపోయిన తమను పావుగా వాడుకొని ఇబ్బందులుపెట్టారని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ కాగా ఇప్పుడు విచారణ సమయంలో తమకు సంబంధం లేకపోయినా తమ పేర్లను కావాలని ఉషారాణి ఇరికించారని ఉద్యోగులు విచారణాధికారులకు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చినట్లు సమాచారం. తాము తమ అధికారి ఆదేశాలను పాటించామే తప్ప తమకు ఎలాంటి సంబంధం లేదని కూడా చెప్పినట్లు సమాచారం.

పెరుగుతున్న నష్టాలు

(5వ పేజీ తరువాయి)

సజ్జ పంటకు అధిక నష్టం వాటిల్లింది. మొలక, అలాగే ఎదుగుదల దశలో ఉన్న పత్తి, అలసంద, మినుము, మిర్చి ఇతరత్రా పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. వ్యవసాయశాఖ పరిధిలో మొత్తం జిల్లాలోని 20 మండలాల్లోని 205 గ్రామాల్లో 8,429 మంది రైతులకు చెందిన 9,252.25 హెక్టార్లలో ఎనిమిది రకాల పంటలు.. ఉద్యాన శాఖ పరిధిలోని మిర్చి, కూరగాయలు ఇతరత్రా పంటలు మరో 1,837 మంది రైతులకు చెందిన 1,198.62 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. ఆమేర అంచనా వేసిన అధికారులు రైతువారీ, పంటవారీ నష్టాలపై ఎన్యుమరేషన్ చేపడుతున్నారు.

దెబ్బతిన్న పంటల వివరాలు ఇవీ..

పంట పేరు	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)
సజ్జ	1883.47
మినుము	1379.00
అలసంద	1683.00
పత్తి	3251.48
బర్లీ పొగాకు	915.00
వరి	120.00
మిర్చి	1080.42
ఇతరాలు	149.20



అండర్ - 14 బాలుర ఖోఖో జట్టు

ఖోఖో జట్ల ఎంపిక

● పంగులూరులో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల, బాలికల వివరాలు ప్రకటించిన రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి

పంగులూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక బుధవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికలో జిల్లా నలు మూలల నుంచి 200 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్, అండ్ బీవీఎస్ఎం జూనియర్ కళాశాలలో అండర్ - 14 బాల, బాలికలు, అండర్-17 బాల, బాలికల ఖోఖో జిల్లా జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథరెడ్డి, పీడీలు హనుమంతరావు, రఘుబాబు, పీఈటీలు సావిత్రమ్మ, రమాదేవి పాల్గొన్నారు.



వీసీ మూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలి

● పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రాజశేఖర్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5వతేదీ నుంచి జరగనున్న డిగ్రీ మూడవ సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.రాజశేఖర్ కోరారు. స్థానిక ఆంధ్రకేసరి యూనివర్శిటీలో బుధవారం వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తిని కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ గత నెల రోజుల పాటు జిల్లాలో కురిసిన వర్షాల కారణంగా విద్యా సంస్థలకు ఎక్కువగా సెలవులు రావడం వల్ల యూనివర్శిటీ పరిధిలో ఉండే కళాశాలలో సిలబస్ పూర్తి కాలేదన్నారు. గతనెల మొత్తం దసరా, వినాయకచవితి పండుగల నేపథ్యంలో కళాశాలలకు సెలవులు కూడా వచ్చాయని, అందువల్ల సిలబస్ పూర్తికాక విద్యార్థులు చదవలేదని, అందువల్ల పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సీహెచ్.శ్యామ్, నాయకులు బాలాజీ, సతీష్, కోటి తదితరులు పాల్గొన్నారు.

తమర్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఈదా



ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 : ఝార్ఖండ్ రాష్ట్రం తమర్ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్‌గా ఒంగోలుకు చెందిన ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈదా సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వర్తిస్తానని ఆయన బుధవారం తెలిపారు. కో ఆర్డినేటర్‌గా నియమించేందుకు రాష్ట్ర అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఏపీవో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ పోస్టుకు అర్హులైన టీచర్లు ఈనెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో సుబ్రద్ర బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వ జిల్లాపరిషత్, మునిసిపల్ పాఠశాలల్లో సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పనిచేస్తున్న వారు అర్హులన్నారు. అభ్యర్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి. పీజీడీసీఏ కోర్సులు చేసి ఉండాలి. అర్హులైన వారు తమ దరఖాస్తులకు సాంకేతిక అర్హతల సర్టిఫికేట్లను జత పర్చి మండల విద్యాధికారులు/ ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈనెల 31వ తేదీ నాటికి డీఈవో కార్యాలయానికి పంపించాలని కోరారు.

గృహ, పట్టణ వ్యవహారాలపై చర్చించిన మాగుంట




స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మాగుంట

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గృహ, పట్టణ వ్యవహారాల స్టాండింగ్ కమిటీ చైర్మన్ హోదాలో ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి బుధవారం ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్ అనుబంధ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర పట్టణ వ్యవహారాలశాఖకు సంబంధించి సంస్థలు, కార్యాలయాల పనితీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. 2024-25 సంవత్సరానికి గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాలశాఖ నుంచి 2024-25 సంవత్సరానికి కావాల్సిన నిధుల మంజూరు అంశంపై కమిటీ సభ్యులతో చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ హోదాలో సమావేశంలో పాల్గొన్న ఎంపీ మాగుంటను కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి శ్రీనివాస్ ఆర్.కటికితల మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ఇద్దరు యువకుల ఘర్షణ

ఒకరికి గాయాలు



గాయపడిన రమేష్

పెద్దదోర్నాల, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి):ఇద్దరు యువకుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి.ఈ ఘటన స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది.ఎస్సై వీ మహేశ్ తెలిపిన కథనం ప్రకారం ఎగువ చెర్లోపల్లికి చెందిన మాటా రమేష్, దోర్నాలకు చెందిన గంజి సాయిల మధ్య మాటా మాట పెరిగి రాళ్లతో దాడిచేసుకున్నారు. ఈక్రమంలో రమేష్‌కు గాయాలయినట్లు ఆయన తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి గొడవకు గల కారణాలను విచారిస్తున్నట్లు ఆయన చెప్పారు.

మురుగునీటిని తొలగించాలి

గిద్దలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని నల్లబండ బజారు వీధిలో అక్షర స్కూలు వద్ద సిమెంటు రోడ్డు ఉన్నప్పటికీ మురుగు కాలువలు లేక వర్షం నీరంతా రోడ్డుపై నిలిచిపోతున్నది. దాంతో పాచి పట్టింది. రోడ్డు మీద నడిస్తే జారిపడే పరిస్థితి నెలకొంటున్నది. కచ్చా కాలువలైనా తీసి నీటిని బయటకు పంపాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు.

వ్యాసరచన పోటీలు

గిద్దలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలలో 9, 10 తరగతుల విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు వారోత్సవాల ముగింపు సందర్భంగా బహుమతులు అందజేయనున్నారు.

తల పని కోసం హెయిర్ సెలూన్‌కు వెళితే మధ్యప్రదేశ్‌కు చెందిన యువకుడు కత్తెరను చేతిలో నాట్యమాడిస్తూ కనిపిస్తాడు. ఏ స్పెషల్ కావాలని అతను అడిగిన దానికి ఏం చెప్పాలో తెలియక మనం తెల్లముఖం పెడతాం.

అపార్ట్‌మెంట్ నిర్మాణం వద్దకు వెళితే 20 మందికిపైగా బిహార్‌కు చెందిన కూలీలు యంత్రంలా శరీరాన్ని కదిలిస్తూ కనిపిస్తుంటారు. స్థానికులు రోజంతా చేసే పనిని ఒక్కపూటలో పూర్తిచేసి ఔరా అనిపిస్తారు.

తేనీటి కోసం టీ దుకాణానికి వెళితే ఇరానీ స్పెషల్ చాయ్ అంటూ ఉత్తరప్రదేశ్‌కు చెందిన పెద్దాయన సాసర్‌కప్‌తో సహా చిటికెలో చేతిలో పెడతాడు. దాన్ని ఆస్వాదిస్తూ అక్కడే ఉన్న హోంథియేటర్ టీవీలో పాటలు వింటూ మనకు తెలియకుండానే కొత్త ప్రపంచంలోకి వెళ్లిపోతాం.

ఉత్తరభారతీయుల పనితనానికి ఇవి మచ్చుతునకలు. 'ఇందుగలడు అందులేడన్న సందేహంబు వలదు... ఎందెందు వెదికినా అందందే గలడు' అన్నట్టు ఉత్తర భారతీయులు జిల్లాలోని అన్ని రంగాల్లోనూ ప్రవేశించారు. టీ దుకాణం నుంచి స్వీట్ షాపులు, పుల్కా రోటీ బండ్లు, ఇంటీరియర్ వర్క్‌లతోపాటు, ఎలక్ట్రీషియన్, కబోర్డ్ పనులు, ప్లంబింగ్ వంటి వివిధ చేతి వృత్తిల్లోనూ, వస్త్ర దుకాణాలు, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్, స్టీల్ సామాన్లు, రెడీమేడ్ వస్త్రాలు, ఆకట్టుకునే లైటింగ్, ఫ్యాన్సీ వ్యాపారాల్లోనూ తెలుగు ప్రజల ఆదరణ పొందుతూ ఇక్కడే స్థిరపడిపోతున్నారు. చేసే పనిలో నైపుణ్యత, మాటలో కచ్చితత్వం, తక్కువ కూలి తీసుకోవడం వారి ప్రత్యేకతలు. వీటికన్నా ముఖ్యమైనది చెప్పిన సమయానికంటే ముందుగానే పనిపూర్తి చేయడం. దీంతో వారికి డిమాండ్ పెరుగుతోంది.

\- ఒంగోలు, కార్పొరేషన్ (ఆంధ్రజ్యోతి)


ఇంటీరియల్ డెకరేషన్‌లో..


బార్బర్ షాపులో..

ఉపాధిలో ఉత్తరం!

వృత్తి పనుల్లో నార్త్ ఇండియన్స్

- ఉపాధి కోసం ఊరు వదిలి తెలుగు రాష్ట్రాలకు
- వారి పనిని మెచ్చుతున్న స్థానికులు
- టీ కొట్టు నుంచి స్టీల్ వ్యాపారం వరకు వారే
- జిల్లాలో స్థిరపడ్డవారు 50 వేల మందికిపైనే


ఉడ్ వర్క్‌లో..

జిల్లాలో 50వేల మందికిపైనే

40 ఏళ్ల క్రితం రాజస్థాన్‌లో కరువు వల్ల పనుల్లేక ఉపాధి కోసం పది మంది ఒంగోలు విచ్చేసినట్టు రాజస్థాన్, జాలూరు ప్రాంతానికి చెందిన పలువురు వృత్తి, వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, చెన్నైలలో సుమారు 40 లక్షల మంది ఉత్తర భారతీయులు ఉన్నట్లు చెబుతున్నారు. ఒక్క ప్రకాశం జిల్లాలోనే 50 వేల మంది ఉన్నట్టు తెలిపారు.

- మగ్గం వర్క్, సెలూన్, ఇంటీరియర్ డెకరేషన్ వంటి రంగాల్లో ఉత్తరప్రదేశ్ శ్రామికులది అందెవేసిన చేయి. వారు జిల్లాలో వెయ్యి మందికిపైగా ఉన్నట్టు చెబుతున్నారు. వివిధ రకాల వ్యాపారాల్లో 25 వేల మంది ఉన్నారని సమాచారం.

ఉన్న ఊరిలో ఉపాధి అవకాశాలు తక్కువ



ఉత్తర భారతదేశంలో ఉపాధి అవకాశాలు తక్కువ. పంటలు పండక, సరైన జీవనాధారం లేక ఇతర రాష్ట్రాలకు వస్తుంటారు. కష్టం విలువ తెలుసు కాబట్టి, ఎలాంటి డిమాండ్ లేకుండా, వచ్చిన పనిని కొంచం తక్కువ ధరకు అయినా పూర్తి చేయడం వల్ల తెలుగు ప్రజలు ఆదరిస్తున్నారని చెబుతున్నారు. అమ్మా, నాన్న, భార్య, బిడ్డలు, అందరినీ వదిలి వేల కిలోమీటర్లు దాటి వచ్చామనీ, ఎంతో కొంత సంపాదించి ఏడాదికి ఒకసారి తమ ఊరెళ్లి కుటుంబంతో నెలపాటు సంతోషంగా ఉంటామని అంటున్నారు.

ఇక్కడ ఉపాధి అవకాశాలు ఎక్కువ



మాది మధ్యప్రదేశ్‌లోని కాశీ. మా రాష్ట్రంలో కంటే ఆంధ్ర, తెలంగాణాలో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. కబోర్డ్, ఇంటీరియర్ పనులు చేసేందుకు ఏడాది క్రితం నేను, మా స్నేహితులు ఒంగోలు వచ్చాం. మాకు ఇన్ని గంటలే చేయాలి అనే ఆలోచన ఉండదు. తీసుకున్న పని త్వరగా పూర్తి చేస్తాం. కాకపోతే ఇతర రాష్ట్రాలకు చెందిన వారం కదా. మా పనిలో నైపుణ్యత, నాణ్యత, నమ్మకంగా ఉంటే ఆదరిస్తారని శ్రద్ధ పెట్టి పనిచేస్తాం. అందుకే యజమానులు ఆదరిస్తున్నారు. ఇతర ఆదాయ మార్గాలు కూడా చూపిస్తున్నారు.

\- శివ, కాశీ, ఉత్తరప్రదేశ్

మాతోపాటు ఇంకో ఇద్దరి ఉపాధి కల్పిస్తున్నాం..



మా ప్రాంతంలో పనులు ఉంటాయి కానీ ఆదాయం తక్కువ. మా పూర్వీకులు ఒంగోలు వచ్చారు. వారితోపాటు నేను ఒంగోలు వచ్చాను. 25 ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నాను. టీ దుకాణం పెట్టుకున్నాం. వ్యాపారంలో మా ప్రత్యేకత చూపిస్తాం. వెరైటీ ఉండటం వల్ల జనం ఆదరణ లభిస్తోంది. కుటుంబాన్ని కూడా ఒంగోలు తీసుకొచ్చాం. నాతోపాటు ఇంకో ఇద్దరికి ఉపాధి కల్పించాను. మా పిల్లలు ఇద్దరు ఇక్కడే చదువుకున్నారు.

\- ఆర్‌పీ.పవర్ లాల్, టీ వ్యాపారి, రాజస్థాన్

స్థానికులు అయితే ఎదురుతిరుగుతారని...



ఇక్కడ రోజువారీ పనులు చేసేవారు తగ్గిపోయారు. ఇక్కడివారు స్థానికులు కావడంతో సెలవులు పెడుతుంటారు. యాజమానికి ఎదురుతిరుగుతారు. కూలి ఎక్కువ డిమాండ్ చేస్తారు. మేం అయితే ఈ సమస్యలు ఏవీ ఉండవని యజమానులు మమ్మల్ని పిలుస్తారు. ఇక్కడ కొందరు బేల్దారీ మేస్త్రీలు, బిల్డర్లు సైతం మాతోనే రోజువారీ కూలి, కాంట్రాక్ట్ పద్ధతిన పనిచేయించుకుంటున్నారు. తాపీ పనిలో ఇప్పుడు మా వాళ్లే ఎక్కువ ఉన్నారు.

\- ఎన్. నిరంజన్‌కుమార్, ఇంటీరియర్ డిజైనర్, ఒంగోలు

సౌర విద్యుత్‌కు సబ్సిడీ



- దిగువ మధ్యతరగతి వినియోగదారులకు మేలు
- బ్యాంక్ రుణం పొందేందుకు అవకాశం
- కేంద్రప్రభుత్వ పథకాన్ని వినియోగించుకోవాలి
- ఒంగోలు డివిజన్ ఈఈ హరిబాబు

ఒంగోలు(క్రైం), అక్టోబరు 23 : సోలార్ విద్యుత్ వల్ల వినియోగదారులకు కరెంటు బిల్లులు ఆదా చేసుకునేందుకు ఎంతో దోహదపడుతుంది. ఇందుకు తక్కువ పెట్టుబడి చాలు. ఇంట్లోనే రూఫ్‌టాప్ సోలార్ ద్వారా విద్యుత్ తయారు చేసుకునే అవకాశం ఉంది. అందుకోసం సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీ అందజేస్తుంది. బ్యాంకులు రుణం అందిస్తున్నాయి. 2 కిలోవాట్‌ల సోలార్‌ప్లాంట్ ఏర్పాటు చేసుకుంటే నెలకు సరాసరి 200 యూనిట్లు ఉత్పతి చేసుకునే అవకాశం ఉంది. కేంద్రప్రభుత్వం పీఎం సూర్యఘర్ బిజ్లీ యోజనను ప్రవేశపెట్టింది. గృహ అవసరాలకు పోను మిగులు కరెంటును విద్యుత్‌శాఖకు విక్రయించకోవచ్చు.

వ్యయం వివరాలు..

సోలార్‌ప్లాంట్ 1 కిలోవాట్‌కు రూ30.వేలు, 2 కిలోవాట్స్‌కు రూ.60వేలు, ఇక 3 కిలోవాట్స్, ఆపైన అయితే రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుంది. పూర్తిగా సోలార్‌ప్లాంట్ ఏర్పాటు కోసం బ్యాంకులు రుణాలు కూడా అందిస్తున్నాయి. 2 కిలోవాట్స్ సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు సుమారుగా రూ.1.50 లక్షలు వ్యయం అవుతుంది. తద్వారా నెలకు 200 యూనిట్లు కరెంటు ఉత్పత్తి చేసుకోవచ్చు. ఇలా నెలకు రూ.1500 విద్యుత్‌బిల్లు ఆదా అవుతుంది. సోలార్‌ప్లాంట్ కోసం అవుతున్న వ్యయంలో రూ.60 వేలు ప్రభుత్వ సబ్సిడీ కాగా మిగిలిన రూ.90 వేలు రుణంగా పొందవచ్చు. దీనివల్ల కరెంటు బిల్లులు నెలనెలా చెల్లించే పనిలేదు. బిల్లుల నగదును నెలవారి బ్యాంక్‌లకు ఈఎంఐలుగా చెల్లించుకుకోవచ్చు. సుమారు 25 ఏళ్ల పాటు సోలార్‌ప్లాంట్లు ఎలాంటి మరమ్మతులు లేకుండా పనిచేస్తాయి. వినియోగదారుడు పెట్టిన మూలధనం 5 లేక 6 సంవత్సరాల్లో తిరిగి వస్తుంది. తరువాత అంతా ఉచితంగా విద్యుత్‌ను వినియోగించుకోవచ్చన్న మాట.

ప్లాంట్ ఏర్పాటుకు స్థలం వివరాలు

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు 1 కిలోవాట్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు 10 చదరపు మీటర్లు స్థలం అవసరం కాగా 3 నుంచి 4 ప్యానళ్లు ఏర్పాటు చేస్తారు. ఒక్కో ప్యానల్ 1 మీటరు వెడల్పు, 1.6 మీటర్ల ఎత్తు కొలతలతో అమర్చుతారు. 2 కిలోవాట్స్ అయితే 6 నుంచి 8 ప్యానళ్లు అవసరం. 1 కిలోవాట్ సుమారు 125 యూనిట్లు, 2 కిలోవాట్లు అయితే 250 యూనిట్లు వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయి.

దరఖాస్తు విధానం

రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు వినియోగదారులకు చెందిన విద్యుత్ బిల్లు, ఆధార్‌కార్డు ఉంటే సరిపోతుంది. నేరుగా నెట్‌సెంటర్‌లో లేదా జిల్లాలో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకునే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అంతేగాకుండా నేరుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంది.

సోలార్‌ప్లాంట్లను సద్వినియోగం చేసుకోవాలి : ఈఈ



విద్యుత్ బిల్లులు ఆదా చేసుకునేందుకు గృహ అవసరాల కోసం రూఫ్‌టాప్ సోలార్‌ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవాలని ఆ శాఖ ఒంగోలు ఈఈ మాకినేని హరిబాబు తెలిపారు. సోలార్‌ప్లాంట్లు ఏర్పాటుకు కేంద్రప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అందువల్ల ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన కోరారు.

మునిసిపల్ టీచర్లకు త్వరలో ఉద్యోగోన్నతులు

ఒంగోలు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు త్వరలో ప్రమోషన్లు ఇచ్చేందుకు పాఠశాల విద్యా మిషనర్ అంగీకరించారు. మునిసిపల్ ఉపాధ్యాయుల సమస్యలపై బుధవారం కమిషనర్‌తో జరిగిన చర్చల్లో ఈ మేరకు అంగీకారం తెలిపారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు వెంటనే ప్రమోషన్లు ఇస్తారు. 117 జీవో రద్దు చేయాలని నిర్ణయించినందున కొత్త నిబంధనలను వెంటనే రూపొందించి అప్‌గ్రేడ్ చేయాల్సిన పోస్టులను గుర్తించి ఆర్థికశాఖ అనుమతి వచ్చిన వెంటనే అమలు చేస్తారు. మునిసిపల్ టీచర్ల పీఎఫ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఏర్పాటుకు పరిష్కారం చూపుతామన్నారు. అర్బన్ ఎంఈవో, ఉపవిద్యాధికారి పోస్టులు మునిసిపల్ టీచర్లకు కేటాయించేందుకు అనుమతి కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తామన్నారు. మునిసిపల్‌టీచర్లకు కూడా బదిలీ చట్టం రూపొందించి ఏప్రిల్ తర్వాత బదిలీలు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో సమస్యలను ఆమోదించినందున విద్యాశాఖ డైరెక్టరేట్ ఎదుట నిర్వహించాల్సిన ధర్నాను వాయిదా వేస్తున్నట్లు యూటీఎఫ్ నేతలు తెలిపారు.

4 నుంచి డీఈఎల్‌ఈడీ పరీక్షలు

ఒంగోలు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిప్లమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కళాశాలల్లో చదువుతున్న 2023-24 బ్యాచ్ విద్యార్థులకు రెండవ సెమిస్టర్ విద్యార్థులకు నవంబరు 4నుంచి 7వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని మైనంపాడు డైట్ ప్రిన్సిపాల్ కె.నారాయణరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2021-23, 2022-24 బ్యాచ్‌లో ఒకసారి ఫెయిలైన విద్యార్థులు కూడా పరీక్షకు హాజరయ్యేందుకు అర్హులన్నారు. జిల్లాలోని ప్రైవేటు డీఈఎల్‌ఈడీ కళాశాలల్లో చదువుతున్న మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు నవంబరు 4నుంచి 9వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. 2018-19 బ్యాచ్ విద్యార్థులకు కూడా పరీక్షలు మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు జరుగుతాయన్నారు.


మంగమ్మ కాలేజీ జంక్షన్ నుంచి ఫ్లైఓవర్‌కు వెళ్లే అప్రోచ్ రోడ్డు తీరిలా..


రాజీవ్ గృహకల్ప కాలనీ ఒకటో లైన్ ఇలా..



ఇదేమి దారిద్ర్యం!

- నగరంలో ప్రమాదకరంగా రోడ్లు
- చిన్నవానకే చెరువులుగా దర్శనం
- గుంతల్లో ఇరుక్కుపోతున్న వాహనాలు

'ఏ రోడ్డు చూసినా ఏమున్నది గ్వరకారణం..' అన్నట్టుంది ఒంగోలులోని రహదారుల దుస్థితి. చిన్నవానకే ప్రధాన రహదారులు సైతం చెరువులుగా దర్శనమిస్తున్నాయి. రోడ్డంతా నిండిన నీళ్లలో ద్విచక్ర వాహనదారులు వెళ్లాలంటే వణుకు పుడుతోంది. ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ స్పీడ్ బ్రేకర్లు ఉన్నాయో అర్థంకాని దైన్యం నెలకొంది. నాలుగు చక్రాల వాహనాలు రోడ్డు మధ్యలోనే గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. కొన్నిచోట్ల బురదల్లో లారీలు దిగబడి ముందుకు కదలడం లేదు. మంగళ, బుధవారాల్లో నగరంలోని పలు ప్రాంతాల్లో ఆంధ్రజ్యోతి కంట పడిన దృశ్యాలు ఇవి. ఇప్పటికైనా మరమ్మతులకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

\- ఆంధ్రజ్యోతి, ఒంగోలు


మంగమ్మ కాలేజీ అప్రోచ్ రోడ్డులో గుంతలో ఇరుక్కుపోయిన కారును ఎక్స్‌కవేటర్‌తో తీస్తూ..


భాగ్యనగర్ 4వ వీధిలో రహదారి ఇలా..

రోడ్లు సరే.. సైడు కాలువలేవీ..!



ఇస్తరాకుల ఫ్యాక్టరీ ఏరియాలో రోడ్డుపై నిలిచిన మురుగు



వడ్డెరపాలెంలో స్కూల్ వద్ద సైడు కాలువలు లేని సీసీరోడ్డు

● మురుగు పారుదల లేక అవస్థలు

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్లు అయితే ఉన్నాయి.. కానీ పక్కన సైడు కాలువలు లేకపోవడంతో వర్షాలకు మురుగునీరు రోడ్డుపైకి వచ్చి పారిశుధ్యం అధ్వానంగా మారుతోంది. మండలకేంద్రం సంతనూతలపాడులోని వడ్డెరపాలెం, ఇస్తరాకుల ఫ్యాక్టరీ ఏరియాలోని పలువీధుల్లో సీసీరోడ్లు ఉండి సైడు కాలవలు లేకపోవడంతో మురుగునీరు ఎక్కడిక్కడ నిలిచి దుర్వాసన వస్తోంది. దోమలు వృద్ధి చెంది స్థానికులు వ్యాధులబారిన పడే పరిస్థితి నెలకొంది. అదేవిధంగా రోడ్డుపై పడిఉన్న చెత్తచెదారాన్ని తొలగించాలని, సైడుకాలువలేని చోట మురుగునీటిలో దోమలు వృద్ధిచెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని, అదేవిధంగా వీధుల్లో దుర్గంధపు వాసన రాకుండా బ్లీచింగ్ చేయించాలని సంబంధిత అధికారులను గ్రామస్థులు కోరుతున్నారు.

శ్మశానస్థలంలో ఆక్రమణలు తొలగించాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రిస్టియన్‌పాలెంవాసులు

చీమకుర్తి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని క్రిస్టియన్‌పాలెం మాదిగల శ్మశానవాటిక, వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమణదారుల చెరనుంచి విడిపించాలని క్రిస్టియన్‌పాలెంవాసులు కోరారు. బుధవారం చీమకుర్తిలో ఈమేరకు మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తహసీల్దార్ బ్రహ్మయ్యలకు వినతిపత్రం అందజేశారు. 4.56 ఎకరాల శ్మశానం, వాగు పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకోవటంతో శవాలను పూడ్చిపెట్టటానికి స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు స్థలానికి రీసర్వే చేసి చుట్టూ ప్రహరీ నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో పాటిబండ్ల భిక్షాలు, కర్ణా ప్రసాద్, ప్రేమ్‌కుమార్, పాకాల శ్రీను, పోలరాజు, పాటిబండ్ల జక్రయ్య, వంశీ, శివ, రాజు, మరియదాసు, యేహోషవా, ఇంజాపల్లి యేహోన్, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్యారెట్ లైన్ గోల్డ్‌షోరూం ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

ఒంగోలుకార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని కర్నూలు రోడ్‌లో క్యారెట్ లైన్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. షోరూం రీజనల్ మేనేజర్ నవదీప్, పార్టనర్స్ కృష్ణమోహన్, శ్రీనివాసరావు, సన్యలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. తమ షోరూంలో లైట్ వెయిట్ జ్యూవెలరీ అందుబాలోకి తీసుకొచ్చినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో 13వ బ్రాంచ్‌గా ఒంగోలులో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రూ.10వేల నుంచి డైమండ్ ఆభరణాలు, చెవి కమ్మలు, ఉంగరాలు, గాజులు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అలాగే పాత బంగారం మార్చుకునే అవకాశం కూడా తమ షోరూంలో ఉందన్నారు. టాటా కంపెనీకి చెందిన క్యారెట్ లైన్ జిల్లా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు.

వరకట్న వేధింపుల కేసు నమోదు

కొత్తపట్నం(ఒంగోలునగరం) అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భార్యను అదనపు కట్నం తేవాలని వేధిస్తున్న భర్తపై బుధవారం వరకట్న వేధింపుల కేసును నమోదు చేశారు కొత్తపట్నం పోలీసులు. వివరాలు ఇలా ఉన్నాయి.. అల్లూరు గ్రామానికి చెందిన మద్దసాని ప్రియకు, ఉలవపాడుకు చెందిన మద్దసాని గోపీశ్రీనుతో గత ఏడాది ఆగస్టులో వివాహం జరిగింది. గోపీశ్రీనుకు ప్రభుత్వం ఉద్యోగం అని చెప్పటంతో ప్రియ తల్లిదండ్రులు రూ.6లక్షల నగదు, ఐదు సవర్ల బంగారం కట్నం కింద ఇచ్చారు. అయితే తీరా వివాహం జరిగిన తర్వాత గోపీశ్రీనుకు ఉద్యోగం లేదని తెలిసింది. అయితే త్వరలోనే ఉద్యోగం వస్తుందని, అందుకు అదనంగా కట్నం తేవాలని భార్యను వేధింపులకు గురిచేస్తున్నట్లు ప్రియ ఫిర్యాదు చేయడంతో బుధవారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌వోబీ ప్రతిపాదిత స్థలం పరిశీలన



బ్రిడ్జి నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అన్సారియా

టంగుటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : టంగుటూరులో నూతనంగా నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌వోబీ) ప్రతిపాదిత ప్రాంతాన్ని కలెక్టర్ తమీమ్ అన్సారియా బుధవారం పరిశీలించారు. అంచనాలు, రైల్వే క్రాసింగ్ 193 వద్ద సబ్‌వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనల గురించి ఆర్‌అండ్‌బీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఆర్డీవో లక్ష్మీప్రసన్న, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ దేవానందం, ఈఈ గోపీనాయక్, ఏఈ నాగార్జున, తహసీల్దార్ ఆంజనేయులు ఉన్నారు.

లింగాకర్షక బుట్టలను అమర్చాలి



మాట్లాడుతున్న ఏవో పావని

సంతనూతలపాడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను అమర్చడం వల్ల లద్దెపురుగు నివారించవచ్చని ఏవో పావని తెలిపారు. బుధవారం మండలంలోని గుమ్మళంపాడు, ఎనికపాడు గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక లీటరు నీటికి 2.5ఎంఎల్ క్లోరిఫైరిపాస్‌ను కలిపి మినుము పంటకు పిచికారి చేయాలని, అదేవిధంగా మచ్చల పురుగు ఆశించకుండా వేపనూనె లేదా వేపగింజల కాషాయం తగుమోతాదులో వినియోగించాలన్నారు. అదేవిధంగా రబీకి సంబంధించి బీమా కోసం శనగకు రూ.368, వరి రూ.215, జొన్న రూ.60, మినుము రూ.102, ఎండు మిరప రూ.525, మొక్కజొన్న రూ.105లు ఎకరాకు ప్రీమియం చెల్లించాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రోలర్ స్కేటింగ్‌లో విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న జగదీష్

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లా రోలర్ స్కేటింగ్ పోటీలలో ఒంగోలుకు చెందిన హైదరాబాద్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు ప్రతిభ చాటి పలు పతకాలు సాధించినట్లు కరస్పాండెంట్ జగదీష్ తెలిపారు. మోక్ష (బ్రాంజ్, సిల్వర్), రేయాన్స్ (బ్రాంజ్), పవన్‌చంద్రిక (బ్రాంజ్, సిల్వర్), అఖిల్ (సిల్వర్) మెడల్స్ సాధించారన్నారు. ఈ సందర్భంగా బుధవారం క్రీడాకారులను, పీఈటీ అనీల్‌ను అభినందించారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

జరుగుమల్లి (కొండపి), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు సీజనల్ వ్యాధుల బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమణమూర్తి ఆదేశించారు. బుధవారం చింతలపాలెంలోని గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మెడికల్ అధికారి కావ్య, ఈవోఆర్డీ ఏడుకొండలు, సర్పంచ్ వేల్పుల హరిబాబు, పంచాయతీ కార్యదర్శి పి.కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారి ఫిర్యాదుపై అధికారుల విచారణ

● త్రిసభ్య కమిటీని నియమించిన కలెక్టర్



విచారణ చేస్తున్న త్రిసభ్య కమిటీ అధికారులు

కొత్తపట్నం(ఒంగోలునగరం), అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపట్నం వైద్యాధికారి డాక్టర్ వైష్ణవి ఫిర్యాదుపై బుధవారం త్రిసభ్యకమిటీ విచారణ చేపట్టింది. ఈ నెల 18వ తేదీన జరిగిన కొత్తపట్నం మండల పరిషత్ సర్వ సభ్యసమావేశంలో ఎంపీటీసీ రామలింగంవెంకటరావు తనను అసభ్య పదజాలంతో దూషించారని వైద్యాధికారి వైష్ణవి ఈ నెల 21వ తేదీన కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఫిర్యాదు చేశారు. పీహెచ్‌పీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు కూడా ఆమెకు మద్దతుగా నిలిచారు. దీంతో కలెక్టర్ ముగ్గురు అధికారులతో విచారణ కమిటీని నియమించారు. ఒంగోలు రెవెన్యూ డివిజనల్ అధికారి లక్ష్మీప్రసన్న, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి చిరంజీవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సురేష్‌కుమార్‌ను విచారణ అధికారిగా నియమించారు. వారు బుధవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో విచారణ నిర్వహించారు. ఈ విచారణకు డాక్టర్ వైష్ణవి, ఎంపీటీసీ రామలింగం వెంకటరావు హాజరయ్యారు. వీరితో పాటు సర్వసభ్య సమావేశానికి హాజరైన ఇతర అధికారులను కూడా కమిటీ విచారించింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావు



ప్రచారం చేస్తున్న బ్యాంకు అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారతీయ స్టేట్ బ్యాంకు అందిస్తున్న వివిధ రుణాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బ్యాంకు జిల్లా రీజనల్ మేనేజర్ ఎస్.గున్నేశ్వరరావు, ఆర్‌ఏసీపీసీ ఏజీఎం వెంకట్రావు కోరారు. బుధవారం స్థానిక రంగారాయుడు చెరువు కట్ట వాకింగ్ ట్రాక్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల కరపత్రాలను వాకర్స్‌కు పంపిణీ చేశారు. ఎస్‌బీఐ ద్వారా గృహరుణాలపై అందిస్తున్న ప్రత్యేక రాయితీలు, ప్రధామంత్రి సూర్య ఘర్ పథకం ద్వారా అందిస్తున్న రుణాలను రీజనల్ మేనేజర్ గున్నేశ్వరరావు వివరించారు. పండుగ రోజుల్లో ప్రత్యేకంగా గృహ రుణాలను తగ్గింపు వడ్డీరేట్లపై అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు కూడా రాయితీ ఇస్తున్నామన్నారు. గృహ రుణాలు పొందిన వారికి ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద రూ.3లక్షల వరకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. విదేశాల్లో విద్య కోసం రూ.1.50 కోట్లు రుణం అందజేసే అవకాశం ఉందన్నారు. ఎస్‌బిఐ ఖాతా ఉన్న వారికి రూ.35 లక్షల వరకు ఎటువంటి హామీ లేకుండా వ్యక్తిగత రుణం మంజూరు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో చీఫ్ మేనేజర్లు వేదం రాజేష్‌బాబు, పి.వీరయ్య, నాగేశ్వరరావు, కె.రామారావు, బ్రాంచి మేనేజర్లు నిర్మలకుమారి, కిషోర్, హేమకేసర్, దీప్తి, జానకి రామయ్య, వి.శ్రీనివాసరావు, పీబీ.చంద్రశేఖర్, ఎం.సూరజ్, శ్రీధర్, కోటేష్‌బాబు, సీహెచ్.శ్రీనివాసరావు, నళినికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేపై అర్జీలు 20 రోజుల్లో పరిష్కారం

● తహసీల్దార్ ఆంజనేయులు



అర్జీని స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

టంగుటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రీసర్వే సమస్యలపై గ్రామ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలన్నింటినీ 20 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ ఆంజనేయులు చెప్పారు. మండలంలోని ఎం.నిడమలూరులో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో డీటీ మాధవి, ఆర్ఐ హనుమంతరావు, మండల సర్వేయర్ నందయ్య, వీఆర్వో మహేష్, గ్రామ సర్వేయర్ ప్రసన్నకుమారి, ఉపసర్పంచ్ కాకుమాని సుబ్బారావు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వీకే కండ్రిగలో 27 అర్జీలు

పొన్నలూరు(కొండపి): మండలంలోని వెల్లటూరు కాళిదాసువారి కండ్రిగలో రెవెన్యూ అధికారులు బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు 27 అర్జీలను అందజేశారు. వాటిలో పట్టాదారు పేరు నమోదు కోసం రెండు, ఉమ్మడి భూమి విభజన కోసం ఎనిమిది, విస్తీర్ణంలో వ్యత్యాసం సరిచేయాలని 11, ఉమ్మడి క్షేత్ర విభజన కోసం ఆరు ఉన్నాయి. సభలో తహసీల్దార్ వి.పుల్లారావు, రీసర్వే డీటీ కె.వెంకటేశ్వరరావు, ఆర్ఐ నరసయ్య, మండల సర్వేయర్ రమేష్ చంద్ర, వీఆర్వో రేవంత్, సర్వేయర్ విజయ పాల్గొన్నారు.

కనుమళ్లలో 68 అర్జీలు

సింగరాయకొండ: గత వైసీపీ ప్రభుత్వం చేసిన రీసర్వేకు సంబంధించి తలెత్తిన భూసమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ బి.రవి తెలిపారు. బుధవారం కనుమళ్లలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా 68 మంది అర్జీలు సమర్పించారు. వాటిలో జాయింట్ ఎల్‌పీఎంపై 20, విస్తీర్ణంలో తేడాలు సరిచేయాలని 21, మ్యూటేషన్‌కు సంబంధించి 27 ఉన్నాయి. వీటన్నింటినీ 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ మలినేని ఇందిర, ఆర్ఐ వి.ప్రసాద్, సర్వేయర్ బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

భూసమస్యలపై 15 అర్జీలు

సంతనూతలపాడు: కొనగానివారిపాలెంలో బుధవారం నిర్వహించిన రీసర్వే, భూసమస్యలకు సంబంధించి 15 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.ఆదిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో జరిగి న రీసర్వే, ఇతర భూసమస్యలకు పరిష్కారం చూపిస్తామన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు కె.ఉప్పలపాడు విద్యార్థి



అభినాష్‌ను అభినందిస్తున్న హెచ్ఎం

కొండపి, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు కె.ఉప్పలపాడు జడ్పీహైస్కూల్ విద్యార్థి ఇ.అభినాష్ ఎంపికయ్యారు. త్వరలో సత్యసాయి జిల్లాలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు. బుధవారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినాష్‌ను హెచ్ఎం వి.సుసన్నకుమార్, పీడీ ఎ.రవికిరణ్‌కుమార్ అభినందించారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు



ఎస్సై నాగమల్లేశ్వరరావును సన్మానిస్తున్న అధ్యాపకులు

టంగుటూరు, అక్టోబరు 23 : విద్యార్థినులను ర్యాగింగ్ చేసినా, వేధించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై నాగమల్లేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక పోతుల చెంచయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థునులపట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తనకు ఫోన్ చేస్తే అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ఎస్సైను కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, అధ్యాపకులు సన్మానించారు.

మౌలిక సదుపాయాలను కల్పించాలి

ఒంగోలు కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శివారు కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ నాయకులు కమిషనరు వెంకటేశ్వరరావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో సరళదేవి నగర్‌కు కార్పొరేషన్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల నిర్మాణం, గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారన్నారు. అయితే ఇప్పటికీ ఆ ప్రాంత వాసులకు ఇంటి పన్నులు వేయడం లేదని తెలిపారు. అలాగే మరుగుదొడ్ల సముదాయాన్ని పునరుద్ధరించాలన్నారు. పారిశ్రామికవాడకు దగ్గరలో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి పైపులైను ద్వారా తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రకాశరావు, ఎస్‌డీ.సర్దార్, కైలా అజయ్, టి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 24న బౌద్ధ ధర్మదీక్ష

ఒంగోలు, కార్పొరేషన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నవంబరు 24వ తేదీన 68వ బౌద్ధ ధర్మ దీక్ష ఉత్సవం ఒంగోలులో నిర్వహిస్తున్నట్లు జిల్లా అడ్వయిజరీ అధ్యక్షుడు గురవయ్య తెలిపారు. బుధవారం స్థానిక ఎంసీపీ భవనంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మీడియాతో మాట్లాడుతూ ది బుద్దిస్ట్ సొసైటీ ఆ ఫ్ ఇండియా ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది పాల్గొనేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశానికి టీబీఎస్ఐ జిల్లా అధ్యక్షులు ఈ.మహేష్ నాగ అధ్యక్షత వహించగా, బీటీపీ రాష్ట్ర నాయకులు పి.వెంకట్రావు, బి.నాగేంద్రవదన్, డాక్టర్ సీహెచ్‌సుధాకర్, సీహెచ్.సుధీర్, డీపీఆర్.సుధాకర్, జి. హరిప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు రైతులకు మొక్కల పంపిణీ

టంగుటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ని ఆలకూరపాడులో పొగాకు రైతులకు బోర్డు ఆధ్వర్యంలో బుధవారం టేకు, నేరేడు, ఉసిరి మొక్కలు పంపిణీ చేశారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో టంగుటూరు పొగాకు వేలం కేంద్రం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెగుళ్లు ఆశించకుండా చూడాలి



నారుమడిని పరిశీలిస్తున్న అధికారులు, శాసతివేత్తలు

కొండపి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నారుమడులకు తెగుళ్లు ఆశించకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీటీఆర్ఐ శాస్త్రవేత్త పిల్ల వెంకటేశ్వరరావు సూచించారు. కలుపు నివారించుకోవాలన్నారు. కొండపి పొగాకు వేలం కేంద్రం అధికారులు, శాస్త్రవేత్తలు బుధవారం పెరిదేపిలోని పొగాకు నారుమడులను పరిశీలించారు. అధిక దిగుబడినిచ్చే వంగడాల నారును రైతులు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐటీసీ మార్కెటింగ్ మేనేజర్ ప్రవీణ్, చంద్రశేఖరరెడ్డి, పోలిశెట్టి కంపెనీ మేనేజరు ఆర్ల రామాంజనేయులు, జీపీఐ మేనేజర్ ఉన్నం శ్రీనివాస్, సుంకర సాయిశ్యామల తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నాగులుప్పలపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): దాసరివారిపాలెంలోని విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం గ్రామస్తులతో కలిసి ఉప్పుగుండూరులోని సబ్‌స్టేషన్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాసరివారిపాలెంలో 1978లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, లైన్లు అలానే కొనసాగుతున్నాయన్నారు. ప్రస్తుతం స్తంభాలు శిథిలావస్థకు చేరి కరెంటు తీగలు చేతికందే ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డి వాహనాలు అటుగా వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన వెంటాడుతోందని వాపోయారు. తక్షణమే గ్రామంలోని విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తూబాటి శ్రీకాంత్, కొమరగిరి రామాంజనేయులు, చల్లంచర్ల ఏసు, శానం సుబ్బారావు, ఆనందరావు, కొమరగిరి వేణు పాల్గొన్నారు.

తైక్వాండోలో రైజ్ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల నిర్వాహకులు

ఒంగోలు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూకే ఆధ్వర్యంలో చీరాల సెయింట్ అన్స్ ఇంజనీరింగ్‌కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల తైక్వాండో పోటీల్లో ఒంగోలుకు చెందిన రైజ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. కళాశాలలో సీఎస్‌ఈ విద్యార్థి కె.షామిలి ప్రథమ స్థానంలో నిలువగా, రైజ్ కృష్ణసాయి ప్రకాశం ఈసీ సీఈ విద్యార్థి బి.సాయి వెంకటమౌనిష్ తృతీయ స్థానంలో నిలిచారు. విజేతలను బుధవారం స్థానిక కళాశాలలో గౌరవచైర్మన్ ఇస్కాల చినరంగమన్నార్, సెక్రటరీ శిద్దా హనుమంతరావు, శిద్దా ప్రవల్లిక, కేవీ.సుబ్రహ్మణ్యం, ఎన్.హిమచంద్రబాబు, ఎన్.సుబ్బారావు అభినందించారు.

జైళ్ల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి : డీఐజీ



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ వరప్రసాద్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : జైళ్ళ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జైళ్ల ఉపశాఖాధికారి(డీఐజీ) గుంటూర్ రేంజ్ ఎం.వరప్రసాద్ సూచించారు. ఒంగోలులోని జిల్లా జైలులో బుధవారం గుంటూరు రేంజ్ జైళ్ల యూనిట్ అధికారుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి.వరుణారెడ్డి ఆధ్వర్యంలో వరప్రసాద్‌కు ఘన స్వాగతం పలికారు. జైళ్ళ భద్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. సమావేశంలో నెల్లూరు, గుంటూరు, కృష్ణా, ఏలూరు, ప్రకాశం జిల్లాల జైలు అధికారులు పాల్గొన్నారు.

నర్సస్ నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులను సత్కరిస్తున్న ప్రతినిధులు

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సస్ అసోసియేషన్ జిల్లా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. స్థానిక రిమ్స్‌లో బుధవారం కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బీసీ.మాలకొండయ్య ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. అధ్యక్షురాలుగా మోపిదేవి ఉదయలక్ష్మి, ఉపాధ్యక్షురాలుగా కె.సుజాత, కార్యదర్శిగా కొత్తపల్లి మంజేష్, కోశాధికారిగా మండవ సుజాత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దేవరపల్లి నాగరాజకుమారి, బీవీ.రామలక్ష్మి, ముత్తవరపు మహేష్, కె.జానీబాషా, ఎస్‌కే.మమబూబిలు ఎన్నికయ్యారు. అనంతరం కార్యవర్గ సభ్యులను ఘనంగా సత్కరించారు.

ఎర్రగుడిపాడు డొంకలో మృతదేహం

చీమకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలోని ఎర్రగుడిపాడు డొంక సమీపంలో గుర్తుతెలియని మృతదేహం బుధవారం వెలుగుచూసింది. దాదాపు 45 సంవత్సరాల వయస్సు ఉన్న పురుషుడి మృతదేహం ఉబ్బిపోయి కుళ్లి గుర్తించలేని స్థితిలో ఉంది. సంఘటనాస్థలానికి వెళ్లిన పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పురుగుమందుల పిచికారీపై అవగాహన



కంది పంటను పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

చీమకుర్తి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : డ్రోన్లతో పంటపొలాల్లో పురుగు మందుల పిచికారీపై బుధవారం బూదవాడ గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు కంది పంటను పరిశీలించి సస్యసంరక్షణా చర్యలను వివరించారు. ఈ-క్రాప్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పీఎం ఫసల్ బీమా యోజనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో డీవీ.భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ రికార్డులపై జేసీ ప్రజంటేషన్

ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన డ్రోన్ల సహకారంతో డిజిటల్ రికార్డుల సృష్టించడంపై జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ప్రజంటేషన్ ఇచ్చారు. విజయవాడలోని సీకే కన్వెన్షన్‌హాలులో బుధవారం జరిగిన డ్రోన్ సమ్మిట్‌లో జేసీ మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన రీసర్వే కార్యక్రమంలో పట్టణ ప్రాంతాల్లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా భూసర్వే ప్రక్రియలో డ్రోన్లు వినియోగించి సాంకేతిక సహకారంతో భూమిని కొలిచే విధానం, మ్యాప్‌లతయారీ తదితర అంశాలను వివరించారు. ప్రజంటేషన్ ఇచ్చిన గోపాలకృష్ణను ఘనంగా సత్కరించారు.

నీరు రాదు.. ఆశ తీరదు

అలంకారప్రాయంగా చెరువులు


పూడిపోయిన కాలువలు

బీడులుగా ఆయకట్టు భూములు

ఎమ్మెల్యే ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరుతున్న రైతులు

పొదిలిలో చిన్నచెరువు,పెద్ద చెరువులకు గత కొనేళ్లుగా నీరు చేరకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏడాదీ రైతులు మబ్బులు కమ్మినప్పుడల్లా ఎంతో ఆశగా ఆకాశంవైపు చూడటమే గాని వర్షాలు పడవు.. మా ఆశలు తీరవు అన్న చందంగా ఉంటోంది వారి పరిస్థితి . చెరువులను ఆధారంగా చేసుకొని వరి, ఇతర పలురకాల పంటలు పండించే రైతులు నీటి అవకాశం లేక విలవిల్లాడిపోతున్నారు. కుటుంబ అవసరాలకు సరిపడా వడ్లు పండించుకునేందుకు కూడా నీటి వసతి లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.





నీరులేక చిల్లచెట్లతో నిండిపోయిన పెద్దచెరువు (ఇన్‌సెట్లో) పూడిపోయిన తూము

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పేరుకు పొదిలిలో నీటి ఆధారంగా చిన్నచెరువు, పెద్ద చెరువులు ఉన్నా సుమారుగా 15ఏళ్లకు పైగా నీరు చేరకపోవడంతో మాగాణి పొలాలు ఒట్టిపోయాయి. కొంత మంది రైతులు బోర్లను ఆధారంగా చేసుకొని కొద్దిపాటి పొలాన్ని సాగుచేసుకుంటూ కాలం వెల్లదీస్తున్నారు. చెరువుకులకు నీరు చేరుతాయని పొలంసాగు అవుతుందనే ఆశలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు మూడు నెలలుగా మంచి వర్షం పడుతున్నా చెరువులకు నీరు చేరడం లేదు. ఎగువ ప్రాంతాల్లో పడిన వర్షపు నీరు పీతురువాగు నుంచి వచ్చి పెద్దచెరువుకు చేరాలి. అయితే కొందరు స్వార్థపరులు ఆవాగు పొడవునా అవసరం లేకపోయినా చెక్‌డ్యాంలు నిర్మించడంతో నీరు చెరువులకు చేరడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

భారీ వర్షాలు పడితే తప్ప చెరువులకు నీరు చేరే దారికనపడటం లేదు. పెద్ద చెరువు లోతట్టు విస్తీర్ణం 701 ఎకరాలు. ఈ చెరువుపై ఆధారపడి సుమారుగా 200కుపైగా రైతులు ఉన్నారు. 800కుపైగా ఆయకట్టు భూములు ఉన్నాయి. అన్నదాతలు గత 10-15 సంవత్సరాల నుంచి ప్రతి ఏడాది వర్షాకాలం వస్తే మంచి వర్షాలు పడతాయని ఆశగా చూడటంతోనే జీవితం ముగుస్తుందని ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు. కొంతమంది బోర్లు వేయించుకొని సాగు చేస్తుంటే మరికొంత మందికి ఆర్థికస్థోమత లేక మాగాణి పొలాలు బీళ్లుగా వదిలేస్తున్నారు. దీంతో ఏడాదికేడాది సాగు విస్తీర్ణం తగ్గిపోతోంది. అదే విధంగా చిన్నచెరువు విస్తీర్ణం 101 ఎకరాలు. 238 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈచెరువుకు నీరు చేరకపోవడం తో ప్రస్తుతం బోర్లపై ఆధారపడి సుమారుగా 50, 60 ఎకరాల్లో మాత్రమే సాగవుతోంది మిగిలిన పొలాలు బీళ్లుగా మారిపోయాయి.

వెనుకబడిన పశ్చిమప్రాంతంలో వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణం జరుగుతున్నా పొదిలి మండల సాగు విస్తీర్ణం ప్రాజెక్ట్ పరిధిలోకి రాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల సమయంలో పొదిలి మండలానికి వెలుగొండ జలాలు తీసుకొచ్చి మండలంలో ప్రతి ఎకరాకు నీరు అందించి సస్యశ్యామలం చేస్తానని ప్రస్తుత శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి హామీ ఇచ్చారు. దీంతో ఈప్రాంత రైతుల్లో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

వెలుగొండ ప్రాజెక్ట్ కాలువలను ఈ ప్రాంత చెరువులకు అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తే మంచి మేలు చేకూరుతుందని అన్నదాతల ఆశ. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇచ్చిన హామీని అమలు చేస్తే ఈప్రాంత రైతులు, ప్రజలు ఆయన మేలును మరువరని మండల ప్రజలు అంటున్నారు. ఇకనైనా కాలువలను అనుసంధానం చేసి ఆయకట్టు రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

అవీ..ఇవీ



పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వర్షాలకు దెబ్బతిన్న పత్తిపంట పరిశీలన

తర్లుపాడు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారి టి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మండలంలోని పోతలపాడు, గానుగపెంటలో నిర్వహించారు. తుఫాన్ ప్రభావంతో పత్తి, మిరప, పొగాకు పంటలు బాగా దెబ్బతిన్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వానికి నివేదిక పంపించనున్నట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా సిద్ధగా ఉందని, ఒక్కో బస్తా రూ.270 ఇచ్చి రైతులు తీసుకోవాలని సూచించారు. వీఏఏలు కాశయ్య, చంద్రశేఖర్, శ్వేత, రైతులు పాల్గొన్నారు.



రిలే దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తొలగించిన మున్సిపల్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం దీక్షలు నిర్వహించారు. సీఐటీయూ నాయకుడు సుబ్బరాయుడు దీక్షను ప్రారంభించి మాట్లాడుతూ 25 ఏళ్లుగా ఈ వృత్తినే నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను ఒక్కమాటతో తొలగించటం అన్యాయం అన్నారు. ఈ కార్యక్రమంలో షబ్బీర్, కనకయ్య, హరి, ఇమాంసా తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు

32 మందికి దివీస్ ఫార్మాలో ఉద్యోగాలు

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ఇటీవల నిర్వహించిన దివీస్ ఫార్మాలో ఇంటర్వ్యూలలో 32 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ మాట్లాడుతూ.. ఉద్యోగ మేళా ఆధారంగా డిగ్రీ, ఫార్మ, ఐటీఐ, పాలిటెక్నిక్ చదివిన విద్యార్థులు వివిధ స్థాయి ఎంపికలు పూర్తి చేసుకుని 32 మంది ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ హెచ్‌ఆర్ రామకృష్ణ, కళాశాల కార్యదర్శి రాజగోపాల్‌రెడ్డి, డైరెక్టర్లు ఎంవీ కృష్ణారెడ్డి, వీఆర్‌కే ప్రసాద్, జీఎల్ రమేష్ బాబు, వెన్నా కృష్ణారెడ్డి, రిక్రూట్‌మెంట్ సమన్వయకర్త పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీర్మానాలు లేకుండా పనులు ఎలా చేస్తారు

సర్వసభ్య సమావేశంలో నిలదీసిన సభ్యులు

ఎంఈవోను డీఈవోకు సరెండర్ చేయాలని తీర్మానం



అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యులు రామనారాయణరెడ్డి

కొనకనమిట్ల, అక్టోబరు(ఆంధ్రజ్యోతి) 23 : మండలంలో జరిగే పలు అభివృద్ధి పనులకు మండల తీర్మానాలు లేకుండా ఎలాచేస్తారని ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు నిలదీశారు. కొనకనమిట్ల మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, మరికొంత మంది సభ్యులు మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థ నిర్వీర్యం చేసేలా ఎంఈవో డాంగే షరీఫ్ చేస్తున్నాడని, పాఠశాలల పనితీరు సరిగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవోకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని, సమయ పాలన పాటించకుండా పలు పాఠశాలలోని ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారని, ఎంఈవోను డీఈవో కార్యాలయానికి సరెండర్ చేయాలని సభ్యులు తీర్మానం చేశారు. పంచాయతీరాజ్‌శాఖ ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలానికి రూ. 3 కోట్ల అభివృద్ధి పనులకు మంజూరు అయ్యాయని, మొత్తం 16 గ్రామ పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నామన్నారు.

ఈసందర్భంగా గొట్లగట్టు ఎంపిటీసీ సభ్యలు ఉడుముల రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంపీటీసీ సభ్యులం మాకు చెప్పకుండా, ఎంపీపీకి తెలియకుండా మండల తీర్మానం లేకుండా పనులు ఎలా మంజూరు చేస్తారని నిలదీశారు. స్పందించిన ఏఈ మాట్లాడుతూ మండల కమిటీ ముందు ఉంచిన తీర్మానాన్ని కమిటీ ఆమోదించక పోతే 50 రోజుల్లో నివేదికలు జిల్లా అధికారులకు పంపిస్తామని, మండల తీర్మానం రాకపోయినప్పటికీ పనులు ఉన్నతాధికారులు మంజూరు చేస్తారని చెప్పారు. గార్లదిన్నె గ్రామంలో ఉపాధిహామీ పథకంలో మొక్కల పెంపకం పనుల కోసం 82 మందికి తీర్మానం చేస్తే మంజూరు విషయంలో అక్రమాలు జరిగాయని సమావేశం దృష్టికి తెచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, జడ్‌పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల వైస్ చైర్మన్ మెట్టు వెంకటరెడ్డి, సీడీపీవో సుధామారుతి, ఈవోపీఆర్డీ శ్రీదేవి, ఏపీఎం సుధాకర్, ఎన్‌ఆర్ఈజీఎస్ ఈసీ ఈశ్వరి, ఏవో ప్రసన్నరంగలక్ష్మి, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ఎర్రగొండపాలెం టు త్రిపురాంతకం రోడ్డుకు కంకర, చిప్స్ పరుస్తున్న కూలీలు

బురద రోడ్డుకు మరమ్మతులు

- సొంత నిధులు సమకూర్చిన టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి అధ్వానంగా ఉన్న రోడ్డుకు టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. బుధవారం టీడీపీ నాయకులు, పంచాయతీ కార్యదర్శిని కలిసి ఎర్రగొండపాలెం టు త్రిపురాంతకం రోడ్డుకు చిప్స్, కంకర పరిచి రోడ్డుకు గుంతలు పూడ్చారు. ఎర్రగొండపాలెంలోని త్రిపురాంతకం రోడ్డులోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద సుమారు 500 మీటర్ల రోడ్డు బురదగా మారి మాగాణిని తలపిస్తోంది. దీంతో ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించి 1.50 లక్షల రూపాయలతో రోడ్డుకు మరమ్మతులు చేయించారు. మరమ్మతులు చేయించిన ఎరిక్షన్‌బాబును ప్రజలు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు చేకూరి సుబ్బయ్య,పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖరరెడ్డి, నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

మూగజీవాలపట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి
- ప్రమాదంలో గాయపడిన గేదెకు చికిత్స



ప్రమాదంలో గాయపడిన గేదెకు దగ్గరుండి వైద్యం చేయిస్తున్న జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రోడ్లపైకి వస్తున్న మూగజీవాలపట్ల వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారిణి బేబీరాణి అన్నారు. అతి వేగం కారణంగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఒక గేదె నడవలేని స్థితిలో రోడ్డుపై పడిఉంది. పొదిలి వైపు వస్తూ గమనించి ఆమె చలించిపోయింది. గాయాలతో లేవలేని స్థితిలో ఉన్న గేదెను చూసి వెంటనే 1962 సంచార పశువైద్య వాహనానికి ఫోన్ చేసింది. అక్కడికి చేరుకున్న సంచార పశువైద్య వాహన సిబ్బందితో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం అదే వాహనంలో గేదెను పొదిలి ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మేతకోసం పశువులు రోడ్లపైకి వస్తుంటాయని గమనించి వాహనాలను నడపాలని ఆమె సూచించారు. అదే విధంగా పశువుల యజమానులు మేతకోసం గేదెలను రోడ్లపైకి తీసుకొచ్చేటప్పుడు తగుజాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.ప్రమాదంలో ఉన్న పశువులు కనిపించినప్పుడు ప్రజలు చూస్తూ వెళ్లకుండా మీకు అందుబాటులో ఉన్న పశువైద్యశాలకు సమాచారం అందించాలన్నారు. ఇలాంటి ప్రమాదాలు జరిగి పశువులు రోడ్లపై పడిఉంటే వెంటనే సంచార పశువైద్య వాహనానికి 1962 ద్వారా సమాచారం అందించాలని కోరారు. అలా మూగజీవాలను కాపాడుకోవచ్చన్నారు.

ఆరోగ్యవంతులు రక్తదానం చేయాలి

మార్కాపురం సీఐ సుబ్బారావు

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మార్కాపురం సీఐ పి.సుబ్బారావు అన్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మార్కాపురం సీఐ సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించి పోలీసు అమరవీరుల త్యాగాలకు గుర్తుగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరంలో పట్టణానికి చెందిన పలు వర్తక సంఘాలు, విద్యార్థులు, వివిధ రంగాలకు చెందిన పెద్దలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ పోల్ మేనేజ్‌మెంట్ క్లస్టర్ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, వ్యాపారవేత్త సూర పరమేశ్వరరెడ్డి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు, పీఎస్సై రాజమోహనరావు, జీజీహెచ్ వైద్యులు గణేష్, బ్లడ్ బ్యాంక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ సుబ్బారావు

నీట్‌లో ఎన్‌సీసీ కింద విద్యార్థి నిహాల్‌కు సీటు



మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నీట్ 2024 ఫలితాల్లో స్థానిక జ్ఞానశ్రీ కోచింగ్ సెంటర్ విద్యార్థి ఎస్‌కె మహమ్మద్ నిహాల్ ఎన్‌సీసీ కోటా కింద ఉచిత సీటు సాధించాడని బుధవారం డైరెక్టర్ ఎం.మల్లిఖార్జునరావు తెలిపారు. విద్యార్థి నిహాల్ విజయనగరం మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో ప్రవేశానికి అర్హత సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని కోచింగ్ సెంటర్ సిబ్బంది, పలువురు అభినందించారు.

సంక్షిప్తంగా..

విరిగిన రైల్వేగేటు - స్తంభించిన ట్రాఫిక్

గిద్దలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాచర్లగేటు సెంటర్‌లో రైల్వేగేటును బుధవారం వాహనం ఢీకొనడంతో విరిగిపోయింది. గేటు వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. తిరిగి రైల్వేగేటును పునరుద్ధరించేందుకు రైల్వే అధికారులకు సుమారు 2గంటల సమయం పట్టింది. దీంతో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగింది. వాహనచోదకులు నానా ఇబ్బందులకు గురయ్యారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి

గిద్దలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం-గుంటూరు జాతీయ రహదారిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజాసంకల్ప వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఎం.రంగసాయిరెడ్డి ఒక ప్రకటనలో అధికారులకు విజ్ఞప్తి చేశారు. దిగువమెట్ట నుంచి గిద్దలూరు మీదుగా బేస్తవారపేట వరకు కల్వర్టులు, కూడళ్ల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం జరుగుతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ సుందరరావు బుధవారం తెలిపారు. పొదిలి డిపో పరిధిలో పొదిలి, కొనకనమిట్ల, మర్రిపూడి, దొనకొండ, దర్శి, కురిచేడు మండలాల ప్రయాణికులు, ప్రజలు ఏమైనా సమస్యలు ఉంటే గురువారం ఉదయం 11 గంటల నుంచి 12వరకు 9959225700కు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

పెద్ద దోర్నాల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ అన్నారు.స్థానిక తహసీల్దారు కార్యాలయం, రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్యాలయాల్లోని పలు రికార్డులు పరిశీలించారు. తహసీల్దారు కిన్నెర శాంతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కండేశ్వరుడికి అన్నాభిషేకం

మార్కాపురం వన్‌టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీ జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో బుధవారం మార్కండేశ్వర స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి అన్నాభిషేకం, ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అర్చకులు ఏలూరు ఆంజనేయశర్మ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ఫసల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దదోర్నాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకాన్ని రైతులు సద్వినియోగపర్చుకోవాలని మండల వ్యవసాయాధికారి జవహర్ లాల్ నాయక్ అన్నారు. మండలంలోని చిన్నగుడిపాడు, పెద్ద బొమ్మలాపురం గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ద్రవజీవామృతం తయారు చేయు విధానాన్ని చూపించారు. అనంతరం రబీలో సాగు చేసిన 6 పంటలు శనగ, మినుము, జొన్న, మొక్కజొన్న, వరి మిరపకు బీమా చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఏవో వెంకటేశ్వర్లు, వీహెచ్‌ఏ హరిజన నాయక్, ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్టీ కాలేజీ విద్యార్థుల వసతి గృహం తనిఖీ

మార్కాపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్టీ కాలేజీ విద్యార్థుల వసతి గృహాన్ని మండల న్యాయసేవాధికార సంస్థ తరపున బుధవారం న్యాయవాదులు తనిఖీ చేశారు. ఏపీ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు న్యాయవాదులు పి.రామచంద్ర, ఎం.అన్వర్‌బేగ్‌లు హాస్టల్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ముఖ్యంగా వారికి మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరు, లివింగ్ రూమ్‌లు, కిచెన్, మరుగుదొడ్లు తదితర వసతులను పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు.



ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న న్యాయవాదులు

క్రైం సమాచారం

పిచ్చిరెడ్డితోటలో ఇల్లు దగ్ధం

- కావాలని నిప్పుపెట్టారని బాధితుడి ఆరోపణ

పొదిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివారుకాలనీ పిచ్చిరెడ్డితోటలో బుధవారం ప్రమాదవశాత్తు ఒక ఇల్లు దగ్ధమైంది. ఇంట్లో సామానులు, డబుల్‌కాట్ మంచంతో సహా అన్ని కాలిపోయాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఒంగోలులోని బంధువుల ఇంటికి వెళ్లిన సమయంలో కొందరు కావాలని మా ఇంటికి నిప్పు అంటించారని వారు అనుమానం వ్యక్తం చేశారు. ఇంట్లో ఉన్న ఆరుసవర్ల బంగారం, రూ. 50వేలు నగదును తీసుకొని నిప్పు పెట్టారని అనుమానం వెలిబుచ్చుతున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాప్రాయం తప్పిందని స్థానికులు అంటున్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

త్రిపురాంతకం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దూపాడు పంచాయతీ హసానాపురంలో జరుగుతున్న పేకాట శిబిరంపై స్థానిక ఎస్ఐ శివబసవరాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 1,370 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలం ముటకులలో పేకాడుతున్న ఐదు మందిపై కేసు నమోదు చేసినట్లు పుల్లలచెరువు ఎస్ఐ సంపత్ కుమార్ బుధవారం తెలిపారు.ముటుకులలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో వారిని పట్టుకొని వారి నుంచి 6100 రూపాయల నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముఖాముఖి

పారిశ్రామిక అభివృద్ధితోనే వలసల నివారణ సాధ్యం

కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి



పారిశ్రామికంగా అభివృద్ధి చెందితేనే కనిగిరి ప్రాంతంలో వలసల నివారణ సాధ్యమవుతుంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చర్యలు చేపట్టిందని కనిగిరి ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి ఆంధ్రజ్యోతికి చెప్పారు. ఆయనతో...

ప్రశ్న : ఫ్రీహోల్డ్ భూముల ఆన్‌లైన్‌లో అవకతవకలకు కారణాలేమీ?

జవాబు : ఫ్రీహోల్డ్ భూముల్లో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాం. ఇప్పటికే నివేదికను సీసీఎల్‌కు అందజేశాం. అక్రమార్కులకు చెందకుండా ఆ భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేశాం. నిజమైన లబ్ధిదారులకు ప్రభుత్వం ఎలాంటి హానీ కలగనివ్వదు.

ప్ర : నడికుడి-కాళహస్తి రైల్వే మార్గం ఏర్పాటులో జాప్యమెందుకు?

జ : కనిగిరి ప్రాంతంలో రైల్వేలైన్ పనులు చాలావరకు పూర్తయ్యాయి. రైల్వేలైన్ మార్గం ఏర్పాటులో మైనింగ్ క్వారీల నిర్వాహకులతో పాటు, ఆయా గ్రామానికి చెందిన ప్రజలకు చెందిన భూములు ఏవైనా కోల్పోతే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించనుంది. త్వరలోనే ఆ సమస్య కూడా లేకుండా చేసి రైల్వేలైన్ మార్గం పూర్తి చేస్తాం.

ప్ర : కనిగిరి బైపాస్ అసంపూర్తిగా ఉండడానికి కారణమేమిటి?

జ : ఎన్‌హెచ్ అధికారులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపాం. ఇటీవలే 70 మంది భూనిర్వాసితులకు నష్టపరిహారం అందించాం. ఎన్‌హెచ్ కాంట్రాక్టర్లు పనులు త్వరలోనే చేపట్టేలా చేసి బైపాస్‌ను త్వరలో పూర్తి చేస్తాం.

ప్ర : నిమ్జ్, ఐఐటీ ఏర్పాటుపై పురగోతి ఉందా ?

జ : నిమ్జ్ కోసం ఇప్పటికే 4300 ఎకరాల భూమిని ఏపీఐఐసీకి అప్పగించాం. ఇది సాకారమైతే ఎంతో మందికి పరోక్షంగా, పత్యక్షంగా ఉపాధి, ఉద్యోగాలు వస్తాయి. ఐఐటీ కనిగిరి ప్రాంతంలోనే ఏర్పాటు జరిగేలా శాసనసభ్యులు పట్టుదలతో ఉన్నారు. ఆయన చొరవతో త్వరలోనే నిమ్జ్, ఐఐటీ పట్టా లెక్కుతుంది.

ఆహారాన్ని రుచికరంగా వండాలి



భోజనాన్ని వడ్డిస్తున్న కొండలు

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో విద్యార్థులకు ఇంటి భోజనం వలే వండిపెట్టాలని ఏఎంసీ చైర్మన్ గుత్తి కొండలరావు చెప్పారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనాన్ని రుచిచూశారు.

మళ్లీ పీటముడి



- దర్శిలోని విద్యుత్ కార్యాలయం అద్దె చెల్లింపులో మొదటికొచ్చిన వివాదం
- సతమతమవుతున్న ఆ శాఖ అధికారులు
- ఖాళీ స్థలం సమస్య పరిష్కరిస్తేనే బాడుగ డబ్బు తీసుకుంటామంటున్న యజమానులు

దర్శి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : దర్శిలోని విద్యుత్‌శాఖ కార్యాలయం అద్దె వివాదం ఇంకా కొనసాగుతూనే ఉంది. సమస్యకు పరిష్కారం దొరికినట్లే దొరికి మళ్లీ మొదటికొచ్చింది. ఆ శాఖ అధికారులు ఎట్టకేలకు అద్దె ఖరారు చేసి నగదు మంజూరు చేయించి ఇవ్వబోయినప్పటికీ ఇంటి యజమానులు అంగీకరించటం లేదు. స్థలం వివాదం పరిష్కారం కాకుండా అద్దె డబ్బులు తీసుకునేందుకు ఇష్టపడటం లేదు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు ఏం చేయాలో అర్థంకాక సతమతమవుతున్నారు.

దర్శిలోని విద్యుత్‌శాఖ సబ్ డివిజన్ కార్యాలయానికి ఇంటి యజమానులు ఇటీవల తాళం వేయగా పోలీసుల సమక్షంలో దానిని తెరిపించారు. ఆ శాఖలో పనిచేస్తున్న జేఏవో నాదేళ్ల వేణుగోపాల్ భవనం అద్దె ఖరారు కోసమని నమ్మించి ఖాళీ స్టాంపులపై సంతకాలు చేయించుకొని విద్యుత్‌శాఖ కార్యాలయానికి అద్దెకు ఇచ్చిన భవనం పక్కన ఉన్న స్థలాన్ని తనకు విక్రయించినట్లుగా వేణుగోపాల్ రికార్డులు సృష్టించుకొని మోసం చేశాడని భవన యజమానులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఈ విషయంపై విచారణ జరుపుతున్న నేపథ్యంలో ఇంటి యజమానులు కార్యాలయానికి తాళాలు వేశారు. దీంతో ఉన్నతాధికారులు చొరవ తీసుకొని అగ్రిమెంట్ ప్రకారం నెలకు రూ.16వేల చొప్పున అద్దె ఖరారు చేయటంతోపాటు గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు ఐదు నెలల బకాయిల నగదు కూడా మంజూరు చేయించారు. అద్దె తీసుకోవాలని అధికారులు కోరుతున్నా ఇంటి యజమానులు సానుకూలత వ్యక్తం చేయక పోవటంతో అధికారులు ఏం పాలుపోక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.



వివాదంలో ఉన్న స్థలం

జేఈవో వేణుగోపాల్ బదిలీ

వివాదానికి కారణభూతుడైన విద్యుత్ శాఖ జేఏవో నాదేళ్ల వేణుగోపాల్‌ను అధికారులు బదిలీ చేశారు. ఇంటి యజమాని ఖాళీ స్థలాన్ని నకిలీ స్టాంపుల ద్వారా స్వాహా చేశాడని ఫిర్యాదు చేసిన నేపథ్యంలో ఆయన్ను కందుకూరుకు బదిలీ చేశారు. ఆ స్థలాన్ని కోటి రూపాయలకు కొనుగోలు చేశానని, తాను ఎలాంటి మోసానికి పాల్పడలేదని వేణుగోపాల్ చెబుతున్నాడు. కార్యాలయానికి తాళాలు వేసిన సమయంలో వేణుగోపాల్ మెడికల్ లీవ్ వాట్సాప్ ద్వారా అధికారులకు పంపి కనిపించకుండా వెళ్లాడు. మెడికల్ లీవ్ అలా పంపటాన్ని తీవ్రంగా భావించిన అధికారులు అతనిపై బదిలీ వేటు వేశారు. విచారణలో దోషులెవరో తేలేవరకు ఈ సమస్య పరిష్కారమయ్యే సూచనలు కనిపించటం లేదు.

ప్రజాదర్బార్‌తో సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే డాక్టరు ముక్కు ఉగ్రనరసింహా రెడ్డి

భూ సమస్యలపై వెల్లువెత్తిన ఫిర్యాదులు

వెలిగండ్ల, అక్టోబరు 23 : ప్రజాదర్బార్ కార్యక్రమం ప్రజలతో మమేకం అవ్వడంతో పాటు వారి సమస్యలు పరిష్కరించడానికి దోహదపడుతుందని ఎమ్మెల్యే డాక్టరు ముక్కు ఉగ్రనరసింహారెడ్డి చెప్పారు. వెలిగండ్ల ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమస్యలపై వచ్చే ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని హితవు పలికారు. ప్రజా సమస్యల పరిష్కార చర్యలతోపాటు గ్రామాల అభివృద్ధిపై అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పారు. అలా కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేకపోయిందన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వహించిన రీసర్వే వల్ల భూసమస్యలు ఏర్పడ్డాయని విమర్శించారు. తొలుత మండలంలో 21 గ్రామ పంచాయతీల ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదులతో కూడిన వినతులు అందజేశారు. మొత్తం 156 అర్జీలు రాగా అందులో 103 అర్జీలు భూ సమస్యలపై వచ్చాయి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రమణమహాలక్ష్మీ, డీఎల్‌పీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో అన్నమ్మ, తహసీల్దార్ సుజన్య పాల్గొన్నారు.

సీఎస్‌పురం : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే ఉగ్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ మంజునాథరెడ్డి, ఎంపీడీవో షేక్ ఖాదర్‌బీ,డీఈ శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టరు ఉగ్ర

జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్‌కు విద్యార్థులు దూరం

తల్లిదండ్రులు వచ్చి చెప్పినా ఆటలకు పంపని సిబ్బంది

ముండ్లమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జరిగిన మండల, నియోజక వర్గ స్థాయి క్రీడల్లో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జిల్లా స్థాయి ఆటల పోటీలకూ ఎంపికయ్యారు. ఆ మేరకు పంగులూరులో బుధవారం నుంచి జిల్లా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఆ పోటీలలో ముండ్లమూరు ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొనాల్సి ఉంది. తల్లిదండ్రుల అనుమతితో పాఠశాల వద్దకు వచ్చారు. వారు వెళ్లటానికి వీల్లేదని, చదువుకు భంగం కలుగుతుందని పీడీ రాముడు ఒప్పుకోలేదు. ఆ తర్వాత క్రీడాకారుల తల్లిదండ్రులు ప్రిన్సిపల్ పూర్ణచంద్రరావును కలసి అభ్యర్థించినా ఉపయోగం లేకుండా పోయింది. 'క్రీడల వల్ల చదువుకు ఇబ్బంది జరుగుతుందని, మీ బిడ్డల భవిష్యత్ గురించి మీరే ఆలోచించుకోవాలని' ప్రిన్సిపల్ పూర్ణచంద్రరావు చెప్పారు. దీంతో విద్యార్థులు చేసేదేమి లేక పాఠశాలలోనే ఉండిపోయారు. మండల, నియోజక వర్గ స్థాయిలో క్రీడల్లో ప్రతిభ చూపిన జిల్లా స్థాయిలో ఆడలేకపోయామని క్రీడాకారులు వాపోయారు.

జాతీయ స్థాయి క్రీడాకారిణికీ దక్కని అవకాశం

జాతీయ స్థాయి ఖోఖో క్రీడాకారిణి పీ ఐశ్వర్య కూడా జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనాల్సి ఉంది. ఆ క్రీడాకారిణికి కూడా అవకాశం లేకపోయింది. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వంతో చదువుతోపాటు క్రీడలకు పెద్ద పీట వేస్తుందని చెపుతున్నా ఆచరణలో ఉపయోగం లేకుండా పోయిందని క్రీడాకారులు తెలిపారు. దీనిపై ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావును వివరణ కోరగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం నుంచి తమకు సమాచారం అందలేదని, అందువల్లే విద్యార్థులను ఆటలకు పంపలేదని చెప్పారు.

పలుచోట్ల రెవెన్యూ గ్రామసభలు

పీసీపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిచ్చిగుంటపల్లి రెవెన్యూ గ్రామసభలో తహసీల్దార్ సీహెచ్ ఉష పాల్గొన్నారు. వివిధ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను ఆమె పరిశీలించారు. గ్రామసభలో డిప్యూటీ తహసీల్దార్ పృథ్వీ పాల్గొన్నారు.

పామూరులో...

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కరోళ్లపాడులో జరిగిన గ్రామ రెవెన్యూసభలో తహసీల్దార్ బీవీ రమణారావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీలత, వీఆర్వో వాసవి, గ్రామస్థులు పాలపర్తి వెంకటేశ్వర్లు, నీరుకట్టు హరిబాబు, అల్లు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దొనకొండలో...

దొనకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : రీసర్వేలో జరిగిన తప్పులను సరిదిద్దేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రమాదేవి చెప్పారు. మండలంలోని సిద్ధాయిపాలెంలో గ్రామసభ నిర్వహించారు. భూ సమస్యలపై 14 అర్జీలు అందినట్లు తెలిపారు.

ముండ్లమూరులో...

ముండ్లమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినఉల్లగల్లులో నిర్వహించిన గ్రామసభలో ఇన్‌చార్జి తహసీల్దార్ ఆర్ శ్రీకాంత్ రైతుల నుంచి 26 అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, ఆర్‌ఐ మూర్తి, మండల సర్వేయర్ కోటంరాజు, వీఆర్‌వో పెద్దన్న పాల్గొన్నారు.



అర్జీ స్వీకరిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలి

ముండ్లమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే విధంగా వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు పాటించాలని ఏవో ఫరూక్ చెప్పారు. బుధవారం మండలంలోని పులిపాడు, ఉల్లగల్లు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ వ్యవసాయ అధికారి శేషమ్మ, సర్పంచ్ జనమాల నాగేంద్రం పిచ్చయ్య, వీఏఏ ఆంజనేయులు, ఎంపీఈవో రజాక్ పాల్గొన్నారు.అలాగే ఉమామహేశ్వర అగ్రహారం గ్రామంలో వర్షాలకు దెబ్బతిన్న మిర్చి తోటలను ఉద్యానవన శాఖ అధికారి రవికుమార్ పరిశీలించారు.కార్యక్రమంలో గూడాల సుబ్బారెడ్డి, కాటూరి వీరాంజనేయులు, పయ్యావుల శివ, నలబోతు వెంకటనారాయణ పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బెల్లంకొండవారిపాలెం, లక్కవరం, దోసకాయలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకృతివ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ బి.సుభాషిణి, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు, వీఏఏ భార్గవి, వీరాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.



వరి పైరును పరిశీలిస్తున్న ఏడీఏ రమణ

పామూరులో...

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని దాదిరెడ్డిపల్లి, చిలంకూరు, పడమటకట్టకిందపల్లి గ్రామాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో కే రాధ జి. కొండారెడ్డి, ఎం నరసింహులు. గుంటక జైపాల్, కే ఆదియ్య, కల్లూరి తిరుపతయ్య పాల్గొన్నారు. మండలంలోని పెద రాజుపాలెంలో పొలంపిలుస్తోంది కార్యక్రమంలో ఏడీఏ రమణ ఉద్యనశాఖ అధికారి కె. కుసుమ పాల్గొన్నారు.

కమ్మవారిపల్లిలో మురుగు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పీసీపల్లి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కమ్మవారిపల్లిలో రోడ్డుపై పేరుకుపోయిన మురుగును అధికారులు ఎట్టకేలకు తొలగించారు. గతంలో సీసీరోడ్డు వేసిన సమయంలో సైడుకాలువలు నిర్మించలేదు. కొద్దిపాటి చినుకులు పడినా రోడ్డుపైన మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతుంటుంది. రెండురోజుల క్రితం ఆంధ్రజ్యోతిలో కంపుకొడుతున్న కమ్మవారిపల్లి అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో ప్రభాకరశర్మ బుధవారం కమ్మవారిపల్లిని సందర్శించారు. రోడ్డుపై నిలిచిఉన్న మురుగును ఎక్స్‌కవేటర్ ద్వారా తొలగించి గ్రామంలో పారిశుధ్య పనులు చేయించారు. అనంతరం బ్లీచింగ్‌ను చల్లించారు. ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామంలో సైడుకాలువలు, సీసీరోడ్డు నిర్మాణానికి శాసనసభ్యులు ఉగ్రనరసింహారెడ్డి ఎన్‌ఆర్‌ఈజీఎస్ స్కీం నుంచి 25లక్షల రూపాయల నిధులను మంజూరు చేయించారన్నారు. త్వరలోనే పనులు చేపడతామని చెప్పారు. ఈఓఆర్డీ మల్లేశ్వరి, పంచాయతీ సెక్రటరీ వెంకటనారాయణ ఉన్నారు.



మురుగును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

నేర వార్తలు

భారీగా క్రాకర్స్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న క్రాకర్స్‌తో పోలీసులు

కురిచేడు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : కురిచేడులో రూ.2 లక్షల విలువచేసే క్రాకర్స్‌ను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంతో ఎస్‌ఐ శివ స్థానిక షాదీఖానా వద్ద గోడౌన్‌లో ఉంచిన దీపావళి మందులను గుర్తించి పట్టుకున్నారు. వాటిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి భద్రపరిచారు. అనుమతులు లేకుండా ఎవరూ దీపావళి మందులు నిల్వ ఉంచకూడదని ఎస్‌ఐ తెలిపారు.

మద్యం తాగిన ఆటో డ్రైవర్‌కు రూ.3వేలు జరిమానా

కనిగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి ఆటోనడుపుతున్న వ్యక్తికి కనిగిరి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి కే భరత్‌చంద్ర రూ.3వేలు జరిమానా, 3రోజులు జైలుశిక్ష విధించినట్లు ఎస్ శ్రీరాం చెప్పారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన పులిపాటి బాలకేశవులు మద్యం సేవించి ఆటో నడుపుతున్నాడు. ఈ క్రమంలో డ్రంక్ డ్రైవ్ కార్యక్రమంలో ఎస్‌ఐ ఆటో డ్రైవర్‌ను పరీక్షించగా మద్యం సేవించి ఉన్నట్లు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. విచారణ చేసిన జడ్జి.. ఆటో డ్రైవర్‌కు రూ.3వేలు జరిమానా, 3రోజులు జైలుశిక్ష విధించారు.

ఉద్యోగినిపై తాగుబోతు అసభ్యకర ప్రవర్తన

అదుపులోకి తీసుకున్న పోలీసులు

కనిగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగినిపై తాగుబోతు అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన బుధవారం స్థానిక పామూరు బస్టాండు వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని ఓ ప్రభుత్వ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ఉద్యోగిని విధులు ముగించుకుని ఇంటికి వెళ్లేందుకు పామూరు బస్టాండు వద్దకు వచ్చింది. ఈ క్రమంలో టకారిపాలేనికి చెందిన తాగుబోతు ఆ ఉద్యోగినితో అసభ్యకరంగా ప్రవర్తించారు. మనస్తాపం చెందిన మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాగుబోతుపై గతంలో నేరారోపణలతో పాటు పలు కేసులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

అవీఇవీ

ఈ నెల నుంచి కందిపప్పు, చక్కెర

పామూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : తెల్ల రేషన్ కార్డుదారులందరికీ ఈ నెల రేషన్ సరుకులతోపాటు కేజి కందిపప్పును కూడా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందని ఎంఎల్‌ఎస్ పాయింట్ డీటీ మధుసూదనరావు తెలిపారు. స్థానిక ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రేషన్ షాపులకు సరుకుల సరఫరా ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. కార్డుదారులకు ఉచిత బియ్యంతో పాటు రూ.67కు కేజి కందిపప్పు, రూ.17లకు అర కేజీ పంచదార ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఈ నెల నుంచే బియ్యం వద్దన్న కార్డుదారులకు 3కేజీల జొన్నలు ఇస్తామన్నారు.

నిరంతర కృషితోనే భవిష్యత్తుకు పునాది

పీసీపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నిరంతరం కష్టపడి చదువుకోవడం ద్వారా తమ భవిష్యత్తుకు పునాదులు వేసుకోవచ్చునని మండల విద్యాశాఖాధికారులు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు చెప్పారు.గత ఏడాది 10, ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరాల్లో ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన సాంఘిక సంక్షేమ, కేజీబీవీల్లోని విద్యార్థులకు రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు మార్కాపురం రాంభూపాల్‌రెడ్డి బుధవారం జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కనిగిరి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు పీసీ కేశవరావు కోరారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన 16రోజుల సమ్మె కాలానికి మున్సిపల్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కనిగిరి మున్సిపాల్టీలో 60వేలకు పైగా 20 వార్డుల్లో నివసిస్తున్న జనాభాకు 68 మంది కార్మికులు ఎలా సరిపోతారని ప్రశ్నించారు. తక్కువ మంది కార్మికులతో వెట్టిచాకిరి చేయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా కాలంలో పనిచేసిన వారికి వేతనాలు చెల్లించాలని, వారి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నాయకులు సీహెచ్ ప్రసాద్, ఓబయ్య, లక్ష్మయ్య, రవి, ఆనంద్, ఎలీషా, రవణమ్మ, అంకమ్మ, రోజమ్మ పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలి

పామూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పామూరులో వీధి కుక్కల బెడద నుంచి ప్రజలను రక్షించాలని టీడీపీ పట్టణ ఫోర్‌మెన్ కమిటీ సభ్యుడు వార్డు మెంబరు ఉప్పలపాటి హరిబాబు కోరారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శి అరవిందకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పందిటి హరీష్, ఎన్ సాంబయ్య, మెంటా నరసింహారావు, మోషే, సోమిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు. విరువూరు రోడ్‌లో గల ముస్లిం షాదీ మంజిల్ అభివృద్ధికి పంచాయతీ నిధులు మంజూరు చేపట్టాలని కోరుతూ టీడీపీ మైనార్టీ సంఘం సభ్యులు కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ ఖాజారహంతుల్లా, ఆర్‌ఆర్ రఫీ, ముబినామౌలాలి, మాచర్ల రహిమాన్, ఖాజీ ఖాదర్ బాష, పత్తు మస్తాన్, చాంద్‌బాష, రియాజ్, ఖాజామొహిద్దీన్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ.. జీవితంలో ఒక భాగం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న సహచరులు

కనిగిరి, అక్టోబరు 23 : ఉద్యోగ విరమణ జీవితంలో ఒక భాగమని ప్రభుత్వ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయురాలు మల్లెల నాగభూషణమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సెక్రటరీ దిల్షాద్‌బేగం, రిటైర్డు ఉపాధ్యాయులు చంద్రశేఖర్, బషీరున్నీసా, మాజీ విద్యాకమిటీ చైర్మన్ నరేష్, పాఠశాల పీఈటీ డైరెక్టర్ పాశం సుశీల, ఉపాధ్యాయులు గౌతమి, గంగవరపు కళావతి, కేఅనురాధ, బట్టు శైలజారాణి, రుక్మిణీ, ఆవుల కోటేశ్వరి, కిరణ్‌కుమారి, శేషకుమారి, సరస్వతి, డీవీ రంగారెడ్డి, టీ రమణారెడ్డి, పీ సత్యగోపాల్, తాతపూడి బుజ్జి, సుకుమార్, బాల పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

దొనకొండ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా గ్రామాల్లో పారిశుధ్యం లోపించి వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, ముందుగానే తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీదేవి చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎంఈవో సాంబశివరావు, వైద్యాధికారిణి సునీత, ఈవోఆర్డీ షేక్ ఆదాంషఫీ పాల్గొన్నారు.

తాళ్లూరులో...

తాళ్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కల్లూరి సుందరరామయ్య చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన చర్యల గురించి బుధవారం సమావేశం జరిగింది. వైద్యాధికారులు రాజేష్‌యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈవో సుబ్బయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలి పాల్గొన్నారు.









డ్రోనాచార్యులు

ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం

అందరి లక్ష్యం సులభతర సేవలే

రైతుల కష్టాలే స్ఫూర్తిగా డ్రోన్ల సృష్టి

ఆంధ్రజ్యోతితో ఔత్సాహిక ఇంజనీర్లు, విద్యార్థులు

సాంకేతికత.. వినూత్న ఆలోచన.. సులభతరం.. వేగవంతం.. తక్కువ ఖర్చు.. ఏదో సాధించాలన్న తపనతో నేటి యువతరం ఆకాశమే హద్దుగా దూసుకెళ్తోంది. వ్యవసాయంలో రైతుల కష్టాలను చూసి.. రైతు బిడ్డలు వినూత్నంగా స్పందించారు. ప్రకృతి వైపరీత్యాల్లో సులభంగా సేవలు అందించాలని మరికొందరు ముందుకు వచ్చారు. సీనియర్లు అందించిన పరిజ్ఞానాన్ని పరిశీలించి మరింత నాణ్యంగా, నైపుణ్యతతో ఆలోచించారు. వీరందరికీ రాష్ట్ర ప్రభుత్వం మంగళగిరి వేదికగా నిర్వహిస్తున్న అమరావతి డ్రోన్ సమ్మిట్ -2024 వారి కష్టాన్ని, సాధించిన ఘనతను ప్రపంచం ముందు ఉంచింది. వారి ఆనందాన్ని, వారి కష్టాల వెనుక ఉన్న నేపథ్యాన్ని వారు ఆంధ్రజ్యోతితో పంచుకున్నారు.

గుంటూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): వారిలో ఒక్కొక్కరిదీ ఒక్కో నేపథ్యం. ఎవరి అనుభవాలు వారివి.. ఎవరి దృష్టి కోణం వారిది.. కానీ లక్ష్యం మాత్రం అద్భుతమైన విహంగాలను సృష్టించడం. ఒకప్పుడు కేవలం ఫంక్షన్లలో వీడియోలు తీయడానికే పరిమితమైన డ్రోన్ సేవలు ఇప్పుడు అనేక రంగాల్లోకి విస్తరించాయి. ఏదో సాధించాలన్న తపన.. కొత్తదనం కోసం ఆరాటం.. అందుకోసం ఔత్సాహిక యువ ఇంజనీర్లు, విద్యార్థులు సాగించిన అన్వేషణ.. వారికి లభించిన ప్రోత్సాహం.. తోడ్పాటు.. వెరసి రాబోయే యుగ దూతగా డ్రోన్లు ప్రజల ముందుకు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వ చొరవతో మంగళగిరి సీకే కన్వెన్షన్ హాలులో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైన డ్రోన్ సమ్మిట్ వారి ఉత్సాహాన్ని మరింత పెంచింది.

రైతుల కష్టాలు చూసి కదిలిపోయా



మాది కృష్ణాజిల్లా ఉయ్యూరు పక్కన నెప్పల్లి గ్రామం. మాది రైతు కుటుంబం. ఎరువులు, పురుగు మందులు చల్లేటప్పుడు రైతులు, కూలీలు పడే కష్టం, జరిగే ప్రాణాంతక ప్రమాదాలు చూశా. ఏరోస్పేస్ ఇంజనీరింగ్ చేశాను. చదువు వ్యవసాయానికి ఉపయోగపడేలా ఆలోచించా. మా ఫ్రెండ్ కమల్ తోడుగా నిలిచాడు. ఇద్దరం కలిసి హైబ్రిడ్ ఇంజన్ డ్రోన్‌ను సిద్ధం చేశాం. దానితో ప్రతి రోజూ 30 ఎకరాల్లో సులువుగా ఎరువులు, పురుగు మందులు చల్లవచ్చు. డ్రోన్లు కొనలేనివారికి కూడా మేం సేవలు అందిస్తున్నాం. ఇప్పటికి 25వేల ఎకరాల్లో డ్రోన్లతో సేవలు చేస్తు న్నాం. లాజిస్టిక్ డ్రోన్లు ద్వార వరదల్లో చిక్కుకున్న విజయవాడ వాసులకు ఆహార పొట్లాలు, నీళ్ల, అత్యవసర మందులు అందజేశాం.

-గోపీ వెంకట కృష్ణ, ఉయ్యూరు

ఆరో తరగతి నుంచి ప్రయోగాలే



మాది విశాఖపట్నం. మెకానికల్ ఇంజనీరింగ్ చదివా. చిన్నప్పటి నుంచి నాకు విమానాలు అంటే ఆసక్తి. అందుకే నేను ఆరో తరగతి నుంచే ప్రయోగాలు చేసేవాడిని. మా నాన్నగారు నన్ను ప్రోత్సహించేవారు. ఖర్చు భరించేవారు. కాలేజీలో చేరాక నా ఆసక్తికి మార్గం దొరికింది. ఇండస్ట్రియల్ డ్రోన్లు రూపొందించా. వాటిని ప్రమోట్ చేసేందుకు పెద్ద పెద్ద సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకూ 10 సమ్మిట్లలో పాల్గొన్నా. రఘు ఇంజనీరింగ్ కాలేజీలో 2వ బహుమతి వచ్చింది.

- ఏ. ప్రవీణ్, విశాఖపట్నం

తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం



మేం ఎస్సార్ఎం కాలేజీలో చదువు తున్నాం. అత్యవసర మందులు అందించేందుకు వీలుగా డ్రోన్లు రూపొందించాం. సెల్ ఫోనులో వినియోగించే బ్యాటరీకి రెట్టింపు సైజులో అంటే 10వేల ఎంఏహెచ్ బ్యాటరీతో నడిచే తేలికపాటి డ్రోన్‌ను రూపొందించాం. దాన్ని అందించడానికి ఒక వెబ్ ఇంటర్‌ఫేజ్ ఏర్పాటు చేసి, ఆటోమేటిక్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి 10 కి.మీ. పరిధిలో మందులు అందించేందుకు వీలుగా డ్రోన్ ను రూపొందించాం.ఆమోదం వస్తే సేవలు మొదలుపెడతాం.

- మణికంఠ, పుష్పక్, అజిత్

అవయవాల తరలింపు కోసం డ్రోన్

కిలో.. రెండు కిలోల లగేజీ మోసే డ్రోన్లకు భిన్నంగా రూపొందించాలని భావించాం. అందుకే 7 కిలోల పే లోడ్ ఉండేలా డ్రోన్ రూపొందించాం. ఇందులోని బ్యాగులో మైనస్ 1 నుంచి మైనస్ 3 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ చల్లదనం ఉంటుంది. అందువల్ల అత్యవసర మందులు, మానవ అవయవాలు భద్రంగా, వేగంగా తరలించవచ్చు. వేగం కూడా గంటకు 125 కి.మీ. ఒకసారి చార్జ్ చేస్తే 150 కిలో మీటర్ల దూరం ప్రయాణించగలదు.



- ఏకాంత్, తంజావూర్

హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్



మాది తాడేపల్లిగూడెం పాలకొల్లు ప్రాంతం. రైతుల సమస్యలు చూసి డ్రోన్ల రూపకల్పన ఆలోచన చేశాం. కరోనా సమయంలో ఎరువులు, పురుగు మందులు ఉన్నా కూలీలు దొరక్క రైతులు నష్టపోయారు. అప్పుడే ఆలోచన చేసి డ్రోన్ల రూపకల్పన చేశాం. హైదరాబాదు కేంద్రంగా స్టార్టప్ ఏర్పాటు చేశాం. ఆంధ్రుల తొలి డ్రోన్ స్టార్టప్ మాదే కావడం విశేషం. 80 డ్రోన్లు రూపొందించాం. తొలి రోజుల్లో మేమే వెళ్లి స్వయంగా ఎరువులు, మందులు చల్లాం.ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధమైంది. ఇలాంటివి 2025 నాటికి 2000 డ్రోన్లు తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వ హామీలు, ప్రోత్సాహకాలు బాగున్నాయి. అందుకే హైదరాబాద్ నుంచి ఏపీ వచ్చేయాలనుకుంటున్నాం.

- హేమంత్, హనుమ, సాయిచరణ్

స్వామ్ డ్రోన్లదే రాజ్యం



ముందు ముందు స్వామ్ డ్రోన్లదే రాజ్యం. తమ సీనియర్లు డ్రోన్లు రూపొందించి ఆ విజ్ఞానాన్ని మాకిచ్చారు. అంతకన్నా భిన్నంగా రూపొందించాలని ఆలోచించాం. ఒక డ్రోన్ పనిచేయాలంటే ఒక మనిషి కావాలి. అలా వంద డ్రోన్లు పనిచేయాలంటే వందమంది కావాలి. మ్యాన్ పవర్ తగ్గేలా చేయాలనేది మాకొచ్చిన ఆలోచన. ఆ ప్రయత్నంలో స్వామ్ డ్రోన్ టెక్నాలజీని కనుగొన్నాం. ఈ విధానంలో ఒక డ్రోన్ ఇతర డ్రోన్లన్నింటినీ నడుపుతుంది. మాస్టర్ డ్రోనుకు కమాండ్స్ ఇస్తే అదే మిగిలిన డ్రోన్లకు వాటిని పంపుతుంది. ఇలా ఒక్క మనిషే అనేక డ్రోన్లు ఆపరేట్ చయవచ్చు. - విజ్ఞాన్ విద్యార్థులు

స్వదేశీ టెక్నాలజీతో డ్రోన్ చేశాం

ఉత్తరాంధ్రకు చెందిన ఆరుగురం స్నేహితులం. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్ కేంద్రంగా 2018లో 15 లక్షల పెట్టుబడితో డ్రోన్లు తయారుచేయడం మొదలుపెట్టాం. తొలిగా నిఘా డ్రోన్లు తయారుచేసి ఆర్మీకి అందజేశాం. కరోనా తర్వాత అగ్రో బేస్డ్ డ్రోన్లపై దృష్టిపెట్టి ఒక డ్రోన్ తయారు చేశాం. దానికి ప్రభుత్వ అనుమతి కూడా లభించింది. ఇప్పుడు రెండో తరం డ్రోన్ సిద్ధం చేశాం. చైనా డ్రోన్లకు భిన్నంగా దేశీయ పరికరాలతో డ్రోన్లు రూపొందించాం. ఒకసారి ఫ్యూయల్ తీసుకుంటే పది సార్లు, పది ఎకరాలు ఎరువులు, మందులు పిచికారీ చేయవచ్చు. గడిచిన 3 నెలల్లో 200 యూనిట్లు విక్రయించాం. అమ్మకాలు 8 కోట్లకు చేరాయి. ఈ ఏడాది 15 కోట్లు టార్గెట్‌గా పెట్టుకున్నాం.

- తులసీరామ్, ఎరైస్ సొల్యూషన్స్



- ఆరు నెలల నుంచి జమకాని స్టాంప్‌డ్యూటీ
- మున్సిపాలిటీలు, పంచాయతీల్లో నిధుల గండం



రిజిస్ట్రార్ కార్యాలయం

స్థానిక సంస్థలకు మొండిచేయి

రేపల్లె, ఆంధ్రజ్యోతి) సకాలంలో నిధులు జమ కాక స్థానిక సంస్థలైన పంచాయతీలు, మున్సిపాల్టీలు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. పల్లెల్లో పారిశుధ్య పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. మున్సిపాల్టీల్లో సకాలంలో కార్మికులకు జీతాలు చెల్లించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రభుత్వం నుంచి వచ్చే నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. చివరకు దస్తావేజు రుసుంలోనూ స్థానిక సంస్థలకు ప్రభుత్వం మొండిచేయి చూపుతుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1,172 పంచాయతీలు, 17 పురపాలక సంఘాలకు సర్‌చార్జి సకాలంలో విడుదల కావడంలేదు. ఇల్లు, స్థలం, పొలం, అపార్ట్‌మెంట్ల క్రయవిక్రయాలు జరిగితే స్టాంపుడ్యూటీ సర్‌చార్జి స్థానిక సంస్థల ఖాతాలకు జమచేయాలి. ఉదాహరణకు ఒక స్థిరాస్తి రూ.కోటికి విక్రయాలు జరిగితే అందులో 1.5 శాతం అంటే రూ1.5 లక్షలు ఆ పరిధిలోని పంచాయతీ లేదా మున్సిపాల్టీ ఖాతాకు జమ చేయాలి. అయితే ఆ ప్రకారం జరగడంలేదు. గుంటూరు జిల్లాలో అధిక శాతం స్థానిక సంస్థలకు ఏడాదిగా చెల్లింపులు జరగలేదు. పల్నాడు, బాపట్ల జిల్లాలో ఆరు నెలల వరకు సర్‌చార్జి జమకాలేదని ప్రజాప్రతినిధులు తెలిపారు. స్టాంపు డ్యూటీ సర్‌చార్జి ద్వారా ఒక్కో జిల్లాలో ఆయా స్థానిక సంస్థలకు రూ.కోట్లల్లో నిధులు జమకావాలి. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి 1.5 సర్‌చార్జి మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మూడో వంతు పంచాయతీలకు, ఒక్కో వంతు జడ్పీ, మండల ప్రజాపరిషత్తులకు విభజించి ఖాతాలకు జమ చేస్తారు. ఈ ప్రక్రియలో నెలల తరబడి జాప్యం జరుగుతోంది. సర్‌చార్జి నిధులతో స్థానిక సంస్థల్లో అనేక అభివృద్ధి పనులు చేయడానికి వెసులుబాటు ఉంటుంది. మున్సిపాల్టీలకు దస్తావేజుల రుసుం నిలిచిపోవడంతో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేక.. కొత్తగా ప్రగతి పనులు చేపట్టలేని దుస్థితి నెలకొంది. సర్‌చార్జికి సంబంధించి రిజిస్ట్రేషన్ల శాఖకు ప్రొసీడింగ్స్ పంపించకోకపోవడానికి ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేకపోవడమేనని సమాచారం. కొంతమంది సర్పంచులు, పురపాలకులు రిజిస్ట్రార్ కార్యాలయాల చుట్టూ తిరిగి స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి జమ చేయాలని కోరుతున్నా ఫలితం ఉండటంలేదు.

స్థానిక సంస్థలను ఆదుకోవాలి

స్థానిక సంస్థలకు దస్తావేజు రుసుం వెను వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. స్టాంప్‌డ్యూటీ సర్‌చార్జి చెల్లిస్తే గ్రామాల్లో నీటి సరఫరా, పారిశుధ్య పనులకు, కార్మికుల జీతాలు, విద్యుత్ బిల్లులు చెల్లించే వెసులుబాబు ఉంటుందన్నారు.



కలెక్టర్ అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న జాస్తి వీరాంజనేయులు

ఏం బలరాం.. బాగున్నావా

- సీఎం చంద్రబాబు పలకరింపు



సీఎం చంద్రబాబుతో కరచలనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బలరాం

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏం బలరాం.. బాగున్నావా అని సీఎం చంద్రబాబు, చీరాల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కరణం బలరాంను కుశలప్రశ్నలతో పలకరించారు. గుంటూరులో బుధవారం మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనువడు, కరణం బలరాం వియ్యంకుడు బాలకృష్ణారావు మనవరాలి వివాహ నిశ్చితార్థ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు, కరణం బలరాంలు పలకరించుకున్నారు. ఆ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

రూ.లక్షకు పసికందు విక్రయం

- నగదు వివాదంతో బహిర్గతమైన వైనం

బాపట్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ముక్కుపచ్చలారని మూడునెలల పసికందును రూ.లక్ష విక్రయించిన ఓ తల్లి సంఘటన బాపట్లలో చర్చనీయాంశమైంది. పట్టణంలోని 11వవార్డు ఇందిరానగర్‌కాలనీకి చెందిన ఓ మహిళ మూడునెలల బిడ్డను ప్రకాశం జిల్లా చీమకుర్తికి చెందిన ఓ మహిళకు మంగళవారం విక్రయించింది. డబ్బుల విషయంలో తలెత్తిన వివాదంతో విషయం బయటకు పొక్కింది. దీంతో తన బిడ్డను తనకు తిరిగి ఇవ్వాలని వాదనకు దిగడంతో అధికారుల దృష్టికి వెళ్ళింది. దీంతో డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటక్షన్ అధికారి పురుషోత్తం విచారించి బుధవారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ ఎస్ఐ విజయ్‌కుమార్ జేజే యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బిడ్డను బాలికాసదన్‌కు తరలించారు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా బిడ్డను విక్రయించినట్లు తల్లి చెబుతుంది.

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!

- డిగ్రీ కళాశాలల్లో నిర్దేశించిన దానికంటే డబుల్ వసూళ్లు
- ఒక్కో విద్యార్థికి అదనంగా రూ. 20 వేలు భారం
- ప్రేక్షక పాత్రలో ఆర్‌జేడీ కార్యాలయ అధికారులు



ఆర్జేడీ కార్యాలయం

గుంటూరు(విద్య), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో యాజమాన్యాలు వసూలు చేసే ఫీజుల దందాకు విద్యార్థులు హడలిపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ఫీజుల కంటే అదనంగా వసూలు చేస్తూ విద్యార్థులను గుల్ల చేస్తున్నారు. ప్రైవేటు, అన్ ఎయిడెడ్ కళాశాలల్లో జరిగే ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. అక్రమ ఫీజుల దందాలో వారు కూడా భాగస్వాములు

(మిగతా 6వ పేజీలో)

వేణుగోపాలపురంలో విషాదం

ఇద్దరు విద్యార్థుల్ని మింగిన ఇటుక బట్టీల క్వారీ

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటుక బట్టీల మట్టి కోసం తవ్విన క్వారీ ఇద్దరు విద్యార్థుల్ని మింగేసింది. బుధవారం జరిగిన ఈ ఘటనతో అద్దంకి మండలం కొటికలపూడి పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురంలో విషాదం నెలకొంది. స్థానికులు తెలిపిన వివరాలు.. కొటికలపూడి పంచాయతీ పరిధిలోని పునరావాసకాలనీ వేణుగోపాలపురానికి చెందిన షేక్ అబ్దుల్లా(12), కాలేషా(18) బుధవారం గేదెలను తోలుకుని పొలం వెళ్లారు. ఇటుక బట్టీల మట్టి కోసం తవ్విన క్వారీలలో ఇటీవల కురిసన వర్షాలకు నీరు చేరాయి. సాయంత్రం ఇంటికి వచ్చే సమయంలో గేదెలు కుంటలోకి దిగడంతో వాటిని తోలేందుకు ఇద్దరూ కుంటలోకి దిగారు. పూడికలో కూరుకుపోయి ఇద్దరూ మృతి చెందారు. గేదెలను సమీపంలో పొలాల్లోకి వెళ్లడంతో రైతులు ఇళ్ల వద్దకు వెళ్లి చెప్పారు. దీంతో తల్లిదండ్రులు పిల్లల కోసం వెతకగా నీటి కుంటలో మృతదేహాలు లభ్యమయ్యాయి.



అబ్దుల్లా, కాలేషా మృతదేహం

ఏడేళ్ల క్రితం భర్త.. ఇప్పుడు కుమారుడు..

అబ్దుల్లా తండ్రి కాలేషా ఏడేళ్ల క్రితం విద్యుత్‌షాక్‌తో చనిపోయాడు. అబ్దుల్లాకు చెల్లెలు ఉంది. ఏడేళ్ల క్రితం భర్త, ఇప్పుడు కుమారుడు మృతితో అబ్దుల్లా తల్లి కన్నీటి పర్యంతమవుతుంది. అబ్దుల్లా తిమ్మాయపాలెం హైస్కూల్‌లో 6వ తరగతి చదువుతున్నాడు. వర్షాలతో నాలుగు రోజులుగా పాఠశాలకు వెళ్లడంలేదు. షేక్ కాలేషా(18) మూడేళ్ల క్రితం చదువు మానేసి మెకానిక్ పని నేర్చుకుంటున్నాడు. ఇళ్ల వద్ద పని ఒత్తిడితో వరుసకు బాబాయి కుమారుడు అయిన కాలేషా, అబ్దుల్లా నాలుగు రోజులుగా గేదెలను పొలం తోలుకు వెళ్తున్నారు. పక్క పక్క ఇళ్లల్లో ఇద్దరు బాలురు మృతి చెందడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రెండు కుటుంబాలలో ఒక్కొక్కరే మగ సంతానం.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ - బాపట్ల జిల్లా.

లెటర్.నెం. ఎం.కె.టి.జి./గొనె సంచుల రవాణా/2024-25 తేది:23.10.2024

గొనె సంచుల రవాణా రీ - షార్ట్ టెండర్ నోటిఫికేషన్

బాపట్ల జిల్లాలో గల పౌర సరఫరాల సంస్థలో 2024-25 సంవత్సరం కొరకు అనగా తేది: 30.09.2025 ముగింపు కాలమునకు జిల్లాలో గల స్టోరేజీ పాయింట్లు (SWC,IG మరియు MLSPల) నుండి (కొత్త, పాత ఒకసారి వాడిన గొనె సంచులను మరియు PP సంచులను) PPCs లకు/ RSKs లకు/ రైస్ మిల్లులకు మరియు మండల స్థాయి గోదాముల నుండి ప్రభుత్వ నిర్దేశిత ప్రాంతములకు గొనె సంచులను రవాణా చేయుట నిమిత్తము అనగా రెండవ దశ రవాణా కాంట్రాక్టర్లను ఈ కాంట్రాక్ట్ నియమించిన తేది నుండి తేది : 30.09.2025 వరకు నియమించుటకు గాను తేది : 31.10.2024 మధ్యాహ్నం 12.00 గంట లోపు (పని దినములలో) మరల టెండరు ఫారములు అమ్ముటకు నిర్ణయించబడినది. కావున ఉత్సాహము కల వారు ఏదేని జాతీయ బ్యాంకులో District Civil Supplies Manager, APSCSCL, Bapatla వారి పేరిట రూ. 5,600/- (Tender form Rs. 5000+Rs.600 GST) లకు డిమాండ్ డ్రాఫ్టును చెల్లించి జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ కార్యాలయము నందు ఈ క్రింది వివరించిన షెడ్యూల్ ననుసరించి టెండర్ ఫారము మరియు టెండర్ నియమ నిబంధనలను పొందవచ్చును.

టెండర్ షెడ్యూల్

1) కాంట్రాక్టు పీరియడ్ : ది. టెండర్ ఖరారు అయిన తేది నుండి 30.9.2025 వరకు
2) టెండర్ ఫారములు అమ్మకము తేది (పని దినములలో) : 24.10.24 నుండి
3) టెండర్ ఫారములు అమ్ముటకు ఆఖరు తేది / సమయము : 31.10.24 మధ్యాహ్నం 12 గం.ల వరకు (పని దినములలో మాత్రమే టెండర్ ఫారములు అమ్మబడును)
4) టెండర్ ఫారములు దాఖలు చేయుటకు ఆఖరు తేది / సమయము : 31.10.24. సాయంత్రం 5.గం.ల వరకు. (పని దినములలో మాత్రమే టెండర్ ఫారములు స్వీకరించబడును)
5) టెండర్స్ తెరిచే తేది / సమయము ప్రదేశము : 04.11.24 సాయంత్రం. 04.00 గం.లకు జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్, కలెక్టరేట్, బాపట్ల.

ఏ కారణము చూపకుండా టెండర్లలో మార్పులు చేయుటకు కానీ వాయిదా వేయుటకు గాని, పూర్తిగా రద్దు చేయుటకు (పరమటకు) గాని జిల్లా జాయింట్ కలెక్టర్ బాపట్ల వారికి పూర్తి అధికారము కలదు.

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఈ.ఒ.ఈ.డి.
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, బాపట్ల జిల్లా.

కటకటాల్లోకి కిరాతక ప్రియుడు

- ఒంగోలు జైలుకు తరలింపు
- 24 గంటల్లో కేసును ఛేదించిన సీఐ


నిందితుడిని అదుపులోకి తీసుకున్న సీఐ

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వివాహిత నాగండ్ల మేరీని హత్య చేసిన ప్రియుడు కండె వరప్రసాద్‌ను పోలీసులు అరెస్ట్ చేసినట్లు బుధవారం సీఐ ఎం. శేషగిరిరావు విలేకరులకు తెలిపారు. మండలంలోని డేగరమూడిలో ఈ నెల 20న మేరీ హత్యకు గురైన విషయం తెలిసిందే. హంతకుడు వర ప్రసాద్‌తోపాటు హత్యకు ఉపయోగించిన కత్తి, స్కూటీ, మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మంగళవారం సాయంత్రం మేదరమెట్ల నుంచి తమ్మవరం వెళ్లే రోడ్డులో బస్‌షెల్టర్ వద్ద పోలీసులు అరెస్టు చేశారన్నారు. బుధవారం నిందితుడ్ని అద్దంకి కోర్టులో హాజరుపరచగా, ఒంగోలు జైలుకు రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా హెడ్ కానిస్టేబుళ్లు కోటేశ్వరరావు, పీవీ సుబ్బారావు, గరుత్మంతుడు, పీసీ రమేష్ కృషి చేశారు. 24 గంటల్లో కేసు ఛేదించిన సీఐని ఉన్నతాధికారులు అభినందించారు.

మహిళపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

మంగళవారం రాత్రి మరో మహిళతో గొడవ పడిన బాధితురాలు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడి మహిళపై దాడికి పాల్పడ్డారు. దీంతో బాధితురాలు చీరాల ఏరియా హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల మండలం రామకృష్ణాపురం సింగ్ డాబా వెనుక షేక్ ఖాదర్‌బీ ఉంటోంది. ఇదే ప్రాంతంలో గతంలో దివ్య, పద్మ నివసించేవారు. ఈక్రమంలో వీరితో ఖాదర్ బీకు వివాదాలు ఉన్నాయి. మంగళవారం రాత్రి గొడవ జరిగింది. బుధవారం సాయంత్రం గుర్తుతెలియని కొందరు వ్యక్తులు ఇంట్లోకి చొరబడి ఈమెపై దాడి చేయగా అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు, కుటుంబ సభ్యులు 108 ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈమేరకు అవుట్‌పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

జామచెట్టుపై నుంచి పడి తండ్రి మృతి

- రెండేళ్ల కిందట అనారోగ్యంతో అన్న, ఏడాది కిందట తల్లి మృతి
- ఒంటరయ్యానని బోరున విలపిస్తున్న చిన్న కుమారుడు

దేవాంగపురి(చీరాలటౌన్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అమ్మా, అన్న చనిపోయారు. ఇప్పుడు నువ్వా నన్ను విడిచివెళ్లావా నాన్నా.. నాకు దిక్కెవరంటూ కుమారుడు హాస్పిటల్ వద్ద బోరున విలపించాడు. ఈ హృదయవిదారక సంఘటన బుధవారం చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ హస్తినాపురంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన పృధివి బాల సుబ్రహ్మణ్యం (65), వెంకట సుబ్బమ్మ దంపతులు. వీరిది చేనేత కుటుంబం. ఎంతో ఆనందంగా ఉండే వీరి జీవితంలో అనుకోని రీతిలో గత రెండేళ్ల కిందట పెద్ద కుమారుడు మృతి చెందాడు. దీంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఏడాది క్రితం అనారోగ్యంతో తల్లి మృతి చెందింది. అప్పటి నుంచి వయోభ్రాయంలో ఉన్న తండ్రికి ఆలనాపాలన చిన్న కుమారుడు సుబ్బారావు చేసుకుంటున్నాడు. దురదృష్టం వీరిని వెంటాడింది. బుధవారం సాయంత్రం ఇంటిముందు ఉన్న జామ చెట్టుకున్న కాయలు కోసేందుకు నిచ్చెన వేసుకుని తండ్రి బాల సుబ్రహ్మణ్యం చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు జారి కిందపడి తలకు బండ రాయి తగిలింది. పక్కనే పనిచేస్తున్న బేల్దారీలు వెంటనే చీరాల ఏరియా వైద్యశాలకు తరలించగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. అన్న, అమ్మ, ఇప్పుడు నాన్న మృతిచెందడంతో సుబ్బారావు హాస్పిటల్ వద్ద కుప్పకూలి బోరున విలపించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కోలలపూడి క్రాస్ రోడ్డు వద్ద టీవీఎస్ మోపెడ్ పై వెళుతున్న పాలపర్తి బాలకృష్ణ అనే వ్యక్తిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బాలకృష్ణకు తీవ్రగాయాలు కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సమాచారం అందడంతో వెంటనే హైవే అంబులెన్సు వారు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాలకృష్ణ టోల్‌ప్లాజా వద్ద ఎన్16 హోటల్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నారు. యద్దనపూడి మండలం యనమదల గ్రామానికి చెందిన అతను విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.

చెక్ డ్యాంలో మొసలి సంచారం

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుగారిపాలెం వాగులో మొసలి కనిపించినట్లు గ్రామ రైతులు చెప్తున్నారు. ఈ వాగుపై గ్రామ సమీపంలో ఉన్న చెక్ డ్యాంలో ఆదివారం సాయంత్రం పొలాలకు మోటారు ద్వారా నీళ్లు పెట్టుకోవడానికి వెళ్లిన రైతులకు మొసలి కనిపించడంతో గ్రామంలో చర్చించుకుంటున్నారు. దాంతో గ్రామస్థులు చెక్ డ్యాం వైపు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. అంతేకాకుండా బుధవారం సాయంత్రం శ్రీనివాసరావు అనే రైతు చెక్ డ్యాం దగ్గరకు వెళ్లగా అతనికి కూడా నీటిలో మొసలి కనిపించినట్లు తెలిసింది. విషయాన్ని మాజీ సర్పంచ్ ఉప్పలపాటి తిరుపతిరాజు సీఐ శేషగిరిరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కె.రమేష్ బాబు దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం చెక్ డ్యాం వద్దకు వచ్చి మొసలిని పట్టుకుంటామని, అప్పటివరకు గ్రామస్థులు జాగ్రత్తగా ఉండాలని తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన ఉండాలి

మార్టూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మార్టూరు హెల్ప్ ఔట్రీచ్ వర్కర్ కే దుర్గ అన్నారు. ప్రభుత్వం 2030 నాటికి రాష్ట్రంలో హెచ్ఐవీ వ్యాధిని పూర్తిగా అరికట్టాలనే లక్ష్యంతో ఎనిమిది అంశాలపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా హెచ్‌వీ ఎయిడ్స్ నియంత్రణ నిర్మూలన సంస్థ, హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ సాగర్ ఆధ్వర్యంలో జొన్నతాళి గ్రామంలో పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రూతు, సల్మా, ప్రమీల, రమ్య, సరోజిని, అంగనవాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రీ గార్డెన్

అద్దంకిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో న్యూట్రీ గార్డెన్‌లలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు సీడీపీవో ఏ.కృష్ణకుమారి తెలిపారు. బుధవారం మండలంలోని బొమ్మనంపాడు, చెరువుకొమ్ముపాలెం గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద న్యూట్రీ గార్డెన్‌లో భాగంగా మొక్కలు నాటారు. కొరిశపాడు ప్రాజెక్టు పరిధిలోని మూడు మండలాలల్లో 11 న్యూట్రీ గార్డెన్‌లు మంజూరైనట్లు కృష్ణకుమారి తెలిపారు. న్యూట్రీ గార్డెన్‌లో పండిన ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు వంటివి తల్లులకు పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఇందిర, రమాదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు డీసీఆర్‌ఎంలో జాబ్ మేళా

ఇంకొల్లు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఇంకొల్లు డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఈ నెల 25 శుక్రవారం ఉదయం 9 గంటలకు గంగవరం రోడ్డులోని డీసీఆర్‌ఎం డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రణయ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18-32 వయస్సు గల నిరుద్యోగ యువతీ యువకులు తమ బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్, పాస్‌పోర్టు ఫొటోలతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. వివరాలకు 6302764962 నంబర్‌కు సంప్రదించాలన్నారు. జాబ్ మేళాను యువతీయువులు సద్వినియోగం చేసుకోవాలని దగ్గుబాటి విద్యా సంస్థల డైరెక్టర్ చిలుకూరి శ్రీధరరావు కోరారు.

రెవెన్యూ సభలతో భూ సమస్యల పరిష్కారం

పర్చూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల సత్వర పరిష్కారానికే రెవెన్యూ గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.బ్రహ్మయ్య అన్నారు. మండల పరిధిలోని అడుసుమల్లి గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో భూసర్వే పూర్తి అయి, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తిన వాటిని సత్వరమే పరిష్కరించాలన్న సంకల్పంతో సభలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ ఆప్ సర్వేయర్ ఎండీ అల్తాఫ్, మండల సర్వేయర్ బాలాంజేయులు, ఆర్ఐ ఇన్‌చార్జి ప్రేమ్ కుమార్, ఉపసర్పంచ్ అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చినగంజాం : భూ సమస్యలపై అర్జీలు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జె.ప్రభాకరరావు అన్నారు. గొనసపూడి గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో బుధవారం గ్రామ సభను నిర్వహించారు. సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామన్నారు. జాయింట్ ఫీల్డ్ విభజనకు 22, భూమి విస్తీర్ణంలో వ్యత్యాసంపై 71, పట్టాదారు నమోదుకు 5, పేరు దిద్దుబాటుకు 7 అర్జీలను రైతులు అందజేశారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాల ఖోఖో జట్ల ఎంపిక


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 14 బాలుర ఖోఖో జట్టు


అండర్ - 14 బాలికల జట్టు

బాల, బాలికల వివరాలు ప్రకటించిన రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి

పంగులూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా బాల, బాలికల ఖోఖో జట్ల ఎంపిక బుధవారం పంగులూరులో జరిగింది. ఈ ఎంపికలో జిల్లా నలుమూలల నుంచి 200 మంది బాలురు, 150 మంది బాలికలు పాల్గొన్నారు. పంగులూరు ఎంఎస్ఆర్, అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో అండర్ - 14 బాల, బాలికలు, అండర్-17 బాల, బాలికల ఖోఖో జిల్లా జట్లను ప్రతిభ ఆధారంగా ఎంపిక చేసినట్లు ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపిక కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి భవనం కాశీవిశ్వనాథ రెడ్డి, పీడీలు హనుమంతరావు, రఘుబాబు, పీఈటీలు సావిత్రమ్మ, రమాదేవి, ఖోఖో జిల్లా కోచ్ లక్ష్మీనారాయనరెడ్డి స్కూల్‌గేమ్స్ కార్యదర్శి హజీరా బేగం పాల్గొన్నారు.

ఎంపికైన ఖోఖో జట్లు

అండర్ - 14 బాలుర జట్టులో పి.వెంకటేశ్వర్లు, ఎ.శ్రీనివాస్, వి.సాగర్ (పంగులూరు), కె.విష్ణు, జి.సందీప్, కె.వెంకటసాయి, ఎస్.విశ్వనాథకుమార్, సీహెచ్ మనోహరరెడ్డి, హేమంత్‌కుమార్ (కేవీపల్లి), కె.నుమంత్, ఎస్.ఆనందబాబు (బేస్తవారపేట), లక్ష్మీనరసింహ (గుడ్లూరు), ఎం.మణికంఠ (వైదన), పి.శాంతికుమార్ (మార్టూరు), శివశంకర్ (వేటపాలెం)పూర్ణచంద్రరావు (ఈదర), విశ్వనాథ్ (చీరాల), కె.ఆంజనేయులు (ఎస్ఎన్‌పాడు).

అండర్-14 బాలకల జట్టుకు ఎ.మేమలత, ఎ.నందిని, నీలిమ, గురవమ్మ (పాతపాడు), టి.బాల బార్గవి, ఎ.వైశాలి (ఎస్ఎన్‌పాడు), శ్రీలక్ష్మి (గుడ్లూరు), వి.పల్లవి, వర్షిని, అక్షయశ్రీ నాగమహిత, జి.మాధురి (కేవీపల్లి), పి.స్వాతి, ఎన్.వైష్ణవి (గణపవరం), ఎం.అణిత (ఈదర) ఎంపికయ్యారు.

అండర్-17 బాలుర జట్టుకు పి.నవీన్, డి.వినయ్, ఎం.సాగర్‌నాయక్, పి.నరేష్, సీహెచ్ నాగవర్ధన్, ఎస్‌డీ సవనాజ్, ఎం.అక్షయ్‌కుమార్ (పంగులూరు), టి.మనోజ్, ఎస్.రఘుపతి, ఎ.నవనీత్‌కుమార్, నందకిషోర్ (కేవీపల్లి), డి.అభిలాష్ (రుద్రవరం), ఎం.ఆంజనేయులు (సుంకేసుల), బి.రంగస్వామి బి.వెంకటరవీంద్ర (బి.పేట), అనిల్‌కుమార్‌నాయక్, పి.మంత్రానాయక్ (గిద్దలూరు), వి.నారాయణ (ఈదర), గోపీ కృష్ణారెడ్డి(పెదారవీడు) ఎంపికయ్యారు.


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 17 బాలుర జట్టు


ఉమ్మడి ప్రకాశం జిల్లా అండర్ - 17 బాలికల ఖోఖో జట్టు

అండర్ బాలికల జట్టుకు బి.కల్యాణి, కె.వైష్ణవి, ఎం.నాగేశ్వరి, ఎస్.భానుప్రియ, ఎ.నందినిరెడ్డి, ఎసస్వని, ఎల్.లలితేశ్వరి, జి.పావని (కేవీపల్లి), లక్ష్మీప్రసన్న, మానశ్రీ (మొగల్లూరు), డి.హేమశ్రీ (కొల్లపూడి), ఎస్.కృష్ణసరిత, వెంకటరాజిత (గణపవరం), ఎ.పవాంగ్ (పాతపాడు), జి.రవికుమారి (ఈదర), స్నేహతిరుమల (కేజీబీవీ) ఎంపికయ్యారని రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. ఎంపికయిన క్రీడా జట్లను కళాశాల ప్రిన్సిపాల్ ఉషారెడ్డి, ఏడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్ రోటరీ ప్రతినిధులు వీరరాఘవయ్య, రాయిణి సుబ్బారావు, వై.శీనయ్య, పోలినేని కోటేశ్వరరావు, దామోదరరెడ్డి, గురవమ్మ అభినందించారు.

పర్చూరులో ప్రజాదర్బార్

- ఎమ్మెల్యే ఏలూరి సారథ్యంలో రేపటి నుంచి నిర్వహణ
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కార్యక్రమం

పర్చూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి వినూత్న కార్యక్రమానికి స్వీకారం చుట్టాడు. ఈనెల 25న ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించేదుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బుధవారం ప్రకటనలో ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా దర్బార్ కొనసాగనుంది. ఇందులో రెవెన్యూ పంచాయతీ, హౌసింగ్, అగ్రికల్చర్, ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో, గ్రామీణాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ అధికారులతోపాటు, ఆయా శాఖల అధికారుల పాల్గొంటున్నట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

వైసీపీ పాలనలో ప్రజలు ఎదుర్కొన్న అనేక సమస్యలను అక్కడి కక్కడే పరిష్కరించేలా ప్రజాదర్బార్‌ను రూపకల్పన చేశారు. తహసీల్దార్ ఎంపీడీవో, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఇతర శాఖల సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టనున్నారు.

సేవల్లో అందెవేసిన చేతులు

- దాతృత్వ కార్యక్రమాల్లో ముందుంటున్న వాసవీ క్లబ్


అల్పాహారం, పండ్లు, దుప్పట్లను పంపిణీ చేస్తున్న వాసవీ ప్రతినిధులు (ఫైల్)

చీరాల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వాసవీ క్లబ్ చీరాల వారు నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అందరి మన్ననలూ పొందుతున్నాయి. సేవల్లో అది అందివేసి చేయిగా పలువురు కొనియాడుతున్నారు. ఈ ఏడాది కాలంలో నిర్వహించిన బ్లడ్ క్యాం పుల ద్వారా 70 యూనిట్స్ ప్రభుత్వ వైద్యశాలలకు అందజేశారు. ముఖ్యమైన పం డుగలు, మహనీయుల జయంతి, వర్ధంతుల సందర్భంగా, రిపబ్లిక్ డే, స్వాతంత్ర్యదినోత్సవం తదితర ప్రత్యేక రోజుల్లో క్లబ్ ద్వారా వారు నిర్వహించే కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా ఉంటాయి. దీంతో క్లబ్ సభ్యులతో పాటు ఇతరులు కూడా వారి సేవా కార్యక్రమాలకు చేయూత నందిస్తున్నారు.

కుట్టు మిషన్‌తో జీవనోపాధి



పేదరికంలో ఉన్న నాకు వాసవీ క్లబ్ వారు కుట్టుమిషన్‌ను అందజేశారు. అది నాకెంతగానో ఉపయోగ పడుతోంది. నాకు జీవనోపాధికి మార్గమైంది. వాసవీ ప్రతినిధులకు కృతజ్ఞతలు. అందరూ ఆలోచిస్తే ఎంతోమంది పేదలకు మేలు జరుగుతుంది. - ఎం.ఉషాబాల

తోటివారికి సాయపడటమే దైవత్వం



తోటివారికి సాయపడడమే దైవత్వమని మేము మనస్ఫూర్తిగా విశ్వసిస్తాం. పది మందికి సాయం అందించే భాగ్యం కల్గడం అదృష్టంగా భావిస్తున్నాం. మా సేవలన్నీ పారదర్శకంగా ఉంటాయి. మమ్మల్ని ప్రోత్సహించిన అందరికీ కృతజ్ఞతలు.

- వల్లంపట్ల వెంకటేశ్వరరావు, ప్రెసిడెంట్, వాసవీ క్లబ్, చీరాల

ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీ!

(5వ పేజీ తరువాయి)

అవుతున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు

ఉమ్మడి జిల్లాలో దాదాపు 35కుపైగా ఎయిడెడ్, ప్రైవేటు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కళాశాలల్లో బీఎస్సీ, బీకాం, బీఏ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు దాదాపు 24 వేల మంది ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలల్లో మాదిరిగానే డిగ్రీ కళాశాలల్లోనూ ఫీజుల్ని నిర్దేశించారు. సాధారణ కోర్సులకు రూ. 10 వేల నుంచి రూ. 15 వేలు, బీఎస్సీ కంప్యూటర్, ఇతర కోర్సులకు రూ. 18 వేల వరకు ఫీజులు నిర్దేశించారు. ఇంతకు మించి అదనంగా ఫీజులు వసూలు చేయకూడదని ఉన్నా, యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన కౌన్సెలింగ్ ఫీజు కంటే దాదాపు డబుల్ ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే.. వేధింపులు

గుంటూరు నగరం నడిబొడ్డున్న ఉండి సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పుకునే కళాశాలల్లో ఇటీవల భారీ మొత్తంలో అదనంగా ఫీజులు వసూలు చేశారు. ఒక్కో విద్యార్థి నుంచి సగటున రూ.20 వేలకుపైగా ఫీజులు వసూలు చేశారు. దీనికి ల్యాబ్, ఎగ్జామినేషన్ ఫీజులు అదనంగా ఉన్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై ఇప్పటికే రెండుసార్లు ఆర్‌జేడీ కార్యాలయంలో, మరో రెండు సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. అయినా యాజమాన్యంలో మార్పురాలేదు సరికదా ఫిర్యాదు చేసిన విద్యార్థులపై వేధింపులకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- నగరంలో మహిళల కోసం ఉన్న ఒక అన్‌ఎయిడెడ్ కళాశాలలో కూడా ఇష్టారాజ్యంగా ఫీజులు దందా నడుస్తోంది. ఇక్కడ కనీస సౌకర్యాలు లేకున్నా ఫీజులు మాత్రం భారీగానే ఉంటున్నాయి. యాజమాన్యాలు చెప్పిందే ఫీజు అంటూ వసూళ్ల పర్వం సాగుతోంది. దీనికి అరకొర వసతులతో హాస్టల్ నిర్వహిస్తూ ఫీజులు దండుకుంటున్నారు. ఇక్కడ కళాశాలకు గ్రౌండ్, ఇతర మౌలిక వసతులు లేకున్నా భారీ సంఖ్యలో అడ్మిషన్లకు అనుమతి ఇవ్వడం విస్మయానికి గురిచేస్తోంది. ఫీజుల భారం, కళాశాల యాజమాన్యం వేధింపులతో ఓ విద్యార్థిని మూడోఫ్లోర్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయి.
- బ్రాడీపేట ప్రాంతాల్లో ఉన్న మూడు అన్ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో ఫీజుల దోపిడీ ఇష్టారాజ్యంగా సాగుతోంది. ఓ కళాశాల కరస్పాండెంట్ ఒకే ప్రాంగణంలో ఇంటర్, డిగ్రీ కళాశాలలు, హాస్టల్ నిర్వహిస్తున్నారు. వేసవి కాలంలో ఇదే ప్రాంగణంలో పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.
- తెనాలి, నరసరావుపేట, మాచర్ల ప్రాంతాల్లోని ప్రైవేటు డిగ్రీ కళాశాలల్ని గత ఐదేళ్లలో ఏనాడు ఉన్నత విద్యాశాఖ అధికారులు తనిఖీ చేసిన సంఘటనలు లేవు. పల్నాడులో ఎక్కడ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి అనే విషయం కూడా ఆర్‌జేడీ కార్యాలయం అధికారులకు తెలియని పరిస్థితి.

ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు

జిల్లాలో ఉన్న మూడు ప్రభుత్వ కళాశాలల్లోనూ అదనపు ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థులు చెల్లించే ఎగ్జామినేషన్ ఫీజుతోపాటు, సర్టిఫికెట్లు జారీ సమయంలో అదనంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. కళాశాల అభివృద్ధి పేరుతో కొన్ని చోట్ల అదనపు దోపిడీ సాగుతోంది.

పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణం విద్యుత్ ప్రమాదాలకు కోరలు చాపి ఉంది. వివిధ రకాల కమర్షియల్స్, నివాసాలు అధికంగా ఉండడంతో విద్యుత్ సర్వీసులు అధికంగానే ఉన్నాయి. అయితే బిల్డింగ్‌ల మధ్య సర్వీసులకు సంబధించిన విద్యుత్ సర్వీసులు, ప్రధాన విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏదయినా మరమ్మతులు, నిర్మాణాలు చేపట్టే క్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం ఈ తరహా సంఘటన చోటుచేసుకుంది. పట్టణంలోని మసీదు పక్క బిల్డింగ్‌ను యజమాని మరమ్మతులు చేపట్టారు. అక్కడే తీగలు ప్రమాదంగా ఉండడంతో నియంత్రించేందుకు తాపీ మేస్త్రీ ప్లాస్టిక్ కవర్‌లతో కవర్ చేసే ప్రయత్నం చేశారు. కానీ ఇది కూడా ప్రమాదమే అని అవగాహన అతనికి లేదు.

ఇటీవలే చీరాల పరిధిలో విద్యుత్ ప్రమాదంతో ఇరువురు యువకులు మృతి చెందిన ఉదంతం అందరికీ విదితమే. ఈ క్రమంలో ఇప్పటికైనా అధికారులు వీటిపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


ఫోన్ మాట్లాడుతూ రికార్డులు పరిశీలిస్తున్న డా.వరుణ్ విజయ్ గైకీ

ఇదేమి విజిటింగ్ సారూ

- చీరాల ఏరియా హాస్పిటల్‌ను తనిఖీ చేసిన సెంట్రల్ ఆరోగ్య కేంద్రం ప్రతినిధి
- ఫోన్‌లో మాట్లాడుతూనే రికార్డుల పరిశీలన
- మీడియాకు వెల్లడించని వివరాలు
- ఎందుకొచ్చారంటూ నవ్వుకున్న జనం

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ ఆరోగ్య కేంద్రం, కుటుంబ సంక్షేమ ప్రాంతీయ కార్యాలయ నిపుణుడు డా.వరుణ్ విజయ్ గైకీ హైదరాబాద్ నుంచి బుధవారం చీరాల ఏరియా హాస్పిటల్లో విజిటింగ్ నిర్వహించారు. అయితే వచ్చినప్పటి నుంచి ఆసుపత్రి ఓపీ, వార్డులు, రక్త నిల్వలు తదితర రికార్డులను ఆయన పరిశీలించారు. కానీ వీటిల్లో అర్ధభాగం ఫోన్‌లో మాట్లాడుతూనే పూర్తి చేశారు. మిగిలిన సగభాగం హాస్పిటల్ మొత్తం తిరగడానికే సరిపోయింది. ఎట్టకేలకు అధికారి వచ్చారు. విజిటింగ్ ముగిసిందన్న అనుభవం మాత్రమే హాస్పిటల్ సిబ్బందికి మిగిలింది. హాస్పిటల్ సమస్యలను రాత పూర్వకంగా హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.సుభాషిణి అందజేశారు. అసలు ఏమి పరిశీలన చేశారో అని అడిగిన మీడియా వారికి కూడా కనీసం ఏ సమాధానం చెప్పకుండా కారులో వెళ్లిపోయారు. ఉన్న సమస్యలు, ఏం అవసరాలు ఉన్నాయో రేపు ఈయనేమి నివేదిక ఇస్తారో ఎవ్వరికీ అర్థం కాలేదు. అసలు ఇదేమి తనిఖీ అని, అసలాయన ఎందుకు వచ్చారని జ.నం నవ్వుకున్నారు.

వెలుగులోకి అనేక అక్రమాలు

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పంచాయతీ కార్యాలయ పరిధిలోని గ్రేడ్-5, 6 (సచివాలయ ఉద్యోగుల) బదిలీల్లో అనేక అక్రమాలు చోటుచేసు కున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలకు, కలెక్టర్ ఇచ్చిన ప్రొసిడింగ్స్‌కు విరుద్ధంగా జిల్లా పంచాయతీ పూర్వ అధికారి ఉషారాణి తన ఇష్టారీతిన బదిలీలు చేసినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇందులో పంచాయతీ కార్యాలయ ఉద్యోగులను బలిపశువులను చేసి ఆమె ఇష్టారీతిన బదిలీల ప్రక్రియ చేపట్టినట్లు తేలింది. ఉద్యోగుల బదిలీల ఉత్తర్వులపై భారీ అవినీతి, అక్రమాలు జరగడంతో కలెక్టర్ తమీమ్ అన్సారియా సమగ్ర విచారణకు త్రిసభ్య కమిటీని నియమించారు. ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ లోకేశ్వరరావు చైర్మన్‌గా, జడ్పీ సీఈవో చిరంజీవి, జిల్లా ఆడిట్ అధికారి శంకర్ నారాయణరెడ్డిలను సభ్యులుగా నియమించారు. రెండురోజుల పాటు నిర్వహించిన విచారణలో అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. జిల్లాలోని అధికారపార్టీ ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులను కూడా బుట్టదాఖలు చేసిన పరిస్థితిని గుర్తించినట్లు సమాచారం.

ఒకరికి రెండు చోట్ల ఆర్డర్లు

ఒక ఉద్యోగికి ఒకచోట మాత్రమే బదిలీ పోస్టింగ్ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉండగా అందుకు భిన్నంగా రెండు ఆర్డర్లు ఇచ్చారంటే అవినీతి ఏస్థాయిలో చోటుచేసుకుందో అర్థమవుతుంది. గ్రేడ్-5లో ఆరుగురికి, గ్రేడ్-6లో 39 మంది ఉద్యోగులకు రెండు బదిలీల ఆర్డర్లు ఇవ్వగా ఒక ఉద్యోగికి ఏకంగా మూడు చోట్లకు ఇచ్చిన విషయం త్రిసభ్య కమిటీ విచారణలో తేలినట్లు తెలుస్తోంది. ప్రజాప్రతినిధుల సిఫార్సులకు విరుద్ధంగా పోస్టింగ్‌లు ఇవ్వడమే కాకుండా, 53 మంది గ్రేడ్-5 ఉద్యోగులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు భిన్నంగా గ్రేడ్-4లో నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు విచారణాధికారులు గుర్తించినట్లు సమాచారం. కాగా బదిలీల్లో జరిగిన అక్రమాల నేపథ్యంలో ఈనెల 8న సంబంధిత జూనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేసిన తర్వాత ఉషారాణి బదిలీల ఉత్తర్వులపై సంతకాలు చేసి అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని పావుగా వాడుకున్నట్లు సమాచారం. ఆ ఉద్యోగిని పురమాయించి 'నీకు నేను ఉన్నాను. ఎటువంటి భయం లేదని' చెప్పి అతని ద్వారా డబ్బులు వసూలు చేసినట్లు బయటపడింది.

సీసీ ఫుటేజీ స్వాధీనం

కలెక్టరేట్‌లోని ప్రధాన ద్వారం నుంచి జిల్లా పంచాయతీ కార్యాలయానికి వెళ్లే దారిలో ఉన్న సీసీఫుటేజి ద్వారా ఉషారాణి ఉంటున్న కార్యాలయంలోకి ఏఉద్యోగి వెళ్లి వస్తుంది కూడా గుర్తించారు. ఆ ఫుటేజీను కూడా సీజ్ చేసి విచారణ నివేదికలో పొందుపర్చడమే కాకుండా కలెక్టర్‌కు నివేదించనున్నట్లు సమాచారం. జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే రెగ్యులర్ ఉద్యోగులనే కాకుండా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ వారిని కూడా ఇందులో ఇరికించినట్లు గుర్తించినట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు ఉద్యోగులు సస్పెండ్ అయ్యారు. రెండు రోజులపాటు జరిగిన విచారణలో ఉషారాణి విచారణాధికారులు అడిగిన ఏ ప్రశ్నకూ సమాధానం చెప్పకుండా తనకు వారు తెలుసు, వీరు తెలుసంటూ దాటవేసినట్లు సమాచారం. అలా చెప్పడమే కాకుండా ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు తనకు అపాయింట్‌మెంట్ ఉందని, అక్కడ అంతా చెప్తానంటూ విచారణాధికారులను భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం.

అంతా ఆమె ఇష్టారాజ్యం

త్రిసభ్య కమిటీ చేసిన రెండు రోజుల విచారణలో తాను ఎలాంటి తప్పులూ చేయలేదని, బయట జరిగే పరిణామాలతో తనకేమీ సంబంధం అని పూర్వపు డీపీవో ప్రశ్నించడమే కాకుండా ఇష్టారీతిన మాట్లాడినట్లు తెలిసింది. మరోవైపు ఫోన్‌పే, గూగుల్‌పే, పేటీఎం ద్వారా నగదు లావాదేవీలు తీసుకున్న ఉద్యోగులు పూర్వ డీపీవో ఉషారాణి ఎదుట తాము తాము ఎంత ఇచ్చామో విచారణాధికారులకు చెప్తుంటే ఆమె వారిని కూడా భయపెట్టే ప్రయత్నం చేసినట్లు సమాచారం.


జ్యోతి చంద్రమౌళిని సన్మానిస్తున్న విజయవాడ ఆకాశవాణి అధికారులు

జ్యోతి చంద్రమౌళికి సన్మానం

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : చారిత్రక పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి బుధవారం విజయవాడలోని ఆకాశవాణిలో సన్మానించారు. ఆంధ్ర రాష్ట్రంలో చారిత్రక కట్టడాలు అనే అంశంపై ఆకాశవాణిలో జరిగిన రికార్డింగ్‌కు చంద్రమౌళి హాజరయ్యారు. ఆకాశవాణి ఏర్పాటు చేసి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న ఉత్సవాలలో భాగంగా చంద్రమౌళిని ఆకాశవాణి అధికారులు సన్మానించారు.

రీ-సర్వే సమస్యల పరిష్కారానికి గ్రామసభ

తహసీల్దార్ పార్వతి


తహసీల్దార్ పార్వతి

వేటపాలెం(చీరాల), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని పందిళ్లపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించే గ్రామ సభలో రీ-సర్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరించుకోవాలని బుధవారం తహసీల్దార్ పార్వతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ సభ జరుగుతుందన్నారు. గత రీ సర్వే అనంతరం భూ సమస్యలు ఉంటే రైతులు దరఖాస్తులు అందజేయాలన్నారు. కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పార్వతి కోరారు.

పల్లాకు తెగులు సోకితే మొక్కను పీకేయాలి

అద్దంకిటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : మినుములో పల్లాకు తెగులు సోకిన మొక్కలను ముందుగానే గుర్తించి వాటిని ప్రాథమిక దశలోనే పీకేయాలని వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని రామాయపాలెం తిమ్మయపాలెం గ్రామాలల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుమును పరిశీలించిన ఏవో రైతులతో మాట్లాడారు. తెగులు సోకిన మొక్కలు పసుపు రంగులోకి మారి ఎండిపోతాయన్నారు. రసం పీల్చే పురుగువల్ల ఇలా జరుగుతుందన్నారు. థయోమిథాక్సం మందును పిచికారీ చేయాలని ఏవో రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగం రామాంజనేయరెడ్డి, హనుమంతరావు, రాజశేఖర్‌రెడ్డి, ఏఈవో కోటేశ్వరరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు ఖాజాబి పాల్గొన్నారు.

మినుము మునిగింది

- కోత దశలో కురిసిన వర్షాలు
- అపారనష్టమని రైతుల ఆవేదన


చినమల్లవరంలో మినుము పైరును మేస్తున్న గొర్రెలు

పంగులూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : పంగులూరు మండలంలో అధిక వర్షాలతో కోత దశలో ఉన్న మినుము మునిగిపోయింది. దీంతో అపార నష్టం వాటిల్లింది. మండలంలో 3,486 ఎకరాలలో మినుమును సాగు చేయగా, కోత దశకు చేరుకున్న సుమారు రెండు వేల ఎకరాలలో చేతి కొచ్చిన పంట నీటిపాలయింది. అల్పపీడనం కారణంగా కురిసిన వర్షాలకు కోతకొచ్చిన కాయ పంటచేలో మొలకలు రావడంతో పూర్తి నష్టం వాటిల్లిందని రైతులు వాపోతున్నారు. మండలంలోని కొండమూరులో 11 వందల ఎకరాలలో మినుము సాగు చేయగా, రేణంగివరంలో 364, అలవలపాడులో 302, ముప్పవరంలో 239, కొండమంజులూరులో 155, బైటమంజులూరులో 196, కొప్పెరపాడులో 170, కశ్యాపురంలో 111, కొప్పెరపాడులో 170, తక్కెళ్లపాడు, బూదవాడ, మల్లవరం గ్రామాలలో వందల ఎకరాలలో మినుము సాగు చేపట్టారు. పురుగు, తెగుళ్ల కారణంగా అధికంగా మందులు వాడి వ్యయ ప్రయాసలతో పంటను కాపాడుకున్నప్పటికీ అధిక వర్షంతో అంతా నీటిపాలయిందని రైతులు వేదన చెందుతున్నారు.

నష్ట పరిహారం కోసం ఎన్యూమరేషన్ చేపట్టాం

మినుము పంట నష్టం అంచనా కోసం బుధవారం నుంచి ఎన్యూమరేషన్ చేపట్టామని వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి తెలిపారు. 33శాతం పైగా పంట నష్టం జరిగిన రైతుకు ప్రభుత్వ సాయం అందుతుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు. 1900 ఎకరాలకు పైగా పంట నష్టం జరిగిందని ప్రాథమిక నివేదిక అధికారులకు పంపడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు సేవా కేంద్ర సిబ్బంది, వీఆర్వోలు పంట నష్టం అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించాలి
- ఎంపీడీవో స్వరూపారాణి
- పలు అంశాలపై సర్వసభ్య సమావేశంలో చర్చ


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పంగులూరు, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వాటిని అరికట్టేందుకు గ్రామాలలో వైద్య శిబిరాలను నిర్వహించి ప్రజలకు సత్వర వైద్య సేవలందించాలని ఎం పీడీవో కె.స్వరూపారాణి సూచించారు. పంగులూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ తేళ్ల నాగమ్మ అధ్యక్షతన జరిగింది. తహసీల్దార్ పోపూరి సింగారావు మాట్లాడుతూ భూములు రీ-సర్వే జరిగిన గ్రామాలలో సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. రైతులు సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. బైపరికేషన్ కారణంగా ఖాళీ అయిన రేషన్ షాపుల భర్తీకి ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. నీటి వినియోగదారుల సంఘం ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రాథమిక చర్యలు చేపట్టామని, గ్రామాలలో వైద్య శిబిరాలు నిర్వహిస్తామని వైద్యాధికారి డాక్టర్ రాజేశ్వరి తెలిపారు. అధిక వర్షాలకు మినుము పంటకు అపార నష్టం వాటిల్లిందని ఏవో డి.సుబ్బారెడ్డి తెలిపారు. 2వేల ఎకరాలలో మినుము పంటకు నష్టం జరిగినట్లు అంచనా నివేదిక అధికారులకు అందచేశామన్నారు. 33 శాతం పైగా పంట నష్టం వాటిల్లిన రైతులకు నష్ట పరిహారం అందేలా గ్రామాలలో ఎన్యుమరేషన్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఉపాధి నిధులతో సీసీ రోడ్లను నిర్మిస్తున్నట్లు ఏఈ హనుమంతరావు చెప్పారు. మండలంలో 26 గోకులాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం సంతోషం తెలిపారు. విద్యాశాఖపై ఎంఈవో వీరాంజనేయులు, పారిశుధ్యం, తాగు నీరుపై ఈవోఆర్డీ కే సుమంత్ చర్యలను వివరించారు. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు రాయిణి ప్రమీల, ఉపాధ్యక్షులు ఎర్రం శ్రీనివాసరెడ్డి, పశు వైద్యాధికారి మురళీకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు శివయ్య, కిషోర్‌కుమార్, ఆంజనేయులు, ఐసీడీఎస్ అధికారి జయప్రద, ఏఎస్‌డబ్ల్యూవో ప్రతినిధి సుబ్బారావు, ఫారెస్ట్ బీటీ రమేష్, సాల్మన్, సర్పంచ్‌లు గుడిపూడి నాగేంద్రం, వీరయ్య, పెంట్యాల కిష్టారావు, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు స్రవంతి, అప్పలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

29న మెగా జాబ్ మెళా

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ నెల 29వ తేదీన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి ఆధ్వర్యంలో మెగా జాబ్ మెళా నిర్వహించనున్నారు. 25కు పైగా కంపెనీలు హాజరయ్యే జాబ్ మెళాలో సుమారు వెయ్యి మందిని ఎంపిక చేయనున్నారు. పదవ తరగతి నుంచి పీజీ, బీటెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత జాబ్ మెళా వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రవీంద్ర కోరారు. అద్దంకి పట్టణంలోని నాగులపాడు రోడ్డులో గల కామేపల్లి కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఆర్‌అండ్‌బీ బంగ్లాలో జరగాల్సిన జాబ్ మెళాను కామేపల్లి కల్యాణ మండపానికి మార్పు చేసినట్లు తెలిపారు.

ఆక్రమణలన్నీ తొలగించాల్సిందే


మేదరమెట్ల బస్టాండ్ ముందు అక్రమణదారులతో మాట్లాడుతున్న డీఎం రాంమోహనరావు

మేదరమెట్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్‌కు అన్ని వైపులా ఉన్న ఆక్రమణలను కచ్చితంగా తొలగించాలని డీఎం రాంమోహనరావు అక్రమణదారులను హెచ్చరించారు. బుధవారం రాత్రి మేదరమెట్ల బస్టాండ్‌కు వచ్చిన ఆయన అధికారులతో కలిసి అక్రమణదారులతో మాట్లాడారు. బస్టాండ్‌కు పడమర వైపు, ఉత్తరం వైపు ఉన్న ఆక్రమణలు అన్ని తొలగించాల్సిందే అన్నారు. ఉత్తరం వైపు, పడమర వైపు షాపులకు అద్దెలకు ఇస్తామని, దరకాస్తులు అద్దంకి డిపోలో అందుబాటులో ఉన్నాయని, అవసరమైనవారు దరకాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివిధ రకాల షాపులను ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రత్నం, వలి, ఆర్టీసీ సిబ్బంది ఉన్నారు.

ప్రజా సమస్యలకు వేగవంతంగా పరిష్కారం

వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు


ఎస్సై కమలాకర్‌ను అభినందిస్తున్న సీఐ శ్రీనివాసరావు

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని ప్రజల సమస్యలు వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మారీడు శ్రీనివాసరావు అన్నారు. పట్టణ పరిధిలో ప్రజానీకం అధికంగా ఉండడంతో స్టేషన్‌కు నిర్ణీత అధికారులు అవసరముందన్నారు. సీఐ వినతి మేరకు బుధవారం ఎస్‌ఐలు కమలాకర్, భాస్కరరావును ఎస్పీ తుషార్ డూడి నియమించారు. దీంతో వారు రిపోర్ట్ చేశారు. వారికి స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎస్సై కమలాకర్ వేటపాలెంలో సుమారు రెండేళ్లు విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా సీఐ వారికి సూచనలు చేశారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

అద్దంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీచరణ్ అన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాలలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన గ్రామ రెవెన్యూ సభను బుధవారం మండలంలోని చక్రాయపాలెం సచివాలయం వద్ద నిర్వహించారు. నరసింహాపురం రెవెన్యూ పరిధిలోని భూ సమస్యలపై 20 మంది అర్జీలను అందజేశారు. ఈ సదస్సులో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, ఆర్ఐ శంకర్, సర్వేయర్ శ్రీలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీచరణ్


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

యోగాలో చందలూరు విద్యార్థుల ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పంగులూరు, అక్టోబరు, 23 (ఆంధ్రజ్యోతి) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన యోగా పోటీలలో చందలూరు ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ నెల 22వ తేదీన ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో ప్రతిభ చాటిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14 క్యాటగిరీలో నాయపాము శృతి (ప్రథమ స్థానం), కె.సరిత (2వ) ఎన్. భవ్య (మూడవ స్థానం) కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. బాలుర విభాగంలో ఎం.వెంకటేష్ ఎంపికయ్యాడు. అండర్ 17 క్యాటగిరీలో ఎస్.ప్రీతి రిథమిక్ యోగా పోటీకి ఎంపికైంది. అండర్ 17 లో స్టాండ్ బైలో ఎ.లిఖిత, ఎం.రత్నకుమారి ఎంపికయ్యారు. వీరంతా నవంబరు 2, 3 తేదీలలో నెల్లూరులో జరుగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని పాఠశాల పీడీ కొండా ప్రతిమ తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన పీడీ ప్రతిమను హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందనలు తెలిపారు.

విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం


రైతులతో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఈఈ మస్తాన్‌రావు


బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రైతులు, గృహాల విద్యుత్ వినియుగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తామని అశాఖ అద్దంకి డీవిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు తెలిపారు. వైదనలో బుధవారం రైతులతో విద్యుత్ అధికారులు సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా రైతులతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామని ఎక్కడైనా రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు అవసరమైతే దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తామన్నారు. సమావేశంలో ఏడీఈఈ సురేంద్రబాబు, ఎఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

బల్లికురవ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అన్ని గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఈ అవకాశాన్ని వినియెగించుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో కుమారి కోరారు. బుధవారం మండలంలోని గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో పోలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఏవో వరి పంటను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోఏఈవో వంశి, వ్యవసాయ సహాయకులు రాణి, శ్రావణి, మార్కెటింగ్ సిబ్బంది సురేష్, సర్పంచ్ ముంద్రు దానయ్య పాల్గొన్నారు.

ఆయుర్వేదంతో ఆనంద జీవితం

చీరాలటౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదం వినియోగం వలన ఆనందంగా జీవిస్తారని స్థానిక స్వర్ణ రోడ్డులోని శతాయుష్ ఇంటర్నేషనల్ ఆయుర్వేదిక్ హాస్పిటల్స్ సిబ్బంది తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఔషధం వలన మేధాశక్తి పెరుగుతుందని వివరించారు. దీనిని పుష్య నక్షత్రం రోజున మాత్రమే వినియోగిస్తారని చెప్పారు. శ్వాసకోశ సమస్యలు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



'సోమశిల'కు 16,452 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

అనంతసాగరం, ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి 16,452 క్యూసెక్కుల వరద వస్తోంది. డ్యాంలో 60.736 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 50, కండలేరుకు 10,000, ఉత్తరకాలువకు 300 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక ఉదయగిరి మండలంలోని గండిపాళెం జలాశయం నీటిమట్టం 12 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి తెలిపారు. జలాశయం సామర్థ్యం 35 అడుగులు కాగా ఇటీవల కురిసిన వర్షాలకు భారీగా వరద వచ్చి చేరినట్లు ఆయన తెలిపారు.



భగత్‌సింగ్‌కాలనీ సమీపంలోని పెన్నానదిలో ఇసుక తవ్వకాలకు దిగిన వందలాది ట్రాక్టర్లు



అరె.. టైరు దిగబడిపోయింది.. నెట్టు!

పెన్నాలో రయ్.. రయ్!

● ఉచిత ఇసుక నిర్ణయంతో సందడిగా తీరం ● భారీగా తగ్గిన ట్రాక్టర్ ఇసుక ధర

మొన్నటిదాకా నిర్మానుష్యంగా ఉన్న పెన్నాతీరం ట్రాక్టర్లు, ఎండ్లబండ్ల రాకపోకలతో సందడిగా మారిపోయింది. వెంకటేశ్వరపురం సమీపంలోని భగత్‌సింగ్‌కాలనీ, పాత మున్సిపల్ కార్యాలయం, దీనదయాల్‌నగర్, బొడిగాడితోట ప్రాంతాల్లో ఇసుక కోసం ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు క్యూ కట్టాయి. తమ సొంత ట్రాక్టర్లతో కూలీలను పెట్టుకొని ఎక్కడైనా ఇసుక తవ్వకాలు చేసుకోవచ్చని ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశాలతోపాటు రాష్ట్ర మంత్రి నారాయణ సైతం దృష్టి పెట్టడంతో నగరవాసులకు ఇసుక సమస్యకు పరిష్కారం ఏర్పడినట్టు అయ్యింది. బుధవారం భగత్‌సింగ్‌కాలనీ రీచ్‌లోకి ట్రాక్టర్లు, ఎడ్లబండ్లు భారీగా తరలివచ్చాయి. మొన్నటిదాకా ట్రాక్టర్ ఇసుక రూ.5వేల నుంచి 6వేల వరకు విక్రయించారు. ఒక్కసారిగా ట్రాక్టర్లకు అనుమతి ఇవ్వడంతో ధరలు పడిపోయాయి. ప్రస్తుతం ట్రాక్టర్ ఇసుక రూ.1600 నుంచి దూరాన్ని బట్టి రూ.3వేల వరకు తీసుకొంటున్నారు. నగరంలోని మిగతా రీచ్‌లలోనూ ఇదేవిధంగా ఇసుక తరలింపు ప్రారంభమైతే ధరలు మరింత దిగి వచ్చే అవకాశం ఉంటుంది.

- నెల్లూరు (వెంకటేశ్వరపురం, ఆంధ్రజ్యోతి)

పరిహారం రెండింతలు

● వన్యప్రాణుల దాడిలో చనిపోతే రూ.10లక్షలు
● పంటల నష్టానికి రెండింతల చేసిన ప్రభుత్వం

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణుల దాడిలో ప్రాణ, ఆస్తి నష్టానికి అందించే పరిహారం రెట్టింపు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ అడవి జంతువుల కారణంగా మనుషుల ప్రాణనష్టం జరిగితే రూ.5లక్షలు ఇస్తుండగా దానిని 10 లక్షలకు పెంచారు. తీవ్ర స్వల్పగాయాల బారిన పడిన వారికీ రెట్టింపు పరిహారం ఇవ్వనున్నారు. అలాగే, పశుసంవర్ధక శాఖ అంచనాలను బట్టి పశునష్టానికి పరిహారం ఇవ్వనున్నారు. వరితోపాటు అన్ని రకాల పప్పుదినుసులు, పండ్లతోటలకూ పరిహారం పెంచారు.

పరిహారం పెంపు ఇలా (రూ.లలో)

విభాగం	ప్రస్తుతం	పెంపు
మనిషి చనిపోతే	5 లక్షలు	10 లక్షలు
తీవ్ర గాయాలు	75 వేలు	2 లక్షలు
స్వల్ప గాయలు	ఉచిత చికిత్స	ఉచిత చికిత్స/రూ.20వేలు
పశువులు చనిపోతే	మార్కెట్ ధర	పశుసంవర్ధక శాఖ అంచనా
వరి (ఎకరాకు)	6 వేలు	10 వేలు
చెరకు	6 వేలు	12 వేలు
పప్పుదినుసులు	6 వేలు	10 వేలు
మామిడి, టెంకాయ (చెట్టుకు)	1500	2వేలు
పండ్లతోటలు (ఎకరాకు)	7500	12వేలు

కంగ్రాట్స్ సార్!



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్‌గా జనసేన పార్టీ మీడియా అధి కార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ అమరావతిలో బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి నారాయణ కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ తన గురువు నారాయణ వద్ద చదువుకున్న తాను ఆయన శాఖలోనే పని చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. అలాగే జనసేన నాయకులు నూనె మల్లికార్జున యాదవ్, గునుకుల కిశోర్, సుజయ్, కారంపూడి కృష్ణారెడ్డి గుర్రం కిషోర్, మంచికంటి శ్యామ్ తదితరులు అజయ్‌కుమార్‌ను సత్కరించారు.

INTERVIEW



నెల్లూరు బాగుందని అందరూ అనాలి

'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ

నెల్లూరువాసులు ఎక్కడున్నా మా సిటీ బాగుందన్న మాట ప్రతీనోటా రావాలన్నదే నా ప్రణాళిక. అందుకు అనుగుణంగా ప్రజలకు సకల సౌకర్యాలు కల్పించేందుకు రూపకల్పన జరుగుతోంది.' అని నగర పాలక సంస్థ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. పారిశుధ్యం మెరుగుపరచడంతోపాటు పచ్చదనం పెంపునకు చర్యలు తీసుకుంటున్నాము. అయితే, మేం ఎంత చేసినా నగరవాసుల్లో చైతన్యం వస్తేనే అనుకున్నది సాధ్యమవుతుంది.' అని కమిషనర్ అన్నారు. ఇంకా ఆయన ఏమన్నారంటే ఆయన మాటల్లోనే..

6



నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్'

● మహిళల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం

మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ఇందులోభాగంగా కేంద్ర ప్రభుత్వ కార్యక్రమమైన ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ)ను రాష్ట్రంలో ఉద్యమంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. జిల్లాలో అమలుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ సిద్ధం చేయగా, నిరక్షరాస్యులైన 19,178 మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. వచ్చేఏడాది, మార్చి 31వతేదీ నాటికి ఈ లక్ష్యాన్ని చేరుకునేలా అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

6

ఎల్లలు దాటుతున్న తెల్లరాయి

విచ్చలవిడిగా అక్రమ రవాణా

- వివరాలు 8లో..



బుచ్చి మండలం సాల్మాన్‌పురం సమీపంలో పూడిక, గుర్రపు డెక్కతో నిండిపోయిన పంటకాలువ

ఎందుకింత నిర్లక్ష్యం?

నెల్లూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న సామెతలా మారింది. జిల్లాలోని రైతాంగం పరిస్థితి. గడిచిన మూడు సీజన్లుగా పూడిక తీయక రూపుకోల్పోయిన కాలువలను బాగు చేసేందుకు కూటమి ప్రభుత్వం అత్యవసర పనుల కింద నిధులు మంజూరు చేసినా ఇరిగేషన్ అధికారుల్లో మాత్రం కనిపిస్తోంది. మరో వారం రోజుల్లో రబీ (లేట్ ఖరీఫ్) సీజన్ ప్రారంభం కానుంది. నార్లు పోసుకునేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. కానీ ఇంతవరకూ పంట కాలువల్లో పూడికతీత, గుర్రపు డెక్క తొలగించలేదు. ఈ పనులకు కనీసం ఇప్పటికి టెండర్లు కూడా పిలవలేదు. ఇంకా ఎస్టిమేషన్లు తయారీలోనే ఇరిగేషన్ ఏఈలు ఉన్నారు. వీరి నుంచి ఎస్టిమేషన్లు తెప్పించుకొని టెండర్ల ప్రక్రియను వేగవంతం చేయడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారు.

● ఎస్టిమేషన్ల తయారీలో జాప్యం

రబీ ప్రారంభంలోపు ఈ పనులు పూర్తి చేసేందుకు వీలుగా ఎమ్మెల్యేలు ఎస్టిమేషన్లు తయారు చేయించారు. వాటిని ప్రభుత్వానికి పంపారు. అయితే అక్కడ ఫైనాన్స్ అప్రూవల్ రావడంలో చాలా ఆలస్యమైంది. రెండు నెలల తర్వాత ఈ నెల 10వ తేదీన ఈ పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఓఅండ్‌ఎం పనులకు ఆ హెడ్‌లో నిధులు లేకపోవడంతో రైతుల ప్రయోజనాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నిర్వహణ ఫండ్ నుంచి ఓ అండ్‌ఎం పనులకు అప్రూవల్స్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా రూ.283 కోట్లకు అనుమతులు ఇవ్వగా జిల్లాకు రూ.46 కోట్లు కేటాయించారు. అందులో రెగ్యులర్ సర్కిల్‌కు రూ.28 కోట్లు కేటాయించగా, సోమశిలకు రూ.14 కోట్లు, తెలుగుగంగ ప్రాజెక్టుకు రూ.4 కోట్లు చొప్పున నిధులు మంజూరు చేశారు. సోమశిల, తెలుగుగంగ ప్రాజెక్టులు కాబట్టి రెగ్యులర్ సర్కిల్ కిందనే కాలువల నిర్వహణ ఎక్కువగా చేయాల్సి

- మిగతా 6లో..

ఓఅండ్‌ఎం పనులకు టెండర్లు పిలవడంలో జాప్యం

ప్రభుత్వం జీవో ఇచ్చి పది రోజులైనా కదలని ఇరిగేషన్

ఇంకా కొన్ని సెక్షన్ల నుంచి అందని ఎస్టిమేషన్లు

అసలే ఆలస్యం అనుకుంటే.. ఇప్పుడు ఇంకా సాగదీత

సీజన్ సమీపిస్తుండటంతో రైతాంగంలో ఆందోళన

మంజూరైన పనుల వివరాలు (రూ.లక్షల్లో)

నియోజకవర్గం	పనులు	మొత్తం
ఆత్మకూరు	25	177.87
గూడూరు	3	9.8
కావలి	74	483.25
కోవూరు	97	540.62
నెల్లూరు రూరల్	80	606.38
సూళ్లూరుపేట	9	21.4
సర్వేపల్లి	134	873.95
ఉదయగిరి	8	35.93
వెంకటగిరి	6	50.05
మొత్తం	436	2799.25

అనంతసాగరం తహసీల్దారుపై వేటు!

పొదలకూరులో విచ్చలవిడిగా అక్రమాలు

వైసీపీ పెద్దల ఆదేశాలతో భూ పందేరం

ప్రజలు, టీడీపీ నేతల ఫిర్యాదుతో విచారణ

వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేసిన కలెక్టర్

హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లొద్దని ఆదేశాలు



వీరవసంతరావు

పొదలకూరు/ అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకులు చెప్పినట్లు తూ.చా తప్పకుండా పాటించి, అవినీతి ఊబిలో కూరుకుపోయిన అధికారులపై ఇప్పుడు వేటు పడుతోంది. పొదలకూరు పూర్వపు ప్రస్తుత అనంతసాగరం తహసీల్దారు వీరవసంతరావును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆనంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పొదలకూరులో 2023 జూన్ 14 నుంచి 2024 జూన్ 5వతేదీ వరకు తహసీల్దారుగా వీరవసంతరావు పనిచేశారు. ఆయన పని చేసిన ఏడాది కాలంలో నిబంధనలకు విరుద్ధంగా భూ అక్రమాలు

- మిగతా 6లో..

'గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా పేదవాడి సొంతింటి కలను తాము నెరవేరస్తున్నాము. అక్కచెల్లెమ్మలకు ఆస్తులు ఇస్తున్నాం. కాలనీలు కాదు ఊర్లు నిర్మిస్తున్నాం' అంటూ గత ప్రభుత్వంలో ఆర్భాటంగా నేతలు ఊకదంపుడు ప్రసంగాలు చేశారు. అయితే ఆ ఇళ్ల నిర్మాణం వెనుక భారీగా అవినీతి, అక్రమాలు జరిగాయని లెక్కలతో సహా వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. పేదలకు సొంతింటి కల నెరవేర లేదు గానీ, కోట్లకు కోట్లు నిధులు మాత్రం అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లాయి.

జగనన్న లేఅవుట్లు..

అక్రమాల గుట్టలు

విజిలెన్సు విచారణతో వెలుగులోకి..

అత్యధికంగా 'ఆత్మకూరు'లో రూ.7.5 కోట్ల అవినీతి

ఇంజనీరింగ్ అసిస్టెంట్ల మెడకు బిగుస్తున్న ఉచ్చు

నెల్లూరు (జడ్పీ), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దాదాపుగా 650 జగనన్న లేఅవుట్లు ఏర్పాటు చేశారు. తొలివిడతలో అప్పటి ప్రభుత్వం 54,034 గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఒక్కో ఇంటికి రూ.1.80లక్షలు మంజూరు చేస్తున్నామని, గృహాల ను లబ్దిదారులు కట్టుకోలేకపోతే అధికారులే నిర్మించి ఇస్తారని, లేనిపక్షంలో కాంట్రాక్టర్లే కడతారని ప్రకటించింది. చివరికి కాంట్రాక్టర్లతోనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించింది. వారంతా అప్పటి వైసీపీ నాయకులు, కార్యకర్తలే కావడం విశేషం. దీంతో నిర్మాణాలు పూర్తి కాకుండానే భారీగా నిధులను దిగమింగేశారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తినప్పటికీ నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు.

● విజిలెన్సు విచారణతో వెలుగులోకి..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే గృహ నిర్మాణాల్లో అక్రమాలపై విజిలెన్సు విచారణకు ఆదేశించింది. జిల్లాలోని సర్వేపల్లి, నెల్లూరు రూరల్, కోవూరు, కావలి, ఉదయగిరి, కందుకూరు, ఆత్మకూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో విజిలెన్సు అధికారులు విచారణ చేపట్టారు. పెద్దఎత్తున అక్రమాలు జరిగినట్లు, అదనపు బిల్లుల చెల్లింపుతోపాటు సిమెంట్, స్టీలు వినియోగం లోనూ భారీగా అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఆత్మకూరు నియోజక వర్గంలో రూ.7.5 కోట్లు, ఉదయగిరిలో రూ.6 కోట్లు, సర్వేపల్లిలో రూ.7కోట్లు, కావలిలో రూ.3.12 కోట్లు, కోవూరులో రూ.7.13కోట్లు, నెల్లూరు రూరల్‌లో రూ.76లక్షలు, వెంకటగిరిలో రూ.2.29కోట్లు, కందుకూరులో రూ.1.23కోట్ల మేర నిధులు దుర్వినియోగమయ్యాయని, వీటన్నింటినీ రాబట్టాలని విజిలెన్సు అధికారులు నివేదికలో పేర్కొన్నారు.

● నేతల చుట్టూ ప్రదక్షిణ

పేదల పక్కా ఇళ్ల అక్రమాలకు సంబంధించి ప్రధాన బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లదేనని, వారందరికీ నోటీసులు జారీచేసి రాతపూర్వక వివరణ తీసు కోవాలని, అక్రమాలకు బాధ్యులపై చర్యలు చేపట్టాలని విజిలెన్సు

- మిగతా 6లో..



వెంకటాచలంలోని జగనన్న లే అవుట్‌లో గృహాలు

వైభవంగా కుర్తాళం పీఠాధిపతి శోభాయాత్ర



నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : కుర్తాళం సిద్ధేశ్వరీ పీఠం అధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి, తిరుపతి శక్తి పీఠం అధినేత్రి రమ్యానంద భారతీ స్వాగత శోభాయాత్ర బుధవారం సాయంత్రం నెల్లూరులో వైభవంగా జరిగింది. పప్పులవీధిలోని సౌభాగ్య సరస్వతి అమ్మవారి నూతన ఆలయం ప్రారంభం, విగ్రహ ప్రతిష్ఠ, మహా కుంభాభిషేకాలకు వారు విచ్చేశారు. పీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో పీఠాధిపతులకు భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. అయ్యప్పగుడి నుంచి పడారుపల్లి గంగమ్మ దేవాలయం మీదుగా సౌభాగ్య సరస్వతి ఆలయం వరకు శోభాయాత్ర సాగింది. అనంతరం భక్తులకు పీఠాధిపతులు ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ మేనేజర్ మాచవోలు అనూరాధ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



హోరాహోరీగా నర్సుల సంఘం ఎన్నికలు

● సత్యవతి ప్యానెల్ విజయం

నెల్లూరు (వైద్యం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ నర్సుల సంఘం ఎన్నికలు బుధ వారం హోరాహోరీగా జరిగాయి. ఈ ఎన్నికల్లో సత్యవతి ప్యానెల్ విజయం సాధించింది. నెల్లూరు లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గల నర్సింగ్ కళాశాలలో ఈ ఎన్నికలు నిర్వహించారు. సత్యవతి ప్యానెల్, వరలక్ష్మి ప్యానెల్ పోటీపడ్డాయి. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. వరలక్ష్మి ప్యానెల్‌లో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెంచలయ్య సతీమణి చిట్టెమ్మ జిల్లా ఉపాధ్య క్షులుగా పోటీలో ఉండటంతో ఆ ప్యానెల్‌కు ఎన్‌జీవో అసోసియేషన్ మద్దతు తెలిపి ప్రచారం చేసింది. సత్యవతి ప్యానెల్‌కు ఏపీజీఈఏ మద్దతు తెలుపుతూ ప్రచారం చేసింది. మొత్తం 219 ఓట్లకుగాను 207 ఓట్లు పోలయ్యాయి. జిల్లా అధ్యక్షురాలిగా యల్లపు సత్యవతి, కార్యదర్శిగా నెల్లిపూడి వసుంధర, కోశాధికారిగా అరుణకుమారి, ఉపాధ్యక్షురాలిగా సుమతి ఎన్నికయ్యారు. మరో 5 మంది కమిటీ సభ్యులు కూడా ఎన్నికయ్యారు. దీంతో సత్యవతి ప్యానెల్ జీజీహెచ్‌లో సంబరాలు చేసుకుంది.

ఘనంగా మహా సంప్రోక్షణ

● ముగిసిన పవిత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారంతో పవిత్రోత్సవాలు ముగిశాయి. ఉదయం హోమాలు, సాయంత్రం గోపురోత్సవం, మహాకుంభ ప్రోక్షణ జరిగాయి. పవిత్ర అవరోహణం, మహాపూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ఈవో సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.





పచ్చని చెట్ల నడుమ గ్రామం



మైపాడు తీరంలో సందర్శకుల సందడి

మన కోనసీమ ఇదేనండీ!

ఎత్తయిన కొబ్బరిచెట్లు.. పచ్చని మామిడి, అరటి తోటలు.. పక్షుల కిలకిలరావాలు.. మనస్సును ఆహ్లాదపరిచే చల్లని గాలులు ఇందుకూరుపేట సొంతం. కొనసీమకే పరిమిత మైన ఈ అందాలు జిల్లావాసులను ఆకట్టుకుంటోంది. గలగలపారే కాలువల మధ్య రొయ్యలు, చేపల గుంట లకుతోడు వరి, ఉద్యాన పంటలూ విస్తృతంగా సాగవు తున్నాయి. ఇక ఇదే మండలంలో ఉన్న మైపాడు తీరం పర్యాటకులతో ఎప్పుడూ సందడిగా ఉంటోంది. నిత్యం పరుగు ప్రపంచంలో బిజీబిజీగా గడిపే వారంతా సెలవురోజుల్లో ఇక్కడకు వచ్చి సేద తీరుతుంటారు. పండుగ, ఇతర పర్వ దినాల్లో సముద్రంలో స్నానమాచరించి, సమీపంలో ఉన్న శివాలయంలో పూజలు చేస్తుంటారు. సందర్శకుల కోసం ఇక్కడ పర్యాటక శాఖకు చెందిన 16 రిసార్ట్స్ ఉన్నాయి. ఇక విడిది చేయాలనుకునే వారు ఆన్‌లైన్‌లో రిసార్ట్స్ బుక్ చేసు కోవచ్చు. అంతేగాక ప్రముఖ పుణ్యక్షేత్రాలైన గంగపట్నంఇ లోని శ్రీచాముండేశ్వరి దేవి, లేబూరులోని కుంకాలమ్మ ఆలయాలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఈ ఆలయాలకు మన రాష్ట్రం నుంచేగాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. రొయ్య పిల్లలను ఉత్పత్తి చేసే హేచరీలు అధిక సంఖ్యలో ఉన్న మైపాడు, కొరుటూరు గ్రామాలూ ఈ మండలంలోనే ఉన్నాయి. ఇన్ని అందాలను తనివితీరా చూడాలంటే మైపాడు బీచ్‌కు వెళ్లే రహదారిలో వెళ్లాల్సిందే. ఇంకెందుకు ఆలస్యం ఇందుకూరుపేటను ఓ లుక్కేయండి!

- ఇందుకూరుపేట, ఆంధ్రజ్యోతి



మైపాడుతీరంలో అకట్టుకునేలా రిసార్ట్స్



చాముండేశ్వరి అమ్మవారి ఆలయం



రోడ్డుకు ఇరువైపులా పచ్చనితోరణంలా చెట్లు

సాగరం తహసీల్దారుపై వేటు!

(5వ పేజీ తరువాయి)

జరిగాయని టీడీపీ నేతలతోపాటు మండలవాసులు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. తోడేరుకు పక్కనే ఉన్న మరుపూరులో నకిలీ పట్టాలు సృష్టించి ఊళ్లో లేనివారి పేరుతో భూముల నమోదు, ఆదాయపు పన్ను కట్టేవారు, భూస్వాములు, కోటేశ్వరులకు ప్రభుత్వ భూములు ధారాదత్తం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే తరహాలో పులికల్లులో 40 ఎకరాలు, ప్రభగిరిపట్నంలో 28 ఎకరాలకు నకిలీ పట్టాలు సృష్టించి ప్రభుత్వ భూముల స్వాహా చేశారు. పొదలకూరు మండల వ్యాప్తంగా ఇదే తరహాలో అక్రమాలు జరిగాయి. అసైన్‌మెంట్ రివ్యూ కమిటీ అనుమతి పొందకుండా, వీఆర్వో, ఆర్‌ఐ సంతకాలు లేకుండా, ఉన్నతాధికారులకు తెలియకుండానే వందల ఎకరాలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టి రూ.కోట్లలో దోపిడీ చేశారని ఆధారాలతో సహా టీడీపీ నాయకులు, బాధిత రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. కొండ పోరంబోకు, వాగు పోరంబోకు, మేత పోరంబోకులతో సహా ఏ ప్రభుత్వ భూములనూ వదిలిపెట్టలేదు. క్షేత్రస్థాయి విచారణలో భాగంగా రికార్డులను పరిశీలించే క్రమంలో జిల్లా ఉన్నతాధికారులు వీరవసంతరావు లీలలను చూసి విస్తుపోయారు. చేసిన తప్పులతో వీరవసంతరావు అడ్డంగా దొరికిపోవడంతో సస్పెన్షన్ చేయడంతోపాటు హెడ్ క్వార్టర్స్ వదిలి వెళ్లవద్దని ఆదేశాలు జారీ చేశారు. మరోవైపు ఎన్నికల అనంతరం అనంతసాగరం తహసీల్దారుగా విధుల్లో చేరిన వీరవసంతరావు ఇక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోలేక పోయారు.

రేపటి నుంచి

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలి పర్యటన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 23 : ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బీ పద్మావతి శుక్ర, శనివారాల్లో జిల్లాలో పర్యటిస్తారని కలెక్టర్ ఆనంద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పిల్లలతో డ్రగ్స్ అక్రమ రవాణాను నిరోధించడానికి జిల్లాలో అమలౌతున్న విధానాలను ఆమె పరిశీలిస్తారని తెలిపారు. శుక్రవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు బీసీ, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు, అధికారులతో సమీక్షిస్తారని తెలిపారు. 26వతేదీ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు విద్యాశాఖలోని అన్నీ విభాగాల అధికారులు, కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. ఆరోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్థానికంగా ఉన్న వైద్యశాలలను, సచివాలయాలను సందర్శిస్తారని తెలిపారు.

నెల్లూరు బాగుందని

అందరూ అనాలి

- ఇదే నా ప్రణాళిక.. ఆ మేరకే కసరత్తు
- కొత్తగా 300 సీసీకెమెరాలతో పారిశుధ్యం పరిశీలన
- పోస్టర్ల నిర్మూలనకు రెండు ఫైరింజన్లతో డ్రైవ్
- 'ఆంధ్రజ్యోతి'తో కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ

నగరవాసులకు మంచినీరు, వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తెచ్చేందుకు కసరత్తు మొదలైంది. పారిశుధ్య వ్యవస్థను మెరుగుపరుస్తూనే పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పుడున్న గ్రీనరీ కంటే మరింత పెంచేందుకు అవకాశాలు ఉన్నాయి. వాటిని పూర్తిగా వినియోగించుకోనున్నాం. పారిశుధ్య పనుల పర్యవేక్షణకు ఇప్పుడు సీసీకెమెరాలకు అదనంగా మరో 300 కెమెరాలను అమర్చనున్నాము. కమాండ్ కంట్రోల్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటాం. మేము ఎంత నూతన ప్రణాళికలతో ముందు కొచ్చినా ప్రజల్లో అవగాహన లేకపోతే ఫలితముండు.

● పోస్టర్ రహితానికి రెండు ఫైరింజన్లు నెల్లూరులో పోస్టర్లు లేకుండా చేసేందుకు నిత్యం అగ్నిమాపక శాఖకు చెందిన రెండు ఫైరింజన్లతో పర్యవేక్షిస్తున్నాము. ఉదయం, సాయంత్రం పూట ప్రధాన కూడళ్లు, రోడ్లు, డివైడర్లు, గోడలున్న ప్రాంతాలలో ఈ వాహనాలు తిరుగుతూ పోస్టర్లు కనబడిన వద్ద ఆగి నీటినికొట్టి తొలగించడం జరుగుతుంది. ఇక డివైడర్లు లేనిచోట కొత్తవి నిర్మించి, ఉన్నచోట మొక్కలు నాటి నూతన అందాన్ని నెల్లూరుకు అదనంగా సమకూర్చునున్నాము.

● ఫైల్స్ తయారీలోనూ పారదర్శకత ఇక పలు అంశాలకు సంబంధించి రూపుదిద్దే ఫైళ్లను మా కార్యాలయం ద్వారానే నడవాలన్నది కఠిన నిర్ణయంగా అమలులోకి తెచ్చాము. ప్రతి కాగితం ఆన్‌లైన్ ద్వారా నా ముందు కు వచ్చేలా ఆదేశాలిచ్చాను. దీని వల్ల నకిలీ, అవినీతికి తావుండదు. 99 శాతం ఫైళ్ల తయారీ వద్దే అక్రమాలు నిలిచిపోతాయి. మిగిలిన 1 శాతం ఆయా విభాగాధిపతి సదరు ఫైళ్లపై వివరణ ఇచ్చేటప్పుడు ఫుల్‌స్టాప్ పడుతుంది. ఇక ప్రజలు తమ సమస్యలను తెలుపుకునేందుకు స్వయం గా ఎన్‌ఎంసీకి రావాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్ ద్వారా పంపే వెసులుబాటు కల్పించాము. ఇది పనివేళల్లో పూర్తి అందుబాటులో ఉంటుంది. ఇందుకు ప్రత్యేక దళాన్ని ఏర్పాటు చేశాము. వచ్చిన ఫిర్యాదులపై నెల్లూరులోని సచివాలయ ఉద్యోగులను పూర్తిగా వాడుకుంటున్నాము.

● **వర్షాల నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్**

వర్షాలనైతే సమర్థవంతంగా ఎదుర్కొన్నాము. కానీ ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాము. డ్రైనేజీ కాలువల్లో పూడికను తొలగించడంతో పాటు ఖాళీ స్థలాల్లోని అపరిశుభ్రాన్ని ఇటు కార్పొరేషన్, అటు యజమానులతో కలిసి తీయిస్తున్నాము. రోడ్లపై నిర్మాణాల వ్యర్థాలను పూర్తిగా తొలగించడంతోపాటు దోమల నివారణకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రజలు కూడా తమ వంతు పాత్ర నిర్వర్తించాలి. వ్యర్థాలను రోడ్లపై వేయకుండా డస్ట్‌బిన్స్ లేదా ఇంటి ముందుకు వచ్చే మా వాహనాల్లో వేస్తే చాలు."



- నెల్లూరు సిటీ, (ఆంధ్రజ్యోతి)

ఎందుకంత నిర్లక్ష్యం?

(5వ పేజీ తరువాయి)

ఉంది. ఈ నెల 10వ తేదీన ప్రభుత్వం జీవో ఇవ్వగా, ఆ మరుసటి రోజునే ఏఏ వర్కుకు ఎంత మేర కేటాయింపులు ఇచ్చారన్నది ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అందుకు అనుగుణంగా జిల్లాలో ఎస్టిమేషన్లు రూపొందించి టెక్నికల్ అనుమతుల అనంతరం టెండర్లు పిలవాల్సి ఉంది. కానీ ప్రభుత్వం నుంచి రావడమే ఆలస్యమనుకుంటే జిల్లాలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమవుతోంది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చి రెండు వారాలు కావస్తోంది. కానీ ఇంత వరకూ ఎస్టిమేషన్లు కూడా పూర్తి కాలేదు. ఒక్క నెల్లూరు సబ్ డివిజన్ నుంచి మాత్రమే ఎస్టిమేషన్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు అందాయి. మిగిలిన డివిజన్ల నుంచి వస్తే గానీ సెంట్రల్ డివిజన్ నుంచి టెక్నికల్ అప్రూవల్ కోసం ఉన్నతాధికారులకు వెళ్లవు. ఇక టెక్నికల్ అప్రూవల్ వచ్చాక గానీ టెండర్లు పిలవడం సాధ్యం కాదు. కనీసం షార్ట్ టెండర్ ప్రక్రియ వారం రోజులైనా పడుతుంది. ఆ తర్వాత అగ్రిమెంట్, పని పూర్తి చేయడానికి మరో రెండు వారాలైనా పడుతుంది. ఈ లోపు సీజన్ మొదలవుతుంది. కాలువల్లోకి కూడా నీరు విడుదల చేయాల్సి వస్తుంది. అప్పుడు పనులు చేయడం కష్టమవుతుంది. ఇరిగేషన్ అధికారుల తీరుతో రైతాంగం ఆందోళన చెందుతోంది.

శుక్రవారం లోపు పంపుతాం

కాలువల అత్యవసర పనులకు సంబంధించి ఒక సబ్ డివిజన్ నుంచి ఎస్టిమేషన్లు అందాయి. మిగిలిన సబ్ డివిజన్ల నుంచి అందాల్సి ఉంది. వీటన్నిటినీ తెప్పించుకొని శుక్రవారంలోపు టెక్నికల్ శాంక్షన్ కోసం పంపుతాం. అనుమతులు రాగానే టెండర్లు పిలిచి రైతులకు ఇబ్బందులు లేకుండా పూడిక తీత పనులు పూర్తి చేస్తాం.

- నాగరాజు, ఇరిగేషన్ సెంట్రల్ డివిజన్ ఈఈ

అక్రమాల గుట్టలు

(5వ పేజీ తరువాయి)

అధికారులు పంచాయతీరాజ్ శాఖ ఎస్‌ఈకి మంగళవారం నివేదిక అందించారు. దీంతో ఇంజనీరింగ్ అసిస్టెంట్లలో వణుకు మొదలైంది. గత ప్రభుత్వంలో పాలకులు చెప్పిన విధంగానే తాము చేశామని, కాపాడాలంటూ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. హౌసింగ్‌లో భారీ అక్రమాలు, అవినీతి తమకు గండంగా మారతాయేమోనన్న తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

నిరక్షరాస్యుల కోసం 'ఉల్లాస్'

- మహిళల్లో అక్షరాస్యత పెంపే లక్ష్యం
- జిల్లాలో 19,178 మంది టార్గెట్
- ఐదు నెలల్లో లక్ష్యసాధనకు ప్రణాళిక

నెల్లూరు విద్య, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) :2010లో నిర్వహించిన అక్షరాస్యత కుటుంబ సర్వే ప్రకారం 15 సంవత్సరాలు పైబడిన చదువురాని వారు జిల్లాలో 5,68,330 మంది ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు వీరికి 7 కోర్సులు నిర్వహించగా 4,18,373 మందిని అక్షరాస్యులుగా చేశామని, ఇంకా 1,53,458 మందిని చేయాల్సి ఉందన్నారు. అల్లూరు, అనంతసాగరం, చిల్లకూరు, కలువాయి, కొండాపురం, సైదాపురం ప్రాంతాల్లో పడ్‌నా-లిఖ్‌నా కార్యక్రమం ద్వారా మరో 15,158 మందిని అక్షరాస్యులుగా తయారు చేశామని చెబుతున్నా వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం 2021లో అక్షరచైతన్యం-1 పేరుతో ఉమ్మడి జిల్లాలోని 40 మండలాల్లో 1,33,438 మంది నిరక్షరాస్యులను గుర్తించి వారికి ఓపెన్‌స్కూల్ ద్వారా పరీక్షలు కూడా నిర్వహించామని, వీరిలో అత్యధిక మంది ఉత్తీర్ణత సాధించడంతో జిల్లా అక్షరాస్యత 16శాతం పెరిగిందని తెలిపారు.

● **ప్రతిష్ఠాత్మకంగా ఉల్లాస్ నిర్వహణ**

నిరక్షరాస్యులను అక్షరాస్యులను చేయడమే లక్ష్యంగా ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. పొదుపు సంఘాల మహిళలు, పాఠశాలల్లో పనిచేస్తున్న సహాయకులు, వంటపని చేసేవారు, కాపాలాదారులు, ఆయాలు, అంగన్‌వాడీ కేంద్రాల సహాయకుల్లో నిరక్షరాస్యులను గుర్తిస్తారు. ప్రభుత్వ, జడ్పీ, ఎయిడెడ్ యాజమాన్యాలతోపాటు కేజీబీవీ, ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న వారినీ పరిగణలోకి తీసుకోనున్నారు. డీఆర్‌డీఏపరంగా గ్రామైక్య సంఘాల వివరాలను వీవోఏ, సీసీలు సేకరించునున్నారు. ఈ ప్రక్రియ అనంతరం ప్రతి పదిమందికి ఒక వలంటీరును (సంఘంలో విద్యావంతులైన వారు) ఎంపిక చేస్తారు. వీరందరికీ వయోజన విద్యాశాఖ ద్వారా పుస్తకాలు అందచేయడంతోపాటు టీసీఎస్ కంపెనీ సహకారంతో ఫంక్షనల్, డిజిటల్, ఆర్థిక అక్షరాస్యతకు సంబంధించిన వీడియోలను ప్రదర్శిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ



అభ్యసన తరగతులు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నిర్వహణలో ఏడుశాఖలను భాగస్వాములను చేయనున్నారు. వయోజన విద్య, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్, డీపీఓ, సచివాలయం, డీపీఆర్‌ఓ, విద్యాశాఖ అధికారులతో జిల్లాస్థాయి కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీరితో పాటు జిల్లాకు ఒక నోడల్ అధికారి కూడా పనిచేయనున్నారు. రాష్ట్రస్థాయిలో ఈ నెల 25వతేదీ నుంచి నిర్వహించే శిక్షణా తరగతులకు వయోజనవిద్య, డీఆర్‌డీఏ నుంచి ఇద్దరేసి చొప్పున అధికారులు హాజరు కానున్నారు. అనంతరం ఎంపీడీఓ, ఏపీఎంలకు జిల్లాస్థాయిలో, సీసీ, వీవోఏ, వాలంటీర్లకు మండల స్థాయిలో శిక్షణ నిర్వహిస్తారు.

అక్షరాస్యత సాధించడమే లక్ష్యం

2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లా అక్షరాస్యత 69.90 శాతం ఉండేది. అయితే అక్షరచైతన్యం-1 కార్యక్రమం ముగిసిన తరువాత 84శాతం అక్షరాస్యతను సాధించాము. నెల్లూరు రూరల్‌లో 80.73శాతం అత్యధిక అక్షరాస్యత కలిగి ఉండగా తక్కువగా డక్కిలిలో 57.57 శాతం ఉంది. రాష్ట్రస్థాయిలో జిల్లా ఆరోస్థానంలో ఉంది. అన్ని ప్రాంతాల్లో అక్షరాస్యత పెంచే దిశగా విస్తృత కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నాము. వందశాతం పెంచేందుకు తాజాగా అక్షరచైతన్యం-2 కార్యక్రమం ప్రారంభించాము. జిల్లాలోని 37 మండలాల్లో 51,742 మందికి అక్షర తరగతులు నిర్వహిస్తున్నాము.

- ఎస్.మహమ్మద్ అజాద్, డిప్యూటీ డైరెక్టర్, వయోజన విద్య

న్యూస్ బాక్స్

వైభవంగా ప్రతిష్ఠోత్సవాలు


గ్రామోత్సవంలో స్వామివారు

కలిగిరి (ఆంధ్రజ్యోతి), అక్టోబరు 23: పట్టణంలోని కొత్తూరు ప్రాంతంలో గల శ్రీకోదండరామస్వామి ఆలయంలో హనుమత్ సమేత సీతా,రామ,లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. స్వామివారి విగ్రహాలు గ్రామోత్సవానికి రాగా భక్తులు కాయ కర్పూరం సమర్పించారు. గురువారం స్వామివారం శిలాబింబాలకు పాలభిషేకం, క్షీరాదివాసం, ప్రత్యేక పూజలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయ ప్రాంగణ వద్ద భక్తులకు అన్నసంతర్పణ ఏర్పాటు చేశామన్నారు. చిన్నారులు ప్రదర్శించిన కోలాటం భక్తులను ఎంతో అలరించింది.

ప్రసన్నుడి హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న భక్తులు

బిట్రగుంట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : బోగోలు మండలం కొండబిట్రగుంట ప్రసన్న వేంకటేశ్వరస్వామి హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించారు. ఈవో రాధాకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పార్లపల్లి గ్రూపు టెంపుల్స్ ఈవో సీహెచ్ యానాదయ్య పర్యవేక్షణా. దికారిగా వ్యవహరించారు. 113 రోజులకు భక్తులు ఇచ్చిన కానుకలు రూ. 16, 44, 440 వచ్చినట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో పాలక మండలి మాజీ సభ్యులు తులసీరామ్, కావలి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ లక్ష్మీనారాయణ, సిబ్బంది, భక్తులు తదితరులు ఉన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

సంగం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘంలో ఇటీవల బొలెరా వాహనం చోరీ కేసులో నిందితుడ్ని బుధవారం సంగం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల మేరకు... గ్రామానికి చెందిన జి వెంటేశ్వర్లు నాలుగు రోజుల కిందట తన బొలెరా వాహనాన్ని ఇంటి ముందు నిలిపి నిద్రించాడు. నిద్రలేచి చూడగా వాహనం లేదు. చుట్టూ విచారించారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో వాహనాన్ని బాధితుడికి సోదరుడైన మల్లికార్జున తీసుకెళ్లినట్లు తెలియడంతో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని పిడుగురాళ్లలో ఉన్న వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితుడ్ని కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

ఎల్లలు దాటుతున్న తెల్లరాయి

- ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు

వలేటివారిపాలెం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలినేని చెరువు ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో అక్రమంగా తెల్లరాయి తవ్వకాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండానే అటవీ, ప్రభుత్వ భూముల్లో సైతం తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో తెల్లరాయి సరిహద్దులు దాటుతోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.


ఎగుమతికి సిద్ధంగా ఉన్న తెల్లరాయి

● ప్రభుత్వ ఆదాయానికి గండి

కొన్నేళ్లుగా పోలినేనిచెరువు, చుండి, వలేటివారిపాలెం, మాలకొండ, తదితర గ్రామాల్లోని రెవెన్యూ అటవీ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న తెల్లరాయి వ్యాపారంతో ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. ఒక్కో తెల్లరాయి లారీ లక్షన్నర నుండి రెండు లక్షల వరకూ ధర ఉంటుంది. కొల్లగొట్టిన తెల్లరాయిని లారీలు, టిప్పర్లలో రాత్రిళ్లు ఎల్లలు దాటిస్తున్నారు. అంతేగాకుండా తెల్లరాయి పెద్దపెద్ద గుండ్లను ఎక్స్‌కవేటర్లతో పెకళించి టిప్పర్ల ద్వారా రహస్య ప్రదేశానికి తరలించి రాయిని చిన్న సైజులుగా చేసి అక్కడ నుంచి రాత్రి వేళల్లో రవాణా చేస్తున్నారు.

● అనుమతులు నిల్

ఎక్కడైనా తెల్లరాయి తవ్వకాలు జరపాలంటే రెవెన్యూ శాఖ అనుమతులు పొందాలి. అలాగే కూలీలకు లేబర్‌చట్టం కింద కనీస వేతనం చెల్లించడంతోపాటు 8 గంటలు మాత్రమే పనిచేయించాలి. పనిచేసే ప్రదేశంలో అన్ని సౌకర్యాలు కల్పించాలి. సేకరించిన తెల్లరాయిని తరలించాలన్నా అనుమతి తప్పనిసరి. ఇలాంటిదేమీ లేకుండా అక్రమార్కులు ప్రభుత్వ భూముల్లోని తెల్లరాయిని యథేచ్ఛగా తరలిస్తున్నారు.

● దాడులు శూన్యం

తెల్లరాయి తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నా అధికారుల దాడులు మాత్రం శూన్యం. అక్రమ తెల్లరాయి తవ్వకాలు జరుగుతున్న ప్రదేశం అధికారులకు తెలిసినప్పటికీ కనీసం అటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదని, తవ్వకాల వల్ల భూములు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని, ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి అక్రమ తెల్లరాయి తవ్వకాలపై నిఘా పెట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాళ్లపాడు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోండి

● ఎమ్మెల్యే ఇంటూరికి నియోజకవర్గ అభివృద్ధి మండలి వినతి


ఎమ్మెల్యే ఇంటూరితో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివి శివరాం, తదితరులు

కందుకూరు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 100కి పైగా గ్రామాలకు తాగునీటికి ఆధారంగా మారిన రాళ్లపాడు రిజర్వాయరులో చేపల పెంపకం వలన జలాలు కలుషితమవుతున్నందున తగినచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకు నియోజకవర్గ అభివృద్ధి మండలి ప్రతినిధులు విజ్ఞప్తిచేశారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం నేతృత్వంలో స్థానిక కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యేని కలిసి ప్రతినిధులు రాళ్లపాడు రిజర్వాయరు జలాల ల్యాబ్ రిపోర్టును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా శివరాం మాట్లాడుతూ రాళ్లపాడు రిజర్వాయరులో సహజసిద్ధంగా పెరిగిన చేపలను మాత్రమే పట్టుకోవాలి తప్ప దానిని చేపల చెరువుగా మార్చి పిల్లలు వేసి వాటికి మేతలు, కోళ్లవ్యర్థాలు వేస్తున్నందున జలాలు కలుషితమవుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జలాలు కలుషితం కావటానికి కారణం అక్కడ శుద్ధిచేసే పరికరాలు మార్చి 8 సంవత్సరాలు అయినందున సమస్య వచ్చిందని, ఇటీవలే వాటిని మార్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధిమండలి ప్రతినిధులు పాలేటి కోటేశ్వరరావు, కాకుమాని మాధవరావు, నేతి మహేశ్వరరావు, తోకల వెంకటేశ్వర్లు, నరేష్ పాల్గొన్నారు.

అనకట్ట ఆక్రమణలు అరికట్టాలి

● లింగసముద్రం: పంచాయతీలోని వాకమళ్లవారిపాలెం సమీపంలోని పొలాల్లో ఉన్న చిన్న అనకట్ట (సాగు నీటి కుంట)కు చెందిన భూముల ఆక్రమణలను అరికట్టాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వర రావుకు టీడీపీ నేతలు విజ్ఞప్తి చేశారు. బుధ వారం పంచాయతీలోని జంపాల వారిపాలెం టీ డీపీ నాయకులు జంపాల కృష్ణయ్య, చింతల వెంకటేశ్వర్లు, కోనూరు రమణయ్య మరి కొందరు కందుకూరులో ఎమ్మెల్యేను కలిసి ఆక్రమణలు తొలగించాలని వినతి పత్రం ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి వెంటనే తహసీల్దారు శ్రీనివాసులకు ఫోన్‌చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వారు తహసీల్దారును కలిసి వినతిపత్రం అందజేయగా తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

కల్వర్టు నిర్మాణ పనులు ప్రారంభం

సోమశిల ఉత్తర కాలువ నుండి కలిగిరి మండలం జిర్రావారిపాలెం వద్ద నీటి ప్రవాహం రాళ్లపాడు ప్రాజెక్టుకు సక్రమంగా రాకపోవడంతో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తన స్వంత నిధులు రూ.5 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. గురువారం సాయంత్రం కల్లా పనులు పూర్తి చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

అధ్యాపకులను నియమించాలి

● గుడ్లూరు : జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అధ్యాపకులను నియమించాలని ఎమ్మెల్యేను విద్యార్థులు కోరారు. బుధవారం కందుకూరు నుంచి గుడ్లూరు మీదగా ఎమ్మెల్యే నెల్లూరుకు వెళ్తున్నట్లు సమాచారం అందుకున్న కొందరు ఉపాధ్యాయులు, విద్యార్థులు గుడ్లూరు హైస్కూల్ రోడ్డు వద్ద ఎమ్మెల్యేను ఆపి తమ సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే డీఈవోకి ఫోన్ చేసి అధ్యాపకుల నియామకాలకు రంగం సిద్ధం చేయాలని సూచించారు. అధ్యాపకులను నియమించేలా చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆటో ఢీకొని వృద్ధుడి మృతి

జలదంకి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామవరప్పాడు బస్టాండు సమీపంలో బుధవారం ఆటో ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన దావులూరి మాలకొండయ్య(65) మృతిచెందాడు. మాలకొండయ్య ఇంటి వద్ద నుంచి పని మీద రోడ్డుపై నడిచి వెళుతుండగా ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఆయన్ను నెల్లూరుకి తరలించ గా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ లతీఫున్నీసా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ బలోపేతానికే సభ్యత్వ నమోదు : కాకర్ల



వింజమూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా బుధవారం వింజమూరు మండలం బొమ్మరాజు చెరువు గ్రామంలోని పార్టీ కార్యాలయంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సభ్యత్వ నమోదు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ముందుగా పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 26వతేదీ నుంచి టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని, అత్యధికంగా సభ్యత్వాలు నమోదు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

'లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు సహించం'

కందుకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తన పాలనలో రాష్ట్రంలో మహిళలు, విద్యార్థినులపై విచ్చలవిడిగా అఘాయిత్యాలు జరిగితే కనీసం నోరు విప్పని పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ఇవ్వాళ రాష్ట్రంలో మహిళలకు కనీస భద్రత లేదని అసత్య ఆరోపణలు చేస్తుండటం హేయమని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్ విమర్శించారు. రాష్ట్రమంత్రి లోకేష్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించమని ఆయన హెచ్చరించారు.

జీవాలకు టీకాలు వేయించాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో బుధవారం నట్టల నివారణ కార్యక్రమం చేపట్టినట్లు పశు వైద్యాధికారి అనూష తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 1500 జీవాలకు ఈ మందు తాపించినట్లు ఆమె తెలి పారు. వర్షాలు కురుస్తున్నందున జీవాలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిం చుకోవాలని ఆమె యజ మానులుకు సూచించారు.

చెరువులకు మహర్దశ

- రూ.1,81 కోట్ల జైకా నిధులతో అభివృద్ధి

ఉదయగిరి రూరల్ (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లోని చెరువులను జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ ఏజెన్సీ (జైకా) రూ.1.81 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. వాస్తవానికి ఈ నిధులు గత వైసీపీ ప్రభుత్వంలోనే (2021) మంజూరవగా, నిధులు దారి మళ్లించడంతో చెరువులు అభివృద్ధికి నోచుకోలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయా చెరువులను అభివృద్ధి చేసేందుకు నడుం బిగించింది. పనులు పూర్తయితే వందల ఎకరాల ఆయకట్టు భూమి అభివృద్ధికి రానుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఉదయగిరి సబ్ డివిజన్‌లోని ఉదయగిరి చిన్న, పెద్ద చెరువులను రూ,48 లక్షలు, గువ్వాడి రూ.23, ఇస్కపల్లి రూ.27, కృష్ణం పల్లి రూ.32 లక్షలు, లింగంనేనిపల్లి రూ.51 లక్షల చొప్పున మరమ్మతులు చేపట్టనున్నారు. ఇప్పటికే కొన్ని చెరువుల్లో పనులు మొదలయ్యాయి. పనులు పూర్తయితే పూర్తి ఆయకట్టు సాగులోకి వస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి మాట్లాడుతూ చెరువుల మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ

మర్రిపాడు, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 23 : అభివృద్ధి పేరుతో కేతిగుంట పంచాయతీలో సర్పంచ్ హరితేజ నిధులు దుర్వినియోగం చేశారని గ్రామస్థుల ఫిర్యాదుతో డీఎల్‌పీవో నారాయణ బుధవారం విచారణ చేపట్టారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేసి వారి అభిప్రాయాలు తీసుకున్నారు. పల్లిపాడులోని ఎస్సీ కాలనీలో ఓ పంపు సెట్ మరమ్మతులకు ఏకంగా రూ. 98400 ఖర్చు చేసినట్లు ఎంబుక్‌లో రికార్డుచేసి నగదు డ్రాచేశారు. ఇలా రికార్డు అస్తవ్యస్తంగా ఉన్నట్లు డిఎల్‌పీవో గుర్తించారు. అనంతరం గ్రామంలో పర్యటించి పనులు జరిగినట్లు రికార్డుల్లో ఉన్న ప్రాంతాలను పరిశీలించి నివేదికను తయారుచేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని డీఎల్‌పీవో తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ రమేష్ ఉన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యం : డీఎస్పీ

ఆత్మకూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక కార్యకలాపాల నివారణే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ కె వేణుగోపాల్ తెలిపారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని టిడ్కో గృహాల సముదాయంలో బుధవారం తెల్లవారుజాము నుంచి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఆత్మకూరు సర్కిల్ పరిధిలోని ఇద్దరు సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పెద్దఎత్తున మోహరించి ప్రతి ఇంటిని తనిఖీ చేసి వివరాలు సేకరించారు. సరైన పత్రాలు లేని 12 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

ఏఎస్ పేట, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): హసనపురం గ్రామంలో ఇటీవల నూతనంగా ఏర్పాటుచేసిన మద్యం షాపును అక్కడనుంచి తొలగించాలని బుధవారం హసనపురం గ్రామా నికి చెందిన ముస్లింలు తహసీల్దారు శ్రీరామకృష్ణకు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొండ పోరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన గదిలో మద్యం దుకాణం ఏర్పాటుచేశారని, ఆ దుకాణం దర్గా, గుడికి సమీపంలో ఉండడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ఆ షాపును అక్కడినుంచి తొలగించి వేరే ప్రదేశానికి మార్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాం

● సీహెచ్ మణికుమార్ పంచాయతీరాజ్ డీఈ



ఉదయగిరి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ నిధులతో నియోజకవర్గంలో చేపడుతున్న సిమెంట్‌రోడ్ల నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతోపాటు త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చర్యలు చేపడతామని పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ మణికుమార్ పేర్కొన్నారు.

నియోజకవర్గంలో ఎన్ని రోడ్లు, ఎంత నిధులతో వేస్తున్నారు?

!: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 333 సిమెంట్‌రోడ్లను రూ.19. 26 కోట్లతో నిర్మిస్తున్నాం.

ఏఏ మండలాల్లో ఎన్ని రోడ్లు, ఎంత నిధులు కేటాయించారు?

!: నియోజకవర్గంలోని దుత్తలూరు మండలంలో 57 రోడ్లకు రూ.2.65 కోట్లు, జలదంకిలో 36 రోడ్లకు రూ.2.37 కోట్లు, కలిగిరిలో 25 రోడ్లకు రూ.2. 36 కోట్లు, కొండాపురంలో 40 రోడ్లకు 2.40 కోట్లు, సీతారామపురంలో 51 రోడ్లకు రూ. 2.38 కోట్లు, వరికుంటపాడులో 44 రోడ్లకు రూ. 2.36 కోట్లు, ఉదయగిరిలో 41 రోడ్లకు రూ.2.36 కోట్ల నిధులు కేటాయించాం.

నిర్మాణ పనులు ప్రారంభించారా?

!: నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో ఇప్పటికే పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని గుత్తేదారులకు తగు సూచనలు అందజేశాం.

28న ప్రజావేదిక

అనంతసాగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి) 23: స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ఈనెల 28న జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని జిల్లా కలెక్టర్ ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేయాలని మండల అధికారులకు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించేలా ఈ కార్యక్రమం ఉంటుందని, అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని, ఈవిషయం ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలని ఆదేశించారు.

ఏర్పాట్ల పరిశీలన

అనంతసాగరం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమం కోసం చేస్తున్న ఏర్పాట్లను ఆత్మకూరు ఆర్డీవో పావని బుధవారం పరిశీలించారు. ఈమేరకు మండల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మెట్టుకూరు కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

అపార్ రిజిస్ట్రేషన్ పూర్తిచేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అపార్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం పూర్తిచేయాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు 1-10వ తరగతి చదివే విద్యార్థులకు అపార్ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, సీఆర్ ఎంటీలు పాల్గొన్నారు.

వర్గీకరణ, క్రీమీలేయర్ వద్దు

కందుకూరు, అక్టోబరు 23: ఎస్సీ వర్గీకరణ, క్రీమీలేయర్ వద్దని కోరుతూ మాలమహానాడు ఆధ్వర్యంలో బుధవారం సబ్ కలెక్టరు శ్రీపూజకు వినతిపత్రం అందజేశారు. మాల మహానాడు రాష్ట్ర జేఏసీ గౌరవాధ్యక్షుడు పాలేటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు సబ్ కలెక్టరును కలిసి రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఈ వినతులు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బొటగుంట శ్రీనివాసులు, గుంటక మల్లిఖార్జున, చనమాల వాసు, గంటెనపల్లి ప్రసాదు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

లింగసముద్రం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గతంలో జరిగిన భూముల రీసర్వేలో జరిగిన తప్పులను సరిచేసుకునేందుకు రైతులు రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని విశ్వనాధపురంలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ గ్రామసభల ద్వారా భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో 16 మంది రైతులు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచు బొల్లినేని నాగేశ్వరరావు, వీఆర్వోలు కిషోర్, బ్రహ్మయ్య, సర్వేయరు శివసాయి, బాలాజీ, వినోద్ రైతులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

లింగసముద్రం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో శనగ పైరు సాగుచేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసిన తర్వాత విత్తనాలను విత్తుకోవాలని మండల వ్యవసాయ అధికారి టి అబ్రహాంలింకన్ చెప్పారు. బుధవారం మండలంలోని వీఆర్ కోట, మాలకొండరాయునిపాలెం గ్రామాలలోని రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధితో తెగుళ్లు, పురుగుల బెడద తప్పుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు జె ప్రవీణ్, డ్రిప్ ఇరిగేషన్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.